RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




13 ఫిబ్రవరి 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:217



మలక్ పేట్ ప్రజాబలం ప్రతినిధి:బంజారాల ఆరాధ్యదైవం మహావీర్ సంత్ ( సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15 న నిర్వహించే ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. మంత్రి ధనసరి సీతక్క , గిరిజన సంఘాల ముఖ్య నాయకులు ముఖ్యమంత్రి ని కలిసి ఆహ్వానం అందించగా, ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు.

## నా స్నేహితుడిని కలవడం చాలా సంతోషంగా ఉంది.. ప్రధాని మోదీ



పారిస్, ఫిబ్రవరి 12, (న్యూస్ పల్స్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. 3 రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వెళ్లగా.. సోమవారం రోజు ఉదయం అక్కడకు చేరుకున్నారు. ఏఐ శిఖరాగ్ర సమావేశానికి ముందుగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశం అయ్యారు. అలాగే విందులో కూడా పాల్గొన్నారు. అక్కడే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం కలుసుకున్నారు. అయితే తాజాగా దీనిపై స్పందిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో తన స్నేహితుడిని కలవడం చాలా సంతోషంగా ఉందంటూ ట్వీట్ చేశారు. మరి ఆ స్నేహితుడు ఎవరో తెలుసుకుందాం.ముందుగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను కలిశారు. ఈక్రమంలోనే ఆయన మోదీని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ముందు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ, యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో సహా అతిథులకు విందు ఇచ్చారు. ఈక్రమంలోనే ముగ్గురు నాయకులు ఒకరితో ఒకరు సంభాషించుకుంటూ కనిపించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అంశం ఏమిటంటే అధ్యక్షుడు మాక్రాన్ ఆయనకు ఇచ్చిన సమయం, గౌరవం. మొదటి రోజు అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ ఇచ్చిన విందులో ఆయనతో గడిపారు.మరోవైపు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అందులో ఫ్రాన్స్ అధ్యక్షుడు, తన స్నేహితుడు అయిన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆయనను ఆలింగనం చేసుకున్న ఫొటోతో పాటు ఆత్మయంగా మాట్లాడుతున్న ఫొటోను షేర్ చేశారు. దీంతో పాటే మరో పోస్ట్ పెట్టిన మోదీ.. అక్కడి ప్రజలు మర్చిపోలేని స్వాగతాన్ని పలికారని చెప్పారు. భారత ప్రవాసులకు కృతజ్ఞతలు చెబుతూనే.. వారి విజయాల పట్ల గర్వంగా ఉందని వెల్లడించారు.స్నేహానికి ఒక అసాధారణ చిహ్నంగా, వారు ఉమ్మడి మోటారుకేడ్‌లో, ఒకే విమానంలో మార్సెయిల్‌కు ప్రయాణించారు. అధ్యక్షుడు మాక్రాన్ ప్రధాని మోదీ దిగిన వెంటనే మార్సెయిల్‌లో వర్కింగ్ డిన్నర్‌కు ఆతిథ్యం ఇచ్చారు. ఈరోజు అధ్యక్షుడు మాక్రాన్ మార్సెయిల్‌లో భారత కాన్సులేట్‌ను ప్రారంభించడానికి ప్రధాని మోదీతో కలిసి వెళ్లడంతో ఈ ప్రత్యేక బంధం మరింతగా వెలుగులోకి వస్తుంది. మాక్రాన్ లాంటి నాయకుడు ఏ ప్రపంచ నాయకుడికైనా ఇంత సాన్నిహిత్యం, సమయం ఇవ్వడం చాలా అరుదు అని అన్నారు మోదీ.

## వనపర్తికి ఐ.టి టవర్ మంజూరు

రూ. 22 కోట్లు విడుదల

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

-రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి



వనపర్తి ప్రజాబలం ప్రతినిధి:జిల్లాకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు.బుధవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయ మీడియా సెంటర్లో విలేకరుల సమావేశంలో జి. చిన్నారెడ్డి ఐ.టి టవర్ మంజూరు అంశాలను వెల్లడించారు.వనపర్తి లో ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ 22 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఐ టీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి తెలిపారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ వన్ తేదీ 11-2-2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగుల లో ఐటీ భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు.గ్రామీణ ప్రాంతంలో ఐటి అబ్బులను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయిందని సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.వనపర్తి కి మంజూరు అయిన హైటు టవర్ ను ఒక సంవత్సరం కాలంలో నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఐటీ ప్రొఫెషనల్ ప్రొఫెషనల్ స్కూల్ ఐటీ టవర్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లాకు ఇది శుభవార్త అని చిన్నారెడ్డి తెలిపే పేర్కొన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటీ టవర్ మంజూరు అయిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చిన్నారెడ్డి

## ఎపిలో పెట్టుబడులకు సిఫి చైర్మన్ సుముఖత: మంత్రి లోకేష్

అమరావతి ఫిబ్రవరి 12 : ఎపిలో పెట్టుబడులకు సిఫి చైర్మన్ సుముఖత వ్యక్తం చేశారని మంత్రి లోకేష్ తెలిపారు. సిఫి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజుతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో లోకేష్ మాట్లాడారు. విశాఖలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై సమావేశం జరిపామన్నారు. ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి లోకేష్ వివరించారు. దీంతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజుకు వివరణ ఇచ్చామన్నారు. నూతన ఐటి పాలసీల తీసుకొస్తామని లోకేష్ స్పష్టం చేశారు.

## ఉచిత పథకాల ప్రకటన విధానాన్ని ఆక్షేపించిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 ఎన్నికల ముందు ఉచిత పథకాల ప్రకటన విధానాన్ని సుప్రీం కోర్టు బుధవారం ఆక్షేపించింది. ఉచిత రేషన్, నగదు అందుతున్నందున పని చేయడానికి జనం సుముఖంగా లేరని కోర్టు వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు గూడు కల్పన హక్కు సంబంధిత పిటిషన్‌పై విచారణ సందర్భంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, అగస్టీన్ జార్జి మసీహ్‌తో కూడిన ధర్మాసనం ఆ వ్యాఖ్యలు చేసింది. 'దురదృష్టవశాత్తు ఆ ఉచితాల కారణంగా జనం పని చేయడానికి సుముఖత చూపడం లేదు. వారు ఉచిత రేషన్లు పొందుతున్నారు. వారు ఏ పనీ చేయకుండానే నగదు అందుకుంటున్నారు' అని జస్టిస్ గవాయ్ అభిప్రాయం వెలిబుచ్చారు.'వారి పట్ల మీ ఆందోళనను మేము గుర్తిస్తున్నాం. అయితే, వారిని సమాజంలో ప్రధాన స్రవంతిలో భాగం చేసి, దేశ అభివృద్ధికి పాటుపడేందుకు వారిని అనుమతించడం మెరుగు అవుతుంది కదా' అని బెంచ్ పేర్కొన్నది. పేదరిక నిర్మూలన పథకం ఖరారు ప్రక్రియలో కేంద్రం ఉన్నదని, అది పట్టణ ప్రాంత నిరాశ్రయులకు గూడు కల్పించడంతో సహా వివిధ సమస్యలను పరిష్కరించగలదని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి బెంచ్‌తో చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన పథకం ఎప్పటి నుంచి వర్తిస్తుందో కేంద్రం నుంచి ధ్రువీకరణ పొందవలసిందని అటార్నీ జనరల్‌ను బెంచ్ కోరింది. సర్వోన్నత న్యాయస్థానం ఆరు వారాల తరువాత ఈ విషయం విచారిస్తామని ప్రకటించింది.

## అయోధ్య రామాలయ ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ కన్నుమూత



లక్నో ఫిబ్రవరి 12 అయోధ్య రామాలయ ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్(85) కన్నుమూశారు. సత్యేంద్రదాస్ అనారోగ్య సమస్యలతో ఫిబ్రవరి 3న లక్నో ఆస్పత్రిలో చేరారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పరిస్థితి విషమించి కన్నుమూశారని వైద్యులు తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ రామమందిరానికి పూజారిగా ఉన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయంలోనూ సత్యేంద్రదాస్ ముఖ్యపాత్ర వహించారు.

## ఆంధ్రప్రదేశ్ ను వణికిస్తోన్న బర్డ్ ఫ్లూ.. అప్రమత్తమైన తెలంగాణ



అమరావతి ఫిబ్రవరి 12 : ఆంధ్రప్రదేశ్ ను బర్డ్ ఫ్లూ వణికిస్తోంది. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధితో వేల కోళ్లు చనిపోవడం కలకలం సృష్టించింది. బర్డ్‌ఫ్లూ సోకిన 10 కిలో మీటర్ల పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అనుమలంకపల్లిలో బర్డ్ ఫ్లూతో 10 వేలకు పైగా కోళ్ల మృత్యువాతపడ్డాయి. ఇవాళ మరో రెండు వేల కోళ్లు మృతి చెందాయి. కోళ్ల శాంపిల్స్‌ను అధికారులు ల్యాబ్‌కు పంపారు.బర్డ్‌ఫ్లూ కలకలంతో తెలంగాణ సర్కార్ అప్రమత్తమైంది. తెలంగాణ సరిహద్దుల్లో 24 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మూడు చెక్‌పోస్టులు, భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట దగ్గర ఒక చెక్‌పోస్టు ఉంది. ఎపి నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను అధికారులు వెనక్కి పంపుతున్నారు. బర్డ్‌ఫ్లూపై రైతులకు అవగాహన కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.హైదరాబాద్‌లో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ కనిపిస్తోంది. భాగ్యనగరంలో చికెన్ అమ్మకాలు 50 శాతానికి పడిపోయాయి. హైదరాబాద్‌లో రోజుకు 6 లక్షల కేజీల చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి. కిలో చికెన్ ధర రూ.150కి పడిపోయింది. దీంతో చికెన్ వ్యాపారులు ఆందోళనలో ఉన్నారు.

## పంచాయతీరాజ్ ఎన్నికలలో చట్ట ప్రకారం రిజర్వేషన్స్ పెంచాలి



హైదరాబాద్ ఫిబ్రవరి 12 ప్రజాబలం ప్రతినిధి: పంచాయతీరాజ్ ఎన్నికల్లో పార్టీ పరంగా 42 శాతం కాదు, చట్ట ప్రకారం పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బిసి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఎన్నికలలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం కోటా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో పార్టీ పరంగా 42 శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదని అన్నారు. ఇతర పార్టీల వారు కూడా అంగీకరిస్తే అప్పుడు న్యాయం జరుగుతుందన్నారు. లేకపోతే అగ్రకులాలకు ఇస్తే డబ్బుతో పోటీ పడలేరని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతూ బిల్లు పెట్టి చట్టం చేయాలన్నారు. అప్పుడు అన్ని పార్టీలు కూడా బిసిలకు ఇస్తాయని, తద్వారా తప్పని సరిగ్గా బీసీలు గెలుస్తారన్నారు. ఈ సమావేశంలో వేముల రామకృష్ణ, గొరిగె మల్లేష్ యాదవ్, మోదీ రాందేవ్, కీర్తి లత.. ఉదయ్,శివకుమార్, రవి యాదవ్, శివ, బాలస్వామి జయంతి, నందగోపాల్. తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

13 ఫిబ్రవరి 2025 గురువారం

# సుస్థిర వ్యవసాయానికి కృత్రిమమేధ

ప్రపంచ జనాభా రానున్న 25 సంవత్సరాల్లో 20 శాతానికి పైగా పెరగనుంది. అనగా 2050 నాటికి ప్రపంచ జనాభా సుమారుగా 9.7 బిలియన్ల వరకు పెరుగుతుందని అంచనా. జనాభాకు సరిపడా ఆహార భద్రత కల్పించడం అత్యవసరం. పెరుగుతున్న జనాభా అనేక సమస్యలకు దారి తీస్తుంది, ముఖ్యంగా పట్టణీకరణ అధికమై, సహజ వనరులు తగ్గనున్నాయి. దీనికి తోడు వాతావరణంలో మార్పులు పంటల దిగుబడులు తగ్గుదలకు కారణమవుతున్నాయి. అంతేకాకుండా, ప్రపంచంలో పట్టణీకరణ పెరిగి, పట్టణాలకు ప్రజల వలస పెరిగింది. 2007వ సంవత్సరం నుంచి ప్రజల నివాసం గ్రామాల్లో కంటే పట్టణాల్లో నివసించడం అధికమైంది. 2050 నాటికి దాదాపుగా 68 శాతం ప్రపంచ జనాభా పట్టణాల్లో నివసించబోతున్నారు. ఈ విధంగా ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకొనే వారి సంఖ్య తగ్గనుంది. మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన మొదటి దశాబ్దంలో సుమారు 70 శాతం దేశ జనాభా వ్యవసాయాన్ని జీవన వృత్తిగా కొనసాగించే వారు తరువాతి దశాబ్దాల్లో వ్యసాయాన్ని వృత్తిగా ఎంచుకునే వారి సంఖ్య 2020 నాటికి 51. 8 శాతానికి తగ్గింది. జాతీయ నమూనా సర్వే కార్యాలయం-కాలానుగుణ కార్మికశక్తి సర్వే ప్రకారం 2023- 24 సంవత్సరంలో ఈ సంఖ్య 46.1 శాతానికి చేరింది. రాబోయే దశాబ్దాల్లో పంటలు పండించే వారి సంఖ్య మరింత తగ్గనుంది. మారుతున్న సమాజానికి, పెరుగుతున్న జనాభా అవసరాలకు తగు ఆహార భద్రత కల్పించుటకు ఉన్నా వనరులను సమర్ధవంతగా వినియోగించుకొవాలి. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో నూతన అడుగులు వేసి సుస్థిర వ్యవసాయం వైపు ముందుకు సాగాలి. వ్యవసాయ రంగంలో క్లిష్టత, వైవిధ్యత పెరగడం వల్ల అనునిత్యం నవీనీకరణకు కృషి చెయ్యాలి. నిరంతరం మారుతున్న వాతావరణ మార్పులకు, మారుతున్న పురుగుల, తెగుళ్లకు, పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాన్ని నవీకరించాలి. అయితే వ్యవసాయ రంగం విశాలమైనది, దాని నవీకరించడానికి వ్యవసాయ రంగంలోని అనేక శాఖలు, విభాగాలు, పనిముట్లు, యంత్రాలు, వ్యవసాయ పద్ధతులు, సస్యరక్షణ విధానాలు, వాతావరణం, నూతన వంగడాలు లాంటి అనేక అంశాలను అనుసంధానం చెయ్యాలి. అంతేకాకుండా, మన దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్న ఉత్పాదకత ఆశించిన రీతిలో లభించడం లేదు. ఈ తరుణంలో, ఉత్పాదకతను పెంచాలంటే వున్న అన్ని రకాల వనరులను సమర్ధవంతగా వినియోగించుకోవాలి. అందులోను సాంకేతిక వనరులను విస్తృతస్థాయిలో ఉపయోగించుకోవాలి. వ్యవసాయరంగంలోని బహుళ అంశాలను పునర్నిర్మిచడానికి కృత్రిమ మేధస్సు చాలా విధాలుగా తోడ్పడుతుంది. కృత్రిమ మేధస్సు మనుషుల మాదిరిగా తన తెలివితేటలను రకరకాల పనులకు వాడుకోగలదు. కృత్రిమ మేధస్సు స్వయంచాలక కార్యకలాపాలైన మాటలను గుర్తించడం, భాషను అర్థం చేసుకోగలడం, అనువాదించడం, చిత్రాలను విశ్లేషించడం, నిర్ణయాలు తీసుకోవడం, అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం లాంటి మనిషి ఆలోచించి చేసే పనులను కృత్రిమ మేధస్సు యంత్రాల సహాయంతో ప్రదర్శించగలదు. అదే విధంగా, వ్యవసాయ రంగంలో నేలల ఆరోగ్యం, సాటిలైట్ చిత్రాలను, పంటల దిగుబడి, ఉత్పత్తి, వినియాగం, నాణ్యత పరిమాణాలు, భూముల రికార్డులు, పురుగులు తెగుళ్ల అంచనా, నిర్వహణ, మార్కెట్ వివరాలు, పంటల ధరలు, ఎగుమతి , దిగుమతులు ధరలు పురుగుల మందులు, రసాయనిక ఎరువులు వెదజల్లడానికి వీటి దుర్వినియోగాన్ని తగ్గించడానికి, సరైన రీతిలో నీటి పారుదలకు, స్వయం చాలక తెగుళ్ల నిఘా, వ్యవసాయ రంగంలోని పరిశోధన అభివృద్ధి లాంటి అనేక వ్యవసాయ సంబంధిత చారిత్రాత్మక, కాలానుగుణ సమాచారాన్ని కృత్రిమ మేధలోనే సహజ భాషా ప్రాసెసింగ్, యంత్ర అభ్యాసం, ఆర్టిఫిషల్ న్యూరల్ నెట్‌వర్క్, ఫేజ్ సిస్టం, వర్చువల్ రియాలిటీ, అగుమెంటి వేరియాలిటీ, లోతైన అభ్యాసం, ఇమేజ్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ అప్ థింకింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కృత్రిమ మేధలోని సాంకేతికా విభాగాల ద్వారా సమగ్రంగా విశ్లేషించి నిర్వహించగలదు.

అగ్రిఫుడ్ రంగంలో కృత్రిమ మేధ నూతన ఆవిష్కరణల లెక్కలు చూసినట్లైతే చారిత్రాత్మకంగా అమెరికా ముందంజలో ఉండగా, గడిచిన కొద్ది కాలంలో అగ్రిఫుడ్ రంగంలో పరిశోధన, అభివృద్ధిలో అత్యధిక అగ్రిఫుడ్ పేటెంట్లు ఆసియాలోని చైనా, జపాన్, భారతదేశం ముందజలో ఉన్నాయి. గడిచిన 20 సంవత్సరాల్లో అగ్రిఫుడ్ రంగంలో సుమారుగా 3.5 మిలియన్ల పేటెంట్ కుటుంబాల నూతన ఆవిష్కరణలు ప్రచురించబడ్డాయి. అగ్రిఫుడ్ రంగంలో, పురుగులు, తెగుళ్ల నిర్వహణ శాఖలో అత్యధిక పేటెంట్లు ప్రచురించబడ్డాయి (%ఔఖూా, 2024). వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధను రైతులకు చేరవేడంలో ప్రభుత్వ, ప్రైవేట్, అగ్రిస్టార్ అప్లు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్రను పోషించనున్నాయి. మన దేశంలో అగ్రిస్టార్ అప్లు అయినా ఐబినో, ఫసల్, ఇంటెల్ ల్యాబ్, క్రాపఇన్, భారత్ అగ్రి, మారుతీ డ్రోన్స్ మొదలైన స్టార్ట్ అప్లు కృత్రిమ మేధను ఉపయోగించి రైతులకు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. అంతేకాకుండా, దేశ వ్యాప్తంగా వ్యవసాయానికి సంబంధించిన కృత్రిమ మేధ సేవలను వ్యవసాయానికి సంబంధించిన ప్రతి జాతీయ స్థాయి సంస్థలు, కేంద్రాలు అనేక అప్లికేషన్స్, పోర్టల్స్, వెబ్‌పేజెస్, డెసిజన్ సపోర్ట్ సిస్టం, ఎక్స్‌ఫర్ట్ సిస్టంలను రూపొందించి రైతులకు పంటల నిర్వహణ, నెలల ముఖచిత్రలను, పురుగులు, తెగుళ్ల నివారణ లాంటి వివిధ రకాల అంశాలపై కృత్రిమ మేధ సహాయంతో రైతులకు తోడ్పడుతున్నాయి. కానీ వాటిని రైతులకు విస్తృత స్థాయిలో అందించడంలో విఫలమైవుతున్నాయి.

అయితే పూర్తి స్థాయిలో కృత్రిమ మేధ ఫలితాలు రైతులకు చేరాలంటే ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి.నాల్గవ పారిశ్రామిక విప్లవంలోని సాంకేతిక పురోగతిని వ్యవసాయ రంగానికి అనుసంధానం చెయ్యడానికా ప్రపంచ ఆర్థిక వేదిక వ్యవసాయ రంగంలోని ఆవిష్కరణకు కృత్రిమమేధ అనే అంకురార్పణను ప్రారంభించింది. ఇందులో భాగంగా, ప్రపంచ ఆర్థిక వేదిక, తెలంగాణ ప్రభుత్వం, బిల్- మెలిండా గట్స్, డిజిటట్ గ్రీన్లు కలిసి ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో 'సాగు -బాగు' అనే కార్యక్రమాన్ని పైలట్ -ప్రాజెక్ట్‌గా ప్రారంభించి వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధ వినియోగించి మొదటి దశలో గణనీయమైన లాభాలను ఖమ్మ జిల్లాలోని సన్నకారు రైతులకు అందించారు. సాగు-బాగు కార్యక్రమంలో నాల్గవ వ్యవసాయ సంబంధిత విషయాలైన తెలివైన పంటల ప్రణాళిక, తెలివైన వ్యవసాయం, వ్యవసాయ క్షేత్రం నుంచి భోజన పల్లెం వరకు, డాటా ఆధారిత వ్యవసాయం లాంటి అంశాలను కృత్రిమ మేధ ద్వారా సమగ్రంగా అనుసంధానం చేసి రైతులకు సుస్థిరాభివృద్ధి వైపునకు నడపడంలో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించారు.

మన దేశంలో డిజిటల్ విప్లవాన్నీ వ్యవసాయానికి జోడించడానికి కేంద్ర ప్రభుత్వ కేబినెట్ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను ఆమోదించింది. డిజిటల్ అగ్రికల్చల్ మిషన్ ద్వారా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మించనుంది. అందులో అగ్రిస్టాక్ ద్వారా రైతుల పట్టిక, జియో రెఫరెన్స్‌తో కూడిన గ్రామ చిత్రాన్ని, పంటల విత్తిన పట్టిక రూపొందించి ప్రతి రైతుకు ఒక గుర్తింపు కార్డును ఇవ్వబోతున్నారు. వ్యవసాయ నిర్ణయ మద్దతు వ్యవస్థ ద్వారా రిమోట్ సెన్సింగ్ సహాయంతో పంటలు, నెలలు, వాతావరణం, నీటి వనరుల సమాచారాన్ని అనుసంధానం చేసి జియోస్పెషల్ వ్యవస్థను ఏర్పరచనున్నారు. దేశ వ్యాప్తంగా నేలల ముఖ చిత్రపటాన్ని నిర్మించనున్నారు. అంతేకాకుండా డిజిటల్ సాధారణపంట అంచనా సర్వే ద్వారా దేశంలోని వ్యవసాయ ఉత్పత్తులను కచ్చితంగా అంచనా వెయ్యబోతున్నారు.

# శ్రీశ్రీశ్రీ స్వయంబు లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవముల ఆహ్వాన పత్రం విడుదల



**ఛంద్రాయణగుట్ట ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ రాజధాని చంద్రయాణాగుట్ట లో స్వయంంబుగా వెలసిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవముల ఆహ్వాన పత్రం ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. బ్రహ్మోత్సవములు ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆహ్వాన పత్రం లో కార్యక్రమాల వివరములను తెలిపారు. 19-02-2025, బుధవారము, మాఘ బహుళ సప్తమిఉ. 7.00 గం.లకు పంచామృత స్నపన తిరుమంజనము, అలంకారము, అష్టోత్తరం, మహా నివేదనం, తీర్థ ప్రసాద గోష్ఠి, ఉ. 10 గం. నుండి 12.00 వరకు దివ్య ప్రభంధ పారాయణము, అనంతరం అన్నదానం.సా. 5.30 గం.లకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనము, అంకురార్పణ, మృత్యుం గ్రహణం దీక్షా వస్త్ర ప్రధానం.20-02-2025, గురువారము, మాఘ బహుళ అష్టమి,ఉ. 6.00 గం.లకు పంచామృత స్నపన తిరుమంజనము, అలంకారము, అష్టోత్తరం, మహా నివేదనం. ఉ. 9.00 గం.లకు యాగశాల ప్రవేశం, హయగ్రీవహవనం, ధ్వజారోహణం, గరుడముద్ద, బలిహరణం అనంతరం అన్నదానం రా. 8.00 గం.లకు పల్లకి ఊరేగింపు.స్వామివారి అమ్మ వార్ల ఎదురుకోళ్ళ కార్యక్రమము, తీర్థప్రసాద గోష్ఠి.

21-02-2025, శుక్రవారము, మాఘ బహుళ నవమి ఉ. 6.00 గం.లకు పంచామృత స్నపన తిరుమంజనము, అలంకారము, అష్టోత్తరం, హెూమము మ. 12.00 గం.లకు "స్వామి వారి తిరుకళ్యాణోత్సము" ఆనంతరం అన్నదానము. రా. 8.00 గం.లకు స్వామి వారి వాహన ఊరేగింపు

22-02-2025, శనివారము, మాఘ బహుళ దశమి ఉ. 6.00 గం.లకు అభిషేకము, ఆరాధన, ఉ. 9.00 గం.లకు నృసింహ హవనము.

మహానివేదన తీర్థప్రసాద గోష్ఠి అనంతరం అన్నదానం 23-02-2025, ఆదివారము, మాఘ బహుళ ఏకాదశి ఉ. 7.00 గం.లకు అభిషేకము, ఆరాధన, ఉ. 9.00గం.లకు సుదర్శనహవనము. మహా పూర్ణాహుతి ధ్వజ అవరోహణము, తదనంతరం "చక్రతీర్థం" తరువాత కుంభజల సంప్రోక్షణ, ఆశీర్వచనము, సన్మానము, తీర్థప్రసాద గోష్ఠి.

పైన తెలిపిన కార్యక్రమములలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి, ఆ దేవుని కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ ,పాలకమండలి సభ్యులు బి . వందన ముదిరాజ్, ఆర్ . విజయలక్ష్మి , ఏ.శ్రీధర్, కే . శైలేష్.దేవాలయ అర్చకులు కంజర్ల ప్రతాపా చార్యులు, కార్యనిర్వహణ అధికారి శివ రుద్రప్ప,స్థానిక ప్రముఖులు వెంకటేష్, జంగరాజ్, గణేష్, రామకృష్ణ, అశోక్, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సబ్సిడీ కోత బిలకు సబ్సిడీలు

**నిత్యవసర సరుకుల పై మోయలేని పన్నుల భారాలు**

**ఉపాధి హామీకి మొండి చేయి**

**నిత్యవసర సరుకులపై జీఎస్టీ పన్నులు రద్దు చేయాలి**

**మధ్యతరగతికి 12 లక్షల పన్ను మినహాయింపు వట్టి మాటే**



కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలు పైన ప్రభావం సెమినార్ లో రాజ్యసభ సభ్యులు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి శివదాసన్‌పేదల సంక్షేమానికి సబ్సిడీలను కోత విధించి కార్పొరేట్ అధిపతిలకు పన్నులను మినహాయింపు ఇచ్చారని, మధ్యతరగతి ప్రజలకు 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రచారం వట్టి మాటేనని రాజ్యసభ సభ్యులు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి శివదాసన్, విక్రమ్ సింగ్ అన్నారుసుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ గ్రామీణ పేదలపై ప్రభావం అనే అంశంపై నిర్వహించిన సెమినార్ జరిగింది ఈ సెమినార్కు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకులపై జివిస్టి పన్నులు విధించి ముక్కు పిండి పేదల నుండి పనులు వసూలు చేస్తున్నారని బడా కార్పొరేట్ యాజమాన్యాలకు పన్నులు మినహాయింపు ఇవ్వడంతో పాటు పారు బకాయిలు పేరుతో కోట్లాది రూపాయల బకాయిలను రద్దు చేశారని చేశారు జీఎస్టీ పన్నుల నుండి నిత్యవసర సరుకులను మినహించాలని డిమాండ్ చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే గ్రామీణ ఉపాధి హామీ పనికి పెద్ద ఎత్తున నిధులు పెంచాలి అనే డిమాండ్ ను పట్టించుకోలేదన్నారు గతంలో కేటాయించిన 86 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించారని చెప్పారు ఆహార భద్రత వ్యవసాయ సబ్సిడీలను పెద్ద ఎత్తున కుదించారని చెప్పారు పేదరికంలో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవడం కోసం ఎలాంటి చర్యలు ఈ బడ్జెట్లో లేవని చెప్పారు ఎల్పిజి ఉజ్వల స్కీం నిధులు కోత విధించారని అన్నారు ఎస్సీ ఎస్టీ విద్యార్థుల స్కాలర్షిప్లు సబ్ ప్లాన్ నిధులను వారి జనాభా ఆధారంగా కేటాయించలేదని పేర్కొన్నారు క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదని అన్నారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు కట్టించే ఇండ్ల స్లాబ్ ను పెంచాలనే డిమాండు ఉన్నాగాని బడ్జెట్లో ఒక్క పైసా కేటాయించలేదని అన్నారు పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ఉపాధి పనిని విస్తరింప చేయాలని అడుగుతున్న నిధులు కేటాయింపు లేదని అన్నారు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున బకాయిలను పెట్టిందని చెప్పారు. ఈ సెమినార్లో అఖిలభారత నాయకులు %ఎ% వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే లాజరస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ బి పద్మ , రాళ్ల బండి శశిధర్ రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్ జంగయ్య మల్లేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ తదితరులు పాల్గొన్నారు

# గాజాను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు..స్వాధీనం చేసుకుంటాం

వాషింగ్టన్ ఫిబ్రవరి 12 : గాజాను స్వాధీనం చేసుకొని, తిరిగి నిర్మిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 తో భేటీ అయిన ట్రంప్ , ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. దాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్యానించారు. ' మేము గాజాను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. దాన్ని స్వాధీనం చేసుకుంటాం. గాజాను రక్షించి పునరుద్ధరిస్తాం. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆలోచన నాకు లేదు. మధ్య ప్రాచ్యం లోని ప్రజలకు అనేక ఉద్యోగాలు సృష్టించనున్నాం' అని ట్రంప్ ఓవెల్ కార్యాలయంలో విలేకరులతో తెలిపారు.

## 2 వేల మంది పిల్లలను తీసుకుంటాం

%యుద్ధం కారణంగా అనారోగ్యంతో , క్యాన్సర్‌తో బాధపడుతున్న 2 వేల మంది చిన్నారులను తమ దేశానికి తీసుకువెళతామని అబ్దుల్లా 2 ప్రకటించారు. దీనిని ట్రంప్ అద్భుతమైన విషయంగా పేర్కొన్నారు. అయితే , నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించాలనే ప్రతిపాదనను మాత్రం జోర్డాన్ రాజు తిప్పి కొట్టారు. వారిని అక్కడి నుంచి పంపించకుండా గాజాను తిరిగి నిర్మించాలన్నారు. ట్రంప్ ప్రతిపాదనపై అరబ్ దేశాలు రియాద్‌లో చర్చిస్తాయన్నారు. అమెరికా గాజాను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను గత వారం తొలిసారి ట్రంప్ బయటపెట్టారు.నాడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తో భేటీ తరువాత ఆయన ఈ ప్రకటన చేశారు. దానిని స్వాధీనం చేసుకొని ఓ వెకేషన్ ప్రదేశంగా (రివేర) అభివృద్ధి చేస్తామని వ్యాఖ్యానించారు. నాడు నెతన్యాహు కూడా దీనిని ఓ విప్లవాత్మక ఆలోచనగా అభివర్ణించారు. హమాస్ మాత్రం ట్రంప్ ఆలోచనలను తీవ్రంగా తప్పు పట్టింది. పాలస్తీనాలో గాజా విడదీయలేని భాగంగా స్పష్టం చేసింది. ఈ ప్రకటనకు ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి. దీనికి నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామంటూ ట్రంప్ హెచ్చరించారు. ఈ నేపథ్యం లోనే అబ్దుల్లా 2 ట్రంప్‌తో భేటీ అయ్యారు.

# ఇంద్రాణీ ముఖర్జీ విదేశాలకు వెళ్లేందుకు అనుమతిని తిరస్కరించిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 : షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఇంద్రాణీ ముఖర్జీ విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తిరస్కరించింది. విదేశాలకు వెళ్తే మళ్లీ తిరిగి వస్తారనే గ్యారంటీ లేదని పేర్కొంది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం ఈ కేసు విచారణను ఏడాది లోపల పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. " మళ్లీ తిరిగి వస్తారన్న గ్యారంటీ లేదు. విచారణ తుది దశకు చేరుకుంది. విచారణ కొనసాగుతున్న వాస్తవాన్ని పరిగణన లోకి తీసుకొని, ఈ దశలో మీ విజ్ఞప్తిని అనుమతించలేం. విచారణ వేగవంతం చేసి ఏడాది లోగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశిస్తున్నాం " అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది.

# ఢిల్లీ రూపాంతర పూర్వాపరాలు

అది భారత దేశపు రాజధాని. వివిధ పాలకుల ఎలుబడులలో మహోన్నత వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలిచిన ఢిల్లీ నగరమది. భారతీయ ప్రాచీన సభ్యతా సంస్కృతులకు, సాంప్రదాయాలకు, వారసత్వాలకు, ఆచార వ్యవహారాలకు విభిన్న జాతులకు, మతాలకు, కులాలకు వేలాది సంవత్సరాల సాక్షీభూతంగా నిలిచి ఉంది. సహస్రాబ్ధుల కాలగమనంలో ఎన్నో ఉత్థాన పతనాలను అనుభవించింది. 42.7 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగిన ప్రస్తుత క్రొత్త ఢిల్లీ, మెట్రోపాలిత ప్రాంతంలో, భారత ప్రభుత్వ కేంద్రపాలిత ప్రాంత పరిధిలో ఉంది. యునైటెడ్ కింగ్‌డంకు చెందిన వాస్తు నిపుణులు తయారు చేసిన నిర్మాణ నమూనా అధారంగా రూపొందించిన కొత్త ఢిల్లీ 1931 ఫిబ్రవరి 13న దేశ రాజధానిగా ప్రారంభించబడింది. కొత్త ఢిల్లీ పూర్వాపరాలు ఒక్కసారి మననం చేసుకుంటే...ఢిల్లీ కేంద్రంగా ఎన్నో వేల సంవత్సరాల చరిత్రలో ఎన్నో సామ్రాజ్యాలు వెలిశాయి, పతనమైనాయి. మహాభారతంలో పాండవుల రాజధాని ఇంద్రప్రస్థం అని ఈ నగరాన్ని ప్రస్తావించారు. 19వ శతాబ్దారంభం వరకు "ఇందర్‌పాత్" అనే గ్రామం ఇక్కడ ఉండేది. బ్రిటిష్‌వారి క్రొత్త రాజధాని నిర్మాణంలో ఆ గ్రామం కనుమరుగు అయింది. క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటి రంగువేసిన కూజాలు త్రవ్వకాలలో వెలుగు చూశాయి. పురావస్తు పరిశోధనా సంస్థ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) వారి అంచనాల ప్రకారం వేల సంవత్సరాలలో నిర్మించిన చారిత్రిక కట్టడాలు 60,000 పైగా ఢిల్లీలో ఉన్నాయి. ఇటీవలి చరిత్రలోనే "ఏడు సామ్రాజ్యాల రాజధాని"గా ఢిల్లీని వర్ణిస్తారు. గంగా - యమునా మైదానానికి... ఆరావళీ - వింధ్య పర్వత శ్రేణులకు మధ్య ప్రాంతంలో క్రొత్త ఢిల్లీ, యమునా నదికి పశ్చిమ భాగాన ఉన్నందున పురాతన కాలం నుండి ఢిల్లీ ప్రధాన వర్తక మార్గాలకు కూడలిగా ఉంది. ఆ సౌకర్యాల కారణంగానే అక్కడ విద్య, సంస్కృతి, రాజ్యాధికారాలు, వర్ధిల్లాయి. మౌర్యసామ్రాజ్యం కాలం నాటి (క్రీ.పూ. 300) ఆధారాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అప్పటి నుండి ఢిల్లీ అవిచ్ఛిన్నంగా జనావాసంగా వర్ధిల్లింది. శ్రీనివాసపురి ప్రాంతంలో అశోకుని కాలంనాటి శాసనం 1966లో కనుగొన్నారు. ఫిరోజ్‌షా తుగ్లక్ రెండు అశోకుని కాలం నాటి శాసన స్తంభాలను ఢిల్లీకి తెచ్చాడు. కుతుబ్ మినార్ వద్ద ప్రసిద్ధి చెందిన ఉక్కు స్తంభం గుప్త వంశజుడు కుమార గుప్తుడు క్రీ.శ. 320-540 మధ్యకాలంలో తయారు చేయించ బడింది. దానిని 10వ శతాబ్దంలో ఢిల్లీకి తెచ్చారు. 1857 నుండి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత, ఢిల్లీ బ్రిటిష్‌వారి అధీనంలోకి వచ్చింది. అప్పుడు బ్రిటిషు వారు కలకత్తా నుండి రాజ్యం చేస్తున్నందు వలన ఢిల్లీ రాజధాని నగరం హోదాను కోల్పోయింది. మళ్ళీ 1911లో కలకత్తా నుండి రాజధాని ఢిల్లీకి మార్చారు. ఎడ్విన్ లుట్యెన్స్ అనే భవన నిర్మాణ శిల్పి పాత నగరంలో కొంత భాగాన్ని పూర్తిగా కూలద్రోయించి క్రొత్త ఢిల్లీలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని చేయించాడు. ఆంగ్లేయుల పాలనా కాలమందు డిసెంబరు 1911 వరకూ భారత రాజధాని కలకత్తా నగరం వుండేది. ఆ తరువాత రాజధాని ఢిల్లీకి మార్చ బడింది. కానీ ప్రాచీన కాలం నుండి ఢిల్లీ రాజకీయ కేంద్రముగా వుంటూ వస్తున్నది. ప్రత్యేకంగా మొఘల్ సామ్రాజ్య కాలం నుండి ముఖ్యంగా 1799 నుండి 1849 వరకూ ఢిల్లీ కేంద్రంగా వుంటూ వచ్చింది. 1900 ప్రారంభంలో బ్రిటిష్ పరిపాలనా కాలంలో భారత రాజధానిని, కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలనే ప్రతిపాదన వచ్చింది. కలకత్తా భారత్‌కు ఈశాన్య దిశలోనూ, భారత్‌కు చెందిన అనేక ప్రాంతాలకు చాలా దూరంగా వుండేది. ఈ కారణాన బ్రిటిష్ రాజ్ పరిపాలనా సౌలభ్యం కొరకు రాజధానిని ఢిల్లీకి మార్చడమే ఉత్తమమని భావించింది. చక్రవర్తి 5వ జార్జి, భారత రాజధాని, కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలని ప్రకటించాడు. షాజహాన్ చే నిర్మింపబడిన పాత ఢిల్లీకి దక్షిణాన క్రొత్త ఢిల్లీ ఉంది. క్రొత్త ఢిల్లీ ఏడు ప్రాచీన నగరాల ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలోనే "యంత్ర మందిరం" లేదా జంతర్ మంతర్, లోధీ గార్డెన్స్ మొదలగునవి ఉన్నాయి. కొత్త ఢిల్లీని బ్రిటిష్ వాస్తు శిల్పులు సర్ ఎడ్విన్ లుటియెన్స్, సర్ హెర్బర్ట్ బేకర్ రూపొందించారు. కొత్త రాజధానిని 10 ఫిబ్రవరి 1931 న వైస్రాయ్ మరియు భారత గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు. కలకత్తా (ఇప్పుడు కోల్‌కతా) బ్రిటిష్ రాజ్ కాలంలో, డిసెంబర్ 1911 వరకు భారత దేశానికి రాజధానిగా ఉంది. పంతొమ్మిదవ శతాబ్దం చివరి నుండి కలకత్తా జాతీయవాద ఉద్యమాలకు కేంద్రంగా మారింది. ఇది బ్రిటిష్ ఇండియా వైస్రాయ్ లార్డ్ కర్జన్ చేత బెంగాల్ విభజనకు దారి తీసింది. ఇది కలకత్తాలో బ్రిటిష్ అధికారుల రాజకీయ హత్యలతో సహా భారీ రాజకీయ, మత పరమైన తిరుగు బాటును సృష్టించింది. ప్రజలలో వలస రాజ్యాల వ్యతిరేక భావాలు బ్రిటీష్ వస్తువులను పూర్తిగా బహిష్కరించ దానికి దారి తీశాయి. పరిస్థితులను గమనించి, వెంటనే రాజధానిని న్యూ ఢిల్లీకి మార్చింది. డిసెంబర్ 12, 1911 న, అప్పటి భారత చక్రవర్తి జార్జ్ ఎ, అయన భార్య క్వీన్ మేరీతో కలిసి బ్రిటిష్ రాజ్ రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలని ప్రకటించారు. ఢిల్లీ కొత్త నగరాన్ని నిర్మించడానికి భూమిని, భూసేకరణ చట్టం 1894 కింద స్వాధీనం చేసుకున్నారు. 1912 లో మొదటిసారి ఢిల్లీ సందర్శించిన బ్రిటిష్ వాస్తు శిల్పులు ఎడ్విన్ లుటియెన్స్, హెర్బర్ట్ బేకర్ ప్రణాళిక సిద్ధం చేశారు. కాంట్రాక్టు శోభా సింగ్‌కు ఇవ్వబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రారంభమై...1931లో నగర నిర్మాణం పూర్తయిన తర్వాత 1931లో ఫిబ్రవరి 13న, లార్డ్ ఇర్విన్‌చే న్యూ ఢిల్లీ రాజధానిగా ప్రారంభించ బడింది. భారత స్వాతంత్ర్యం తరువాత, 1947 లో, కొద్దిపాటి స్వయం ప్రతిపత్తి నిచ్చి, భారత ప్రభుత్వంచే నియమించ బడ్డ ప్రధాన కమీషనర్ కు పరిపాలనాధికారాలు ఇవ్వబడ్డాయి. 1956 లో ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటింప బడినది. అలాగే ప్రధాన కమీషనర్ స్థానే లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించారు. భారత రాజ్యాంగ (69వ సవరణ - 1991) ప్రకారం, పూర్వపు జాతీయ రాజధాని ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. ద్వంద ప్రభుత్వ ( డయార్కీ) వ్యవస్థను పరిచయం చేశారు. ఈ వ్యవస్థలో ఎన్నికైన ప్రభుత్వానికి విశాలాధికారాలు ఇవ్వబడ్డాయి. లా ఆర్డర్ అధికారాలు మాత్రం కేంద్ర ప్రభుత్వ చేతులలో వుంటాయి.

# భారత కోకిల సరోజినీ దేవి

దేశం బానిసత్వ, నియంతృత్వ సంకెళ్ళ నుంచీ విముక్తి పొంది స్వతంత్ర్య స్వేచ్ఛా, స్వాత్రంత్ర్యాలతో జీవించాలన్న మహత్తర ఆశయం ఉన్నవారు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారు. అటువంటి వాటిలో పురుషులే కాక, ఏ రంగంలోనూ, తీసిపోరని నిరూపించిన వీరమహిళలు మన దేశంలో చాలా మంది పుట్టారు. అటువంటి వారిలో శ్రీమతి సరోజినీ నాయుడు కూడా ఒకరు. భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన కవయిత్రి . సరోజినీ దేవి 1925డిసెంబరులో కానుపూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నరు కూడా. బెంగాలీయుల ఆడపడుచు, తెలుగు వారి కోడలు.. సరోజినీ పన్నెండో ఏట మద్రాస్ యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమురాలిగా నిలిచి పలువురి ప్రశంసలందుకుంది. 13సంవత్సరంలోనే ది లేడి ఆఫ్ ద లేక్ పేరున 1300 పంక్తుల కవితను ఆరు రోజుల్లో రాసింది. సరోజినీ దేవి చటోపాధ్యాయ హైదరాబాదులో శ్రీమతి సరోజినీ నాయుడు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, వరద సుందరీ దంపతులకు 1879 ఫిబ్రవరి 13న వారి ప్రథమ సంతానంగా ఒక బెంగాలీ బ్రాహ్మణ కుటుంబములో జన్మించింది. తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ తూర్పు బెంగాల్ కు చెందిన గొప్పవిద్యావేత్త, డా.ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందిన మొదటి భారతీయుడు.

నిజాం కాలేజీ స్థాపకుడు, శాస్త్రవేత్త, తత్వవేత్త. తల్లి భువనసుందరి దేవి ఒక కవయిత్రి. చిన్నతనం నుంచీ ఆమెకు ఇంగ్లీషు భాషమీద చాలా మక్కువ ఉండేది. ఇంగ్లీషు మాట్లాడాలని ఆమె ఎంతగానో ప్రయత్నిస్తూండేది. ఆ పట్టుదలా, ధ్యేయాలతోనే ఇంగ్లీషు భాషను ఎంతో శ్రద్ధగా అభ్యసించింది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో చదువుకుంది. పదకొండో సంవత్సరం వచ్చేసరికి ఆమె అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది. ఆమె పన్నెండవ ఏట మదరాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పూర్తి చేయగలిగిందంటే ఆమె చురుకైన తెలివితేటలూ, విద్య యందు ఆమెకు గల భక్తి భావం మనం అర్థం చేసుకోవచ్చు. సరోజినీ పదమూడవ యేట చాలా పెద్ద రచన రచించింది. దానిపేరు సరోవరరాణి. అది పదమూడు వందల పంక్తులతో నిండిన అతి చక్కని రచన. తాను చెప్పదలచుకున్న విషయము ఇతరుల హృదయాలకు హత్తుకుని ఆలోచింపజేసే విధంగా కమ్మని శైలిలో చిన్న తనం నాడే రచనలు ప్రారంభించిన ఆమెలోని ప్రత్యేకతలు గ్రహించిన నిజాం నవాబు ఆమె యందు గల అభిమానంతో ఆమెను విదేశాలకు పంపాలని నిర్ణయించుకుని, ఆమె వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సాహమిస్తూ ఆమెకు ప్రతి సంవత్సరం నాలుగువేల రెండు వందల రూపాయలు విద్యార్థి వేతనంగా ఇచ్చేందుకు కూడా అంగీక రించాడు. సరోజిని కవితలని చదివి, మెట్రిక్యులేషన్లో మొదటి స్థానాన్ని తెచ్చుకున్న ఆమె ప్రతిభని గుర్తించిన హైద్రాబాద్ నిజామ్ ప్రభువు విదేశాల్లో చదువుకి ఉపకార వేతనం ఇచ్చారు. కానీ అనారోగ్య కారణంగా రెండు సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. ఆ రెండు సంవత్సరాలు పుస్తక పఠనంలోనే గడిపి అపారమైన జ్ఞానాన్ని సముపార్జించారు.ఆ కాలంలోనే పదహారేళ్ళ వయసులో సరోజినీ పై చదువులకు లండన్ ప్రయాణమై వెళ్ళారు. లండన్లోనే ప్రముఖ కవులైన ఎడ్మండ్ గాస్, ఆర్థర్ సైమన్ల పరిచయం కలిగింది. ప్రథమ కవితా సంకలనం "గోల్డెన్ త్రెష్ హోల్డ్"లో మూడు ప్రక్రియలూ ఉన్నాయి. ఆ సంకలనం రూపొందడానికి ఆర్థర్ సైమన్ ముఖ్య కారకులు. ఆర్థర్ సైమన్ ప్రోత్సాహంతో మొదటి కవితా సంకలనం వెలువడింది. 1915 వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహాసభ లకూ, 1916 లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనటం జరిగింది. ఆనాటి కాంగ్రెస్ భావాలు చాలా ఆదర్శంగా ఉండేవి. సరోజినీనాయుడు భారత దేశములో గల ముఖ్యమైన, నగర, పట్టణాలు తిరుగుతూ స్వాతంత్ర్యోద్యమ ఉపన్యాసాలిచ్చి, ప్రజలతో భాష విప్లవము వచ్చేందుకు కారకురాలయినది. సరోజినీ నాయుడు1930లో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మాగాంధీతో పాటు పాల్గొన్నది. ఆమె మద్రాసులో చదువుకున్నది. చదువు పూర్తయిన తర్వాత 19 సంవత్సరాల వయసులో ఆయనను కులాంతర వివాహము చేసుకున్నది. కులాంతర వివాహములకు సమాజము చాలా వ్యతిరేకముగా ఉన్న ఆ రోజుల్లో సరోజిని గోవిందరాజులు నాయుడును చట్టము ప్రకారము 1898 డిసెంబర్ 2న మద్రాసులో పెళ్ళి చేసుకున్నది. ఈ వివాహాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. నాయుడు దంపతులకు నలుగురు పిల్లలు కలిగారు: జయసూర్య, పద్మజ, రణధీర, లీలామణి. ఆమె మొదటి1905లో కవిత్వం గోల్డెన్ త్రెషోల్డ్ ఇంగ్లీషులో కవిత్వం రాసింది. నైటింగేల్ ఆఫ్ ఇండియాగా ప్రపంచపు ప్రఖ్యాత గడించింది. తర్వాత ది బర్డ్ ఆఫ్ టైం, ది బ్రోకెన్ వింగ్, పాలంక్వైన్ బేరర్స్ ఆమె కవితల్లో కొన్ని. జాన పద గేయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన "పాలంకీన్ బియరర్స్" ఉంది.

కవికోకిల కవితలలో గేయాలు, గీతాలు, పద్యాలు ఉన్నాయి. పురోగతినీ, స్వచ్ఛమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్య జీవితాలను వాంఛించిన పురుష కవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరిగా స్త్రీయై ఉండి కూడా జాతి విమోచనానికి శాయశక్తులా అహోరాత్రులు కృషి చేసిన త్యాగ పూరిత కవయిత్రి శ్రీమతి సరోజినీనాయుడనటంలో యే మాత్రము సందేహం లేదు. 1908లో మూసీనదికి వరదలు సంభవించిన సమయంలో చేపట్టిన సేవాకార్యక్రమానికి బ్రిటీష్ ప్రభుత్వం "కైజార్ ఎ హిందూ" స్వర్ణ పతకాన్ని బహుకరించింది. భారతీయ ప్రతినిధిగా 1931 వ సంవత్సరంలో లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ కు వెళ్ళింది. క్విట్ ఇండియా ఉద్యమంలో 1942 లో బ్రిటిష్ ప్రభుత్వాన్నెదిరించి ఎన్నో రకాలుగా స్వాతంత్ర్య పోరాటం సాగించిందామె.

అందుకు ఫలితంగా అరెష్టు చేయబడి, దాదాపు 1945 వరకు దుర్భర కారాగారవాస జీవితం నవ్వుతూ అనుభవించింది. తండ్రి మరణాంతరం రచించిన విషాద కవితలు ఈమెకు కైసర్-ఇ-హింద్' బంగారు పతాకాన్ని సాధించి పెట్టింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో అతిపెద్ద అప్పటి రాష్ట్రం ఉత్తరప్రదేశ్ కు గవర్నరుగా నియమించ బడింది. హైదరాబాదులో తాను నివసించిన ఇంటికి తన మొదట కవితా సంకలనం పేరునే స్వర్ణ ప్రాంగణంగా" ఎన్నుకొన్నది. ఆమె 1949 మార్చి 2న లక్నోలో మరణించినది. ఈమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం 1964 ఫిబ్రవరి 13న ఆమె చిత్రంతో ఒక తపాలబిళ్ళను విడుదల చేసింది.

ఆమెపై అభిమానంతో హైదరాబాదులో సికింద్రాబాద్ లో ఒక వీధికి సరోజినీ దేవి రోడ్డు' అని నామకరణం చేసారు. ఈమె పేరున హైదరాబాదులో సరోజినీ కంటి ఆసుపత్రి'ని కూడా స్థాపించారు. ఆమె విలువైన వస్తువులు ఇప్పటికీ సాలార్ జంగ్ మ్యూజియంలోను, జాతీయ పురావస్తు ప్రదర్శనశాల లోనూ భద్రంగా ఉన్నాయి.

# హైవోల్టేజ్‌కు ఏపీ పాలిటిక్స్

విజయవాడ, ఫిబ్రవరి 12, ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సెషన్ ప్రారంభం కానుంది. సభాసమరం స్టార్ట్ కాకముందే ఇంతలోపే ఏపీ పాలిటిక్స్ హైవోల్టేజ్‌కు చేరుకుంటున్నాయి. మాజీ సీఎం జగన్ చుట్టే వ్యవహారం తిరుగుతోంది. వైసీపీకి పదకొండు సీట్లే ఉన్నాయ్..ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటమి సర్కార్ అంటోంది. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తామని వైసీపీ డిమాండ్ చేస్తోంది.ఈ పరిస్థితుల్లో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మీడియా ముందుకు వచ్చి..పెద్ద బాంబే పేల్చారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని చెప్తూనే..సభకు రాకపోతే వేటేనని కరాఖండిగా చెప్పేశారు. 60 రోజులు సభకు రాకపోతే ఆటోమేటిక్‌గా సభ్యత్వం రద్దు అవుతుందని..అది రూల్స్ బుక్‌లోనే ఉందని గుర్తు చేస్తున్నారు. దీంతో మరోసారి హీటెక్కాయి ఏపీ పాలిటిక్స్.గత ఏడాది జూన్ తర్వాత జరిగిన ఏపీ అసెంబ్లీలో అధికార పక్షమే ఉంది. విపక్ష వైసీపీ అయితే సభకు వెళ్లడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతోంది. కానీ అది అయ్యే పని కాదని రూల్స్‌ను ప్రస్తావిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ నేపథ్యంలో ఏకంగా 15రోజుల పాటు జరగబోతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరు అవుతుందా అన్నది ఆసక్తిని పెంచుతోంది.అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు అని ఒక పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. దాంతో వైసీపీ సభకు అటెండ్ కాక తప్పదా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో కూటమి పార్టీలకే 164 సీట్లు ఉన్నాయి. వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దాంతో పాటు విపక్ష హోదా ఇవ్వరు కాబట్టి జగన్‌తో పాటు అంతా సాధారణ ఎమ్మెల్యేలుగానే ఉంటారు.సాధారణ ఎమ్మెల్యేగా ఉంటే తనకు ఇచ్చే సమయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు జగన్. విపక్ష నేతగా ఉంటే కచ్చితంగా మైక్ దక్కుతుందని భావిస్తున్నారు. అపోజిషన్ హోదా ఉంటే సీఎం కానీ మంత్రులు కానీ మాట్లాడిన తర్వాత కౌంటర్ చేయడానికి వీలు ఉంటుంది. కానీ ఈసారి జగన్ సభకు వస్తే ఒక సాధారణ సభ్యుడికి ఇచ్చినట్లే అతి తక్కువ సమయం దక్కనుంది.ప్రతిపక్ష హోదా లేకపోతే మాట్లాడేందుకు ఎక్కువ టైమ్ ఇవ్వరని..సభకు రాకుండా ఉంటే అనర్హత వేటు వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం పెద్ద వ్యూహంతోనే ఈ బడ్జెట్ సమావేశాలకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న సాకు చూపి వైసీపీ సభకు అటెండ్ కాకపోతే..11 మంది ఎమ్మెల్యేల మీద వేటు వేసే అంశాన్ని పరిశీలిస్తుందట. అందులో భాగంగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మీడియా ముందుకు వచ్చి మరీ చెప్పేశారని అంటున్నారు. ఒకవేళ చర్యలు తీసుకుంటే కూడా స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు కూడా తప్పు పట్టే అవకాశాలు ఉండవని లెక్కలు వేసుకుంటున్నారట.సిచ్యువేషన్ చూస్తుంటే బాల్ ఇప్పుడు వైసీపీ కోర్టులోనే ఉన్నట్లు కనిపిస్తోంది. వైసీపీ సభ్యులు సభకు అటెండ్ కాకపోతే ఏదో ఒక డెసిషన్ తీసుకోవాలని కూటమి సర్కార్ భావిస్తోందట. ఆ విషయం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మాటల్లో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లబోనని ఇప్పటికే చెప్పేశారు వైసీపీ అధినేత జగన్. ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారని..ఆ మీటింగ్‌లో అసెంబ్లీకి హాజరు కావాలా వద్ద అన్న దానిపై ఫైనల్ డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు.అయితే చాలామంది వైసీపీ నేతలు మాత్రం శాసనసభా సమావేశాలకు వెళ్లడమే బెటరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారట. ఇచ్చిన టైమ్‌లోనే అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేలా సబ్జెక్ట్ ప్రిపేర్ చేసుకుని వెళ్లాలని సూచిస్తున్నారట. ఒకవేళ సభలో మాట్లాడే టైమ్ ఇవ్వకపోతే వాకౌట్ చేసి ప్రెస్‌మీట్ పెట్టే అవకాశం ఉండనే ఉందని గుర్తు చేస్తున్నారట. జగన్ అసెంబ్లీకి హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. అయితే 11మందిలో ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలు అయిన కొందరు వైసీపీ సభ్యులు..తమ నియోజకవర్గ సమస్యలను చెప్పుకోవాలని ఆశ పడుతున్నారు. అధ్యక్షా అని సభలో తన గళం వినిపించాలని అనుకుంటున్నారట. దాంతో జగన్ మనసు మార్చుకుని అసెంబ్లీ హాజరవుతారా.? లేక ఏమైనా చేసుకోనీ అని ప్రతిపక్ష హోదా డిమాండ్‌కే కట్టుబడి ఉంటారా అన్నదే చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# వీఐపీ వాహనాల కోసం 10 కోట్లా

విజయవాడ, ఫిబ్రవరి 12,ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు.అసలే ఖాళీ ఖజానా అంటున్నారు చంద్రబాబు. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అక్కడ డబ్బులు లేవని చెబుతున్నారు. కానీ ప్రముఖ భద్రత కోసం 10 బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను 10 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాల కొనుగోలు కోసం ఏపీ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. పది టయోటా ఫార్చునర్ వాహనాలు కొనుగోలు చేసి.. వాటిని బుల్లెట్ ప్రూఫ్ వాహనాలుగా మార్చాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ వాహనాలు రాష్ట్రంలోని ముఖ్యులతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వీఐపీల కోసం ఉపయోగించనుంది. ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు కొనుగోలు కోసం ఏపీ సర్కార్ రూ. 9.20 కోట్లు ఖర్చు చేయనుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత వాహనాలనే వినియోగిస్తూ వస్తోంది. ఇప్పుడు కొత్తగా వాహనాలను సమకూర్చుకోనుండడం విశేషం.ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు. అలాగే ఏపీ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ మీద ఫోకస్ పెట్టిన తరుణంలో వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు తరచూ పర్యటిస్తుంటారు. అందుకే ఏపీలోని ప్రముఖులతో పాటు రాష్ట్రానికి వచ్చే ముఖ్యులకు రక్షణగా ఉంటాయనే ఉద్దేశంతో కొత్తగా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఇప్పటికే ఉన్న వాహనాలకు అదనంగా ఇవి అందుబాటులోకి రానున్నాయి. కొత్త వాహనాలు కాబట్టి.. సరికొత్త హంగులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తోంది.అయితే గతంలో వైసీపీ సర్కార్ వాహనాలను ఇదే మాదిరిగా కొనుగోలు చేసింది ఆ సమయంలో టిడిపి చేసిన విమర్శలు అన్ని ఇన్ని కావు. రాష్ట్రంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అప్పట్లో ఆరోపణలు చేసింది టిడిపి. అయితే ఇప్పుడు సెక్యూరిటీ వాహనాలు ఉన్నా.. అదనంగా కొనుగోలు చేస్తుండడం విశేషం. అయితే 8 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు దూరంగా ఉండాలని భావించింది. ఇదే నిర్ణయాన్ని కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు వర్తింపజేసింది. కానీ ఇప్పుడు ఏకంగా ప్రముఖుల పేరుతో దాదాపు పది కోట్ల రూపాయలు కేవలం వాహనాలకే ఖర్చు చేస్తుండడం విశేషం.

చాలావరకు ఆర్భాటాలకు దూరంగా ఉన్నట్లు కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వీరిద్దరికీ ప్రత్యేక ప్రోటోకాల్ ప్రకారం సెక్యూరిటీ కల్పిస్తున్నారు. మిగతా 23 మంది మంత్రులకు సైతం హై సెక్యూరిటీ ఉంది. అయితే ఇప్పుడు ప్రముఖుల పేరుతో ఈ కొత్తగా వాహనాలను సమకూర్చుకుంటున్నారు. అయితే ప్రభుత్వ అవసరాల కోసం అని చెబుతున్నారు. అయితే ఇవి రాష్ట్రానికి వచ్చే ప్రముఖుల కోసం అని చెప్పుకొస్తున్నారు. దీనిపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అప్పట్లో వైసీపీ సర్కార్ వాహనాలను కొనుగోలు చేస్తే సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదే మాదిరిగా ప్రత్యర్థులు ప్రచార అస్త్రంగా మార్చుకునే అవకాశం కనిపిస్తోంది

# వాట్సాప్ తో ఇంద్రకీలాద్రి సేవలు

విజయవాడ, ఫిబ్రవరి 12, వాట్సాప్ ద్వారా ఇంద్రకీలాద్రి సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం పౌర సేవలు సులభముగా పొందడానికి '95523 00009 అనే వాట్సాప్ నెంబర్ ను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ఏపీలో రెండో ప్రధాన దేవాలయం అయిన విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దర్శనాలు, సేవలు బుక్ చేసుకోడానికి, విరాళము అందించడాన్ని సులభతరం చేసింది. ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునేలా 9552300009 వాట్సాప్ నెంబర్ కు 'హై' అని వాట్సప్ లో మెసేజి చేయడం ద్వారా సేవలు అందుకోవచ్చునని ఆలయ ఈవో కె.రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం

వాట్సాప్ లో టికెట్ పొందే విధానం

అందుబాటులోకి 150 సేవలు

మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించింది. 150కిపైగా సేవలు ఇక్కడ నుంచి ప్రజలు పొందవచ్చని పేర్కొంది. బస్ టికెట్లు మొదలు కొని క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్, దేవాలయాల దర్శనాలు ఇలా 161 సేవలు లభిస్తాయి. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్ద నుంచి ఒక్క క్లిక్‌తో చాలా సేవలు లభించనున్నాయి. .ఇక్కడ క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాలనుకునే వాళ్లు రెండు విషయాలు తెలుసుకోవాలి. ఓ ఏడాదిలో ఒకసారైనా ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకున్న వాళ్లు మాత్రమే ఈ వాట్సాప్‌లో క్యాస్ట్ సర్టిఫికేట్ తీసుకోగలరు. అలా తీసుకోని వాళ్లు మాత్రం ఒకసారి నేరుగా వెళ్లి క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యాస్ట్ సర్టిఫికేట్ పొందగలుగుతారు. మీరు 9552300009 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోండి. ఆ తర్వాత వాట్సాప్‌లోకి వెళ్లి ఆ నెంబర్‌కు మెసేజ్ పంపించాల్సి ఉంటుంది. హాయ్ అని పంపించాలి. సర్వర్ బిజీని బట్టి మీకు రిప్లై వస్తుంది. సర్వర్ బిజీగా ఉంటే లేట్‌గా రిప్లై వస్తుంది. లేకుంటే త్వరగా రిప్లై వస్తుంది. రిప్లై వచ్చిన తర్వాత సేవలను అన్వేషించండి అని వస్తుంది. ఆ సేవలను అన్వేషించండి బటన్‌పై క్లిక్ చేస్తే మెయిన్ మెనూలోకి వెళ్తారు. అక్కడ మీరు ఏ కేటగిరిలో సేవలు కావాలనుకుంటున్నారో ఆ విభాగం పై క్లిక్ చేయాలి. మీకు కావాల్సింది క్యాస్ట్ సర్టిఫికేట్ కాబట్టి రెవెన్యూ విభాగంపై క్లిక్ చేయాలి. రెవెన్యూ విభాగంపై క్లిక్ చేస్తే అందులో లభించే సేవల జాబితా మీకు కనిపిస్తుంది. అందులో 13 రకాల సేవలు ఉంటాయి. ఆ సేవల విభాగంలో మీకు క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేకంగా ఏం కాలమ్ కనిపించదు. కానీ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ అనే విభాగం ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ విభాగంపై క్లిక్ చేస్తే ఆధార్ కార్డు ఎంట్రీ చేసేందుకు కాలమ్ కనిపిస్తుంది. మీ ఆధార్ కార్డు ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. మీరు ఎంట్రీ చేసిన ఆధార్ కార్డు మీదా కాదా అని చెక్ చేసేందుకు ఓటీపీ కూడా వస్తుంది. అలా వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై క్లిక్ చేయాలి. ఒకసారి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మీ తండ్రి, భర్త పేరు, మతం, విద్యార్హతలు, వైవాహిక స్థితి, మెయిల్ ఐడి అడుగుతుంది. ఇక్కడ మెయిల్ ఐడీ అనేది ఆప్షనల్. ఉంటే ఇవ్వొచ్చు లేకుంటే లేదు. ఈ వివరాలు నిర్ధారించుకోమని అడుగుతుంది. ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలతో మ్యాచ్ అయితే మీరు తర్వాత దశకు తీసుకెళు_ంది. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులతో మీ వివరాలు మ్యాచ్ కాకుంటే మాత్రం అక్కడితో సేవలు ముగిసిపోతాయి. అంటే మీరు నేరుగా వెళ్లి సర్టిఫికెట్ తీసుకోవాలని సూచిస్తుంది. ఒకసారి వివరాలు పూర్తిగా ఇచ్చిన తర్వాత సమర్పించండి అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అలా క్లిక్ చేసిన తర్వాత వాట్సాప్ ద్వారా వాళ్లకు మెసేజ్ వెళ్తుంది. కాసేపు ఆగిన తర్వాత అక్కడి నుంచి రిప్లై వస్తుంది. అందులో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేస్తే మీ వివరాలతో ఓ పేజీ వస్తుంది. అందులో ప్రస్తుతం మీరు ఉన్న అడ్రెస్, పర్మినెంట్ అడ్రెస్ ఒకటై ఉంటే అక్కడ ఉండే ఓ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. లేదంటే ప్రజెంట్ అడ్రెస్ కింద క్లిక్ చేసి అడ్రెస్ రాయాల్సి ఉంటుంది. ఇన్ని వివరాలు ఇచ్చిన తర్వాత కొనసాగించండీ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే మీకు ఓ నెంబర్ కేటాయిస్తున్నట్లు వస్తుంది. గతంలో మీకు సర్టిఫికెట్ వచ్చి ఉంటే దాన్ని మీరు ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అలా ఎంటర్ చేసిన తర్వాత శాశ్వత చిరునామా లేకుంటే తాత్కాలిక చిరునామా అని అడుగుతుంది. అందులో ఏది కావాలంటే దాన్ని మీరు క్లిక్ చేస్తే మీ ఊరి పేరు ఇతర వివరాలు కనిపిస్తాయి. అక్కడ ముందుగా మీరు ఊరి పేరు సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరు రెండోసారి ఎందుకు అప్లై చేస్తున్నారో చెప్పాల్సి ఉంటుంది. దీనికి రిలేటెడ్‌గా నాలుగు ఆప్షన్స్ ఉంటాయి. స్కూల్, కాలేజీలో అడ్మిషన్ కోసమా లేదా. ఉపాధి కోసమా, ఏవైనా స్కీమ్స్ కోసమా, రుణాల కోసమా, లేదా పేరు దిద్దుబాటు కోసమా అని చెప్పాల్సి ఉంటుంది. అలా క్లిక్ చేసిన తర్వాత ముందుకెళ్లండి అనే ఆప్షన్‌పై నొక్కితే అప్లికెంట్ పూర్తి వివరాలు వస్తాయి. అప్లై చేసిన వ్యక్తి ఎవరు, వయసు, తండ్రి పేరు, ఊరు, ఎప్పుడు అప్లై చేశారు. ఎప్పుడు అప్రూవ్ అయింది. ఇలా అన్ని వివరాలు వస్తాయి. ఆ తర్వాత చివరిగా ఉన్న రెండు ఆప్షన్స్‌పై క్లిక్ చేసి సమర్పించండి అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేయాలి. వెంటనే రెవెన్యూ అధికారులకు మీ రిక్వెస్ట్ వెళ్తుంది. ఇంతలో మీకు గతంలో ఇచ్చిన క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డును స్కాన్ చేసి పీడీఎఫ్ రెడీ చేసుకోవాలి. ఇది 1 ఎంబీ లోపు సైజు ఉండాలి. ఆ వివరాలు పంపాలని మెసేజ్ వచ్చిన వెంటనే ఈ రెండూ ఒకే ఫైల్‌లో వాట్సాప్ ద్వారానే పంపించాల్సి ఉంటుంది. ఆ వివరాలు కరెక్ట్ అయితే 40 రూపాయలు చెల్లించాలని చూపిస్తుంది. క్యాస్ట్ సర్టిఫికెట్ మరోసారి జారీ చేస్తున్నందుకు ఈ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులను కూడా అక్కడే చెల్లించవచ్చు. చెల్లించు అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి పేమెంట్ చేయాల్సి ఉంటుంది. పేమెంట్ విజయవంతమైనట్టు కూడా మెసేజ్ వస్తుంది. వచ్చిన వెంటనే సర్టిఫికెట్ వస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు. అందులో ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా కూడా మీరు వాడుకోవచ్చు.

క్యాస్ట్ సర్టిఫికేట్‌తోపాటు రెసిడెన్స్, పుట్టిన తేదీ రిలేటెడ్ వివరాలు కూడా ఉంటాయి. అందుకే మూడు విషయాలు ఇంటిగ్రేట్ అయ్యి ఉంటాయి కాబట్టి దీన్ని ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ అంటారు. ఇదే క్యాస్ట్ సర్టిఫికేట్‌గా కూడా చెల్లుబాటు అవుతుంది.

# తిరుమలలో రెడీ అవుతున్న ఫైవ్ స్టార్ హోటల్

తిరుమల, ఫిబ్రవరి 12, ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో త్వరలోనే స్టార్ హోటల్ కొలువు దీరనుంది. తిరుపతిలోని ఎస్వీ జూ పార్క్ సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. తిరుపతిలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం అడుగులు పడ్డాయి. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోయాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.తిరుపతిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 2021లో అప్పటి వైసీపీ సర్కారు హయాంలో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఆ నిర్ణయం ప్రకారం.. ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన మెస్సర్స్ ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్.. తిరుపతిలో లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. ఇది పూర్తి అయితే రాయలసీమలోనే తొలి సెవన్ స్టార్ హోటల్‌గా నిలవనుంది. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటికీ అనేక కారణాలతో ఆగిపోయింది. అయితే ఏపీ ప్రభుత్వం చొరవతో తిరిగి పనులు మొదలయ్యాయి. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అనుమతులు కూడా తాజాగా మంజూరయ్యాయి. ఏడాదిన్నర కాలంలో నిర్మాణాలు పూర్తిచేసేలా పనులు ప్రారంభించారు.ఒబెరాయ్ గ్రూప్ హోటల్ నిర్మాణానికి తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో 20 ఎకరాలను వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలాన్ని 66 ఏళ్ల లీజుకు కేటాయిస్తూ 2022లో జీవో జారీ అయ్యింది. 2023 జులైలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయితే రిసార్ట్ నిర్మాణ పనులు మాత్రం మొదలెట్టలేదు.మరోవైపు తిరుమల కొండ కింద ఇలాంటి రిసార్ట్ వద్దంటూ హిందూ సంఘాలు ఆందోళనలు కూడా చేపట్టాయి. అలాగే పేరుపైనా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ఒబెరాయ్ సంస్థ ముంతాజ్ పేరుతో ఉన్న బోర్డు తొలగించి ట్రైడెంట్ గ్రూప్ అనే బోర్డు పెట్టింది. తాజాగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నుంచి అనుమతులు కూడా రావటంతో.. ఒబెరాయ్ గ్రూప్ రిసార్ట్ నిర్మాణ పనులు మొదలెట్టింది. ఏడాదిన్నర కాలంలో నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరుపుతున్నారు

# ఢిల్లీ కాంగ్రెస్ కు ఏమైంది...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12, (న్యూస్ పల్స్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగిరింది. 12 ఏళ్లుగా ఢిల్లీని పాలించిన ఆప్.. ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. ఎటొచ్చి ఈ ఎన్నికలు మరోసారి కాంగ్రెస్‌కు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఢిల్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఆప్, బీజేపీ మధ్యే ఉంటుందని మొదటి నుంచి అంతా భావించారు. అయితే ఒకప్పుడు ఢిల్లీ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన కాంగ్రెస్.. ఈసారి ఏమైనా ఊహించని ఫలితాలు సాధిస్తుందేమో అని ఆ పార్టీ నేతలు, శ్రేణులు ఆశపడ్డాయి. కానీ అలా ఆశించిన వారికి మరోసారి నిరాశ తప్పలేదు.పూర్వ వైభవాన్ని చాటుకునే పరిస్థితులు లేకున్నా, కనీస 10 స్థానాలనైనా గెలుచుకునేలా చివరి దశ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కానీ గతంతో పోల్చితే కొద్దిగా ఓట్ల శాతం పెరగడం మినహా ఆ పార్టీకి సంతృప్తినిచ్చిన అంశం ఇంకొకటి లేదనే చెప్పాలి.1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏళ్లపాటు ఢిల్లీని కాంగ్రెస్ పాలించింది. అందుకే ప్రస్తుత ఎన్నికల్లో కనీస ఖాతా తెరవాలని గట్టి పట్టుదలగా వ్యవహరించింది. 2008లో 48శాతం ఓట్లతో 43 సీట్లు సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ 2013లో 24.70 శాతం సీట్లతో 7 సీట్లకు పరిమితమైంది. తర్వాత 2015 ఎన్నికల్లో 9.7 శాతం, 2020లో 4.3 శాతం ఓట్లు రాగా ఒక్క సీటును గెలవలేదు.అయితే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్‌కు 18శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి దాన్ని కాస్త పెంచుకున్నా 5 నుంచి 10 స్థానాలు గెలువచ్చని లెక్కలు వేసుకుంది. అయితే ఆప్‌తో పొత్తు లేకపోవడం, ప్రధాన పోటీ మొత్తంగా బీజేపీ, ఆప్‌ల మధ్యే కొనసాగుతుండటంతో కాంగ్రెస్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు. ఢిల్లీని పట్టి పీడిస్తున్న యమునా నది కాలుష్య అంశాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకునేందుకు రాహుల్‌గాంధీ స్వయంగా యమునాలో బోటులో పర్యటించారు. అయితే అది పెద్దగా ప్రభావం చూపలేదని ఫలితాల సరళిని బట్టి అర్థమవుతోంది.ఢిల్లీని ప్రధాని మోదీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మొత్తంగా నాశనం చేశారని ఎన్నికల ప్రచారంలో ఆరోపించింది కాంగ్రెస్. లిక్కర్ మాఫియాలో ఆప్ పెద్దలు కూరుకుపోయిరని, శీష్ మహల్‌లో కేజ్రీవాల్ విలాసవంతమైన జీవితాన్ని గడిపారంటూ టార్గెట్ చేసింది. ఇక ఇతర రాష్ట్రాల్లో ఇచ్చిన విధంగానే గ్యారంటీ అమలును ఢిల్లీలోనూ ప్రకటించింది. 300 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం, 'అందరికీ ఆరోగ్యం' పథకం కింద రూ.25లక్షల వరకు ఆరోగ్య బీమా, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి అనేక హామీలు ప్రకటించింది. ఈ హామీలన్ని కాంగ్రెస్ పార్టీ ఓట్ల శాతం స్వల్పంగా పెరగడానికి మాత్రమే పని చేశాయని ఫలితాల సరళిని బట్టి అర్థమవుతోంది.

## ఆర్టీవో తనిఖీలు ఆగిపోయిన ప్రైవేటు బస్సులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**బుధవారం తెల్లవారుజామున నగర వ్యాప్తంగా పలుచోట్ల ఆర్టీవో అధికారులు దాడులు జరిపారు. దాంతో పలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను డ్రైవర్లు వనస్థలి పురం వద్ద నిలిపివేసారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీవో అధికారుల దాడులు పూర్తి అయ్యే వరకు బస్సు సీటీ లోకి తీసుకొని వెళ్ళమని డ్రైవర్లు చెబుతున్నారు.

# కోళ్ల మరణానికి బర్డ్ ఫ్లూయే కారణం...



ఏలూరు, ఫిబ్రవరి 12, ఆంధ్రప్రదేశ్ కోళ్ల ఆకస్మిక మరణాలకు కారణం తెలిసింది. గోదావరి జిల్లాల్లో గత కొద్ది వారాలుగా లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో కలకలం రేగింది. ఏపీ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వైరస్ ప్రభావంతో భారీగా కోళ్ల చనిపోయాయి. ఖమ్మం, సత్తుపల్లితో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయాయి.ఈ క్రమంలో చనిపోయిన కోళ్ల నమూనాలను పశు సంవర్ధక శాఖ అధికారులు వ్యాధి నిర్ధారణ కోసం భోపాల్‌కు పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (హెచ్‌ఎన్1 -బర్డ్ ఫ్లూ వైరస్‌ను గుర్తించారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల నుంచి తీసిన నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూ రిటీ యానిమల్ డిసీజెస్ పరీక్షలకు పంపారు.పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని కోళ్ల ఫారంల నుంచి పంపిన నమూనాలు పాజిటివ్ గుర్తించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు రెండు జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చి పెట్టారు.కోళ్ల ఫారంలకు కిలోమీటరు దూరం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. పరిసర ప్రాంతా ల్లో వైరస్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెడ్ జోన్‌లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేవారు. కోళ్ల ఫారాల్లో పనిచే స్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నారు. కోళ్లకు సంక్రమిస్తున్న వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వ హిస్తున్నారు.ఏటా కొల్లేరు ప్రాంతానికి వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షుల్లో ఉండే వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందినట్టు భావిస్తున్నారు. కొల్లేరుకు వచ్చిన పక్షులు నీటిలో రెట్టలు వేసే సమయంలో ఆ వైరస్ జలాశయాల్లోకి చేరు తోంది. నీటి ప్రవాహంతో కోళ్లకు సంక్రమిస్తున్నట్టు అంచనా వేశారు.నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందిందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. మొదట్లో చనిపోయిన వాటిని పూడ్చి పెట్టకుండా బయట పడేయడంతో వైరస్ వ్యాప్తి చెందినట్టు గుర్తించారు. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటే బర్డ్ ఫ్లూ వైరస్ జీవించలేదని ప్రస్తుతం రాష్ట్రంలోని అధిక శాతం ప్రాంతాల్లో 34 డిగ్రీల పైనే నమోదవుతున్నందున వైరస్ వ్యాప్తి చెందలేదని భావిస్తున్నారు.బర్డ్ ఫ్లూగా గుర్తించిన రెండు పారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చి పెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చినట్టు ఏపీ పశు సంవర్ధక శాఖ ప్రకటించింది. పూడ్చి పెట్టే ఒక్కో కోడికి రూ.90 చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెండు కోళ్ల ఫారాల చుట్టూ కిలోమీటరు పరిధిలో రెడ్ అలర్ట్ ప్రక టించారని అక్కడ మాత్రమే చికెన్ దుకాణాలు మూసివేయాలని మిగిలిన చోట్ల ఆంక్షలు లేవని స్పష్టత ఇచ్చారు.వైరస్ వ్యాపించిన 10 కిలోమీటర్ల పరిధి లోనూ నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నట్టు పశుసంవర్థక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. . రాష్ట్రంలోని మిగి లిన ప్రాంతాల్లో కోళ్లకు ఇబ్బంది లేదన్నారు. కోడి మాంసాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉడికిస్తున్నందున ఎలాంటి భయం లేకుండా తినొచ్చని చెబుతున్నారు.

# వంశీ గాయబ్....

విజయవాడ, ఫిబ్రవరి 12, కృష్ణ జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.. నోటి దూకుడుతో అత్యంత వివాదాస్పదమైన నేతగా పాపులార్టీ సొంతం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే. టీడీపీ నుంచి పొలిటికల్ ఎంట్రి ఇచ్చి విజయవాడ ఎంపీగా పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. తర్వాత గన్నవరం టీడీపీ ఎమ్మెల్యేగా వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. 2019లో రెండో సారి గెలిచాక టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో? తన దారి తాను చూసుకుని వైసీపీ పంచకు చేరారు. మళ్లీ వైసీపీనే అధికారంలోకి వస్తుందన్న ధీమాతో టీడీపీ ముఖ్య నేతలపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటూ చెలరేగిపోయారు.గత ఎన్నికల ఓట్ల కౌంటింగ్ రోజు పోలింగ్ సరళిని గమనించి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే మాయమయ్యారు. అటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ కూడా ఘోర పరాజయం పాలవ్వడంతో నియోజకవర్గానికి దూరంగా, కేడర్ కే అందుబాటులోకి లేకుండా పోయారు. ఎంతలా అంటే ఆయన ఎక్కడున్నారా? అని అధికార పార్టీ నేతలు ఆరా తీసినా కూడా ఆచూకీ దొరకలేదంట. మధ్యలో ఒకసారి తాడేపల్లిలో జిల్లా వైసీపీ సమీక్షా సమావేశానికి హాజరైన ఆ మాజీ ఎమ్మెల్యే.. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలతో కలిసి మీడియా ముందుకు వచ్చినప్పటికీ.. మాట్లాడకుండానే గాయబ్ అయిపోయారు.వల్లభనేని వంశీ కోసం 7 నెలలుగా ఇటు సొంత పార్టీ నేతలు, అటు అధికార పార్టీ నేతలు ఎంత అచూకీ తీసినా ఎక్కడ ఉన్నారో కూడా కనిపెట్టలేకపోయారు. టీడీపీ ముఖ్య నేతలతో పాటు, చంద్రబాబు ఫ్యామిలీపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకున్న వల్లభనేని వంశీపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే విజయవాడలోని ఆయన ఇంటిపై దాడికి కూడా ప్రయత్నించడంతో పోలీసులు ఎంటరై పరిస్థితి చక్కదిద్దాల్సి వచ్చింది. గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి కేసులో ఏ 71 గా వంశీని ఎలాగైనా అరెస్టు చేయాలని పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేసినా ఆయన దొరకలేదు. ఆ కేసులో వంశీ మినహా అందరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే వంశీ మాత్రం ఎక్కడ ఉన్నారో అటు పోలీసులకు ఇటు టీడీపీ నేతలకు అంతు చిక్కలేదు.ఆ క్రమంలో వంశీ రాష్ట్రాన్ని దాటి విదేశాలకు వెళ్లారని ప్రచారం జరిగితే మరి కొంత మంది మాత్రం పక్క రాష్ట్రాల్లో తలదాచుకున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అటు చూస్తే 2019 ఎన్నికల్లో వంశీపై వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన యార్లగడ్డ వెంకట్రావు గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఇటు వంశీ కనిపించకుండా పోవడంతో గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ అనాథలా తయారైంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలకు సంబంధించి వంశీ అనుచరులు అరెస్ట్ అవుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.ఆ ఎఫెక్ట్‌తో సొంత పార్టీ శ్రేణుల నుంచి వస్తున్న విమర్శలకు ఇప్పుడు తెర వెనక ఉండే సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నారంట వంశీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గన్నవరం నియోజకవర్గంలో పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. వరుస అరెస్టులతో వైసీపీ శ్రేణులు బెంబేలెత్తిపోతున్నాయి. వంశీ కూడా అరెస్ట్ భయంతోనే పలాయనం చిత్తగించారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పుడు ఆ ప్రచారానికి సైలెంట్ గా చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్న వంశీ.. గన్నవరం నియోజకవర్గం వైసీపీలో జరుగుతున్న, మారుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని ఆయన అనచరులు అంటున్నారు.ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో వైసిపి ముఖ్య నేతలే టార్గెట్‌గా గత 7 నెలల వ్యవధిలో నమోదైన కేసులు, అరెస్టులు, దాడులు లాంటి అంశాల విషయంలో వంశీ పార్టీ వారికి నేనున్నాను అనే భరోసాను ఇస్తున్నారట. గన్నవరం టీడీపీ కార్యాలయం పై దాడి కేసులో 89మంది నిందితులను చేర్చగా .. తాను కూడా ఒక నిందితుడైన వంశీ మిగిలిన వారికి ఏ రకమైన సహాయసహకారాలు అందించలేదని వైసీపీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత కేసులు మొత్తం తిరగదోడుతుండటంతో గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, నేతలపై నమోదైన కేసులను మాజీ ఎమ్మెల్యే సీరియస్‌గా తీసుకున్నారంట.అందులో భాగంగా కేసులకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారంట. జిల్లా స్థాయిలో స్పెషల్ కోర్టులో బెయిల్ వ్యవహారాలు చూడటానికి ఒక టీమ్‌ని.. అవసరమైతే సుప్రీంకోర్టు, హై కోర్టు మెట్లు ఎక్కడానికి ఒక టీమ్‌ని ప్రత్యేకంగా నియమించి కేసుల బాధ్యతను భుజానికెత్తుకున్నారంట. అనేక కేసుల్లో ఇటీవల వంశీ ప్రధాన అనుచరులతో పాటు కీలక నేతల అందరి పైన కేసు నమోదు అయ్యాయి. పలువుర్ని అరెస్టు చేశారు. దాంతో వారికి భరోసా కల్పించడానికి.. వారి కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడంతో పాటు.. న్యాయపరమైన వ్యవహారాలను తెర వెనుక ఉండి సూపర్‌వైజ్ చేస్తున్నారంటనోరు జారి వంశీ చేసిన విమర్శలు అప్పట్లో పెద్ద కలకలమే రేపాయి. వంశీ ప్రోద్బలంతో గన్నవరం నియోజకవర్గంలో జరిగిన దాడులకు ప్రస్తుతం వైసీపీ శ్రేణులు మూల్యం చెల్లించుకుంటున్నాయి. వంశీ సైతం కేసులు చట్రంలో ఇరుక్కున్నారు. దాంతో ఆయన నియోజక వర్గానికి ముఖం చాటేస్తున్నారు. అయితే దీర్ఘ కాలం కేడర్‌కు అందుబాటులో లేకుండా పోతే.. రాజకీయంగా అసలుకే ఎసరు వస్తుందనుకున్నారో ఏమో? వంశీ తిరిగి యాక్టివ్ అవ్వడానికి గ్రౌండ్ ప్రిపేర్చేసుకుంటున్నారంట. తనతో పాటు వైసీపీ వారిపై పెట్టిన కేసులకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చిస్తూ వాటి నుంచి బయట పడే పనిలో ఉన్నారంటున్నారు.వైసీపీ వారికి ఆర్థికంగా అండగా నిలబడుతూ.. కేసుల చిక్కులు తొలగిపోగానే నియోజకవర్గానికి వచ్చి అందర్నీ కలుస్తానని తన వారితో చెప్పిస్తున్నారంట. తాను ఎక్కడున్నాననేది ఇప్పుడు అప్రస్తుతమని, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నుంచి అందరూ బయట పడ్డాక పార్టీ యాక్టివిటీస్ మొదలుపెడతామని సూచిస్తున్నారంట. కేసులు దాడులు, అరెస్టులపై ఆందోళన చెంద వద్దని, తన కేసుకు సంబంధించి ఒక క్లారిటీ వచ్చాక నియోజకవర్గంలోనే త్వరలో సమావేశాన్ని నిర్వహించి నేతలందరినీ కలుస్తానని రాయబారాలు పంపుతున్నారంట. తన రాజకీయ భవిష్యత్తు కోసం వంశీ పడుతున్న పాట్లు ప్రస్తుతం గన్నవరం సెగ్మెంట్లో హాట్ టాపిక్‌గా మారాయి. వంశీ ప్రయత్నాలు ఫలించి తమ వారు బెయిలుపై బయటకు వస్తే చాలని నిందితుల ఫ్యామిలీలు ఎదురు చూస్తున్నాయి. చూడాలి మరి వంశీ అన్నీ చక్క పెట్టుకుని ఎప్పుడు వస్తారో?

## ఏలూరు రెండో పట్టణం గన్ బజార్ మస్జిద్ వద్ద ఉద్రిక్తత

ఏలూరు బుధవారం నాడు గన్ బజార్ మసీదు దగ్గర ఉద్రిక్తత నెలకింది. వక్ఫ్ బోర్డ్ భూమి వివాదంలో చెలరేగిన ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. భారీ సంఖ్యలో ఇరువర్గాలు చెరుకున్నాయి.

# ఏమౌతోంది... ఈ మనుషలకు...

ఈ భూమ్మీద అత్యంత క్రూరమైన జంతువుగా మారగలిగేది ఒక్క మనిషి మాత్రమే. రెండు కాళ్లతో పుట్టి నాలుగు కాళ్ల జంతువుగా మారేది మనిషి ఒపాతికేళ్ల కుర్రాడి నుంచి యాభై ఏళ్ల బామ్మదాకా అందరిలో విలనిజం వెర్రితలలు వేస్తోంది నేరాలకు కారణం ఏంటని.. దాని మూలాలను వెతుకుతూ వెళ్తే కనిపిస్తున్న అడ్రస్ 'ఇల్లు'. నానమ్మ కళ్లలో ఆనందం కోసం చెల్లెలి భర్తనే చంపేశారు.

వయసుమళ్లిన తరువాత శాంతంగా, ప్రశాంతంగా ఉండాల్సిన నాయనమ్మే.. మనవళ్లకు పగను నూరిపోయడం వల్ల జరిగింది కాదా ఆ ఘోరం..! వంద మంది అమ్మాయిలను అనుభవించడమే లక్ష్యమట. ఆ టార్గెట్ మరిచిపోకుండా ఉండేందుకు ఏకంగా పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఛాతి మీద. హత్య చేయడానికి, అత్యాచారం చేయడానికి, కన్నవాళ్లనే చిదిమేయడానికి, కట్టుకున్నవాళ్లనే అంతమొందించడానికి.. వీటన్నింటికీ కారణాలున్నాయ్.

మనిషి మృగంగా ఎప్పుడు, ఎందుకు మారతాడనడానికి కొన్ని లెక్కలున్నాయి.ఆస్తి ఇవ్వలేదని తాతను పొడిచాడు. ఒక్కసారి కాదు 73 సార్లు పొడుస్తూనే ఉన్నాడు కసిగా. తల్లి అని కూడా చూడకుండా అడ్డొచ్చిన ఆమెపైనా కత్తితో పొడిచేశాడు. మనిషిలో మానవత్వం మాయమవుతోందని చెప్పడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. అసలు.. మానవత్వం మానవత్వం అని గొంతుచించుకుంటూ అరుచుకుంటూ వెళ్తున్నాం గానీ.. కనీసం పశుత్వం అయినా మనిషిలో ఉందా అనేదే అనుమానం. భార్యను ముక్కలుముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడికించి, ఎముకలు పొడి చేసి, చెరువులో పడేశాడట. మనసులో ఎంత పశుత్వం ఉంటే అంత పనిచేయగలడు. మానిప్యులేటర్స్ అనే పదాన్ని ఈమధ్య క్రైమ్‌లో కూడా వాడుతున్నారు. సైకాలజిస్టులు క్యాటగరైజ్ చేసిన సైకో మెంటాలిటీస్.. ఈ మానిప్యులేటర్స్. ఎలా ఉంటారంటే వీళ్లు. మాటలతోనే మంత్రాజల్లుతుంటారు. ఎదుటివారిని నమ్మించగలిగినప్పుడే మోసం చేయొచ్చు. అత్యంత దారుణాలు జరిగేది కూడా నమ్మిన వాళ్ల దగ్గరే. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయిని.. తనపై నమ్మకం పెరిగేంతగా నటించాడు ఓ యువకుడు. ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి, ఆ అమ్మాయిని రప్పించాడు. ఇంట్లో ఫంక్షన్ జరగడం లేదని తెలిసినా సరే.. అక్కడే తన కాలేజ్‌లో చదువుతున్న మరో యువకుడిని చూసి ఏం కాదులే అని నమ్మిందా అభాగ్యురాలు. ఆ నమ్మకమే, అలా నమ్మడం వల్లే ఆ తరువాత నరకం చూసింది. పిలిచిన వ్యక్తి ప్లస్ ఆ తోటి విద్యార్థి.. ఇద్దరూ బయట కాపలాగా ఉంటే.. మూడో వ్యక్తి వచ్చి అత్యాచారం చేశాడు. పైగా ఆ అరుపులు బయటకు వినించకుండా సౌండ్ బాక్సులు పెట్టారట.

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో జరిగిందీ దారుణం.ఆడపిల్లల జీవితాలతో మస్తాన్ సాయి ఆడుకుంటూపోయాడని చెబుతున్నారు మానసిక వైద్యులు. ప్రభాకర్ అనే సైకోమెంటాలిటీ ఉన్నవాడిని ఈ మధ్యే చూశాం. వంద మంది అమ్మాయిలే టార్గెట్ అట. ఎంత మానిప్యులేటర్ కాకపోతే.. అంతమందిని లక్ష్యంగా పెట్టుకుంటాడు. మాటలు, మంచితనాన్ని అడ్డుపెట్టి ఎంతమంది అమ్మాయిలను నమ్మించి మోసం చేసి ఉంటాడు. మీర్‌పేటలో భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తినే చూడండి. ఆ చుట్టుపక్కల ఎవరిని అడిగినా సరే.. 'అరె.. అతను చాలా మంచివాడే, ఇలా ఎలా చేశాడు, అసలు అంత దారుణమైన పని చేస్తాడని ఊహించనే లేదు' అనే చెప్పారంతా. హీ ఈజ్ ఆల్సో ఏ వెరీ గుడ్ మానిప్యులేటర్.ఇదనే కాదు.. చిన్న పిల్లలపై, మైనర్లపై అఘాయిత్యాలు చేసేది అలా నమ్మించే వాళ్లే. అన్న కదా, అక్కా అని పిలిచాడు కదా, బాబాయ్, పెదనాన్న, తాతే కదా అని నమ్మకంతో వెళ్లినందుకు ఎంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారో. ఆ పశుప్రవృత్తికి కారణం.. 'విషయం బయటకు తెలిస్తే తమ పరువే పోతుందని స్వయంగా తల్లిదండ్రులే భయపడడం'. కామాంధుల బలం కూడా అదే. బయటకు చెప్పుకోలేరు అనే అస్త్రాన్ని ప్రయోగించి.. అయినవాళ్లనే, వావివరసలు మరిచి ప్రవర్తిస్తుంటారు. కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయ్. ఎన్సీఆర్బీ-2016 రిపోర్ట్ ప్రకారం మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార కేసుల్లో.. 94 శాతం దోషులు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వాళ్లు, దగ్గర వాళ్లే. ఆ దోషులలో 29 శాతం మంది ఇరుగుపొరుగు వాళ్లు, 27 శాతం పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చిన వాళ్లు, 6 శాతం బంధువులు, మిగతా 30 శాతం ఆ కుటుంబానికి చాలా దగ్గరగా ఉండేవాళ్లు. సో, ఒక్కోసారి నమ్మకమే ప్రమాదకరం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు పసిపిల్లలను కొట్టిన తీరు చూసి.. వైద్యం చేసిన డాక్టర్లే కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతలా కొట్టడానికి మనసెలా వచ్చిందని. పిల్లల్ని అలా కొట్టడానికి కారణం ఏంటో తెలుసా. వివాహేతర సంబంధం. తన వ్యవహారానికి పిల్లలు అడ్డొస్తున్నారని ఫోన్ ఛార్జర్ వైర్‌తో కొడుతుంటే.. చర్మం చిరిగిపోయి, రక్తం బయటకు చిమ్మింది. అక్కడితో ఆగలేదు. ఆ గాయాలపై కారం పూశారట. 9 ఏళ్ల బాలుడు అనుభవించిన టార్చర్ వింటే ఎవరికైనా కన్నీళ్లొస్తాయ్. ఆ బాలుడి చెల్లెలు.. వయసు ఐదేళ్లుంటాయి.. ఆ చిన్నారిని కూడా వాతలు తేలేలా కొట్టాడు.

ఆ అడ్డమైన సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారన్న కోపంతో చేసిన దుర్మార్గం ఇది.జాతివైరాన్ని మరిచిన జంతువులు' అని ఒక్కోసారి కొన్ని వీడియోలు చూస్తుంటాం. లేడిపిల్ల దగ్గరకు వచ్చినా సరే పులి ఏమీ చేయకుండా దాన్ని నాకుతూ ఉంటుంది ఆప్యాయంగా. అలాంటిది కడుపున పుట్టిన వారినే దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తున్న తల్లిదండ్రులున్నారు. 14 ఏళ్ల కొడుకుపై పిడిగుద్దులు కురిపించాడో తండ్రి. ఛాతిపై తట్టుకోలేనంత తీవ్రతతో పిడికిలి బిగించి మరీ బాదాడు. అంత దెబ్బ తగిలితే పిల్లాడు ఉంటాడా. అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇంత దారుణంగా ప్రవర్తించడానికి కారణం.. తన కొడుకు రాత్రి 8 అయినా ఇంటికి రాకపోవడం. 'నాన్నా స్కూల్లో ఫేర్‌వెల్ పార్టీ జరిగింది.. కాస్త ఆలస్యం అయింది' అని చెబుతున్నా వినకుండా కొట్టడంతో తొమ్మిదో తరగతి చదివే ఆ బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిందిది.


తెలంగాణనే చూద్దాం. ఒక్క ఏడాదిలోనే కుటుంబ కలహాలతో 229 హత్యలు జరిగాయి. వివాహేతర సంబంధాల కారణంగా 102 హత్యలు, చిన్నచిన్న గొడవల కారణంగా 82, ఆర్థిక వివాదాలతో 53 హత్యలు జరిగాయి. గతేడాది మహిళలపై జరిగిన నేరాలే.. 19వేల 922. వీటిలో సగం వరకట్న వేధింపులే.

ఇక అత్యాచార కేసులలో 99.2 శాతం నిందితులు బాధితులకు తెలిసినవారే చేశారంటున్నారు తెలంగాణ పోలీసులు.ఓవైపు.. కఠిన శిక్షలు ఉన్నా, మరణశిక్షలు విధిస్తున్నా సరే.. ఈ అత్యాచారాలు మాత్రం ఆగడం లేదు. 2012లో నిర్భయ ఘటన జరిగాక.. అత్యాచారాలకు అత్యధికంగా మరణశిక్ష కూడా విధించొచ్చు అంటూ చట్టంలో మార్పులు చేశారు. ఈ శిక్షతో నేరస్తులు భయపడిపోతారని అనుకున్నారంతా. కానీ జరిగిందేమిటో తెలుసా. 2015లో 34వేల 651 అత్యాచార కేసులు, 2016లో 38వేల 947 అత్యాచార కేసులు రిజిస్టర్ అయ్యాయి. 2012లో.. అంటే నిర్భయ ఘటన జరిగిన ఏడాదిలో.. 24వేల 923 సంఘటనలే జరిగాయి. అంటే.. ఉరిశిక్ష పడుతుందన్న భయం కూడా లేదని తేలిపోయింది. పైగా ఇలా అత్యాచార బాధితుల్లో ఎక్కువగా పిల్లలే ఉన్నారు. పోక్సో లాంటి పవర్‌ఫుల్ చట్టం ఉన్నప్పటికీ.. కేవలం 3 శాతం కేసులలో మాత్రమే నేరాలుగా నిరూపించగలిగారు. ఔఅఖీః రిపోర్ట్ ప్రకారం.. 2016లో పిల్లలపై అత్యాచారాలకు సంబంధించి 64వేల 138 కేసులు పోక్సో చట్టం కింద నమోదైతే.. కేవలం 3 శాతం కేసులనే నిరూపించగలిగారు. నేరమే నిరూపించలేకపోయినప్పుడు ఎవరిని ఉరి తీస్తారు?వీటన్నింటికీ కారణం ఏంటని అడిగితే.. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవడమే అనే సమాధానమే ప్రధానంగా వినిపిస్తోంది. పిల్లల్ని పెంచే పద్ధతిలోనే ఏదో లోపం జరుగుతోంది. అటుపైన ప్రతి ఇంట్లోకి వేగంగా దూసుకొచ్చిన ఇంటర్నెట్. ఏ నేరం ఎలా చేయాలో, ఎలా చేస్తే తప్పించుకోవచ్చో చెప్పే సినిమాలు సెల్‌ఫోన్ నిండా ఉన్నప్పుడు.. టెస్టోస్టెరాన్ స్థాయిని పెంచే ఘాటైన వీడియోలు కళ్లముందే కదలాడుతున్నప్పుడు.. ఇక నేరాలు జరక్కుండా ఉంటాయా? అయినా లోపం.. ఇంటర్నెట్‌తో, రెచ్చగొట్టే వీడియోలది మాత్రమే కాదు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరులోనే లోపం ఉంది. యూరప్‌లోని కొన్ని దేశాల్లో జైళ్లనే ఎత్తేశారు. కారణం.. అక్కడ నేరాలు జరక్కపోవడమే. అంటే ఏంటీ అర్థం. మనిషి సంతృప్తిగా జీవించినప్పుడు, ఆ మనిషి సంతృప్తికరంగా జీవించేలా ప్రభుత్వాలు సమాజాన్ని నిర్మించినప్పుడు మాత్రమే నేరాల కట్టడి సాధ్యం. ఉరివేయాలి, మెడలు కోయాలి, బహిరంగంగా తగలబెట్టాలి.. ఇలాంటి శిక్షలు సైతం మనిషిని మార్చలేవు. సో, సమాజం మారాలంటే.. అటు ప్రభుత్వాలు కూడా జీడీపీ ఆధారంగా కాకుండా హ్యాపీనెస్ ఇండెక్స్ కొలమానంగా పాలించాలంటున్నారు విశ్లేషకులు. మరి.. అలాంటి రోజులు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు చూస్తామో..!

# స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయురాలు సరోజిని నాయుడు

## -నేడు సరోజిని నాయుడు జయంతి

## -మహిళలందరికీ జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు




జాతీయ మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి 13, దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన సరోజిని నాయుడు జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా పాటిస్తున్నారు

ప్రముఖ స్వతంత్ర సమరయోధురాలు, భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజినినాయుడు ఫిబ్రవరి 13, 1879న హైదరాబాద్ లో జన్మించారు. ఈ సంవత్సరం సరోజినినాయుడు 146వ జయంతి.

హైదరాబాద్ లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో ఫిబ్రవరి 13, 1897న ఆమె జన్మించారు. తల్లిదండ్రులు అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీ దేవి. శాస్త్రవేత్త,తత్వవేత్త అయిన అఘోరనాథ చటోపాధ్యాయ హైదరాబాద్‌లో నిజాం కాలేజీ ని స్థాపించి, ప్రిన్స్‌పాల్‌గా చాలా కాలం పనిచేశారు. తల్లి వరద సుందరీ దేవి కవయిత్రి.

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేసిన వారిలో సరోజినీనాయుడు ప్రముఖ రాలు. కవిత్వంతో మాధుర్యన్ని కురిపించి నైటింగేల్ ఆఫ్ ఇండియా (భారత కోకిల) గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారు.

ఆమె భారత జాతీయవాద ఉద్యమంలో భాగమైంది. మహాత్మా గాంధీ ఆయన స్వరాజ్య భావనకు అనుచరురాలిగా మారింది. 1930 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మరియు మదన్ మోహన్ మాలవ్య వంటి ఇతర కాంగ్రెస్ నాయకులతో పాటు ఆమెను అరెస్టు చేశారు. శాసనోల్లంఘన ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రధాన వ్యక్తులలో సరోజిని ఒకరు. ఆ సమయంలో బ్రిటిష్ అధికారులచే ఆమె పదే పదే అరెస్టులను ఎదుర్కొంది మరియు 21 నెలలకు పైగా (1 సంవత్సరం 9 నెలలు) జైలులో గడిపింది. ఆమె 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు మరియు తరువాత 1947లో యునైటెడ్ ప్రావిన్సెస్ గవర్నర్ అయ్యారు, భారతదేశంలో గవర్నర్ పదవిని నిర్వహించిన మొదటి మహిళగా నిలిచారు.

ఆమె అనిబెసెంట్ తర్వాత జాతీయ కాంగ్రెస్ పార్టీకి రెండవ మహిళా అధ్యక్షురాలిగా 1925లో ఎన్నికయ్యారు. ఆమె 1928లో దేశంలో ప్లేగ్ వ్యాధి ప్రబలిన కాలంలో చేసిన పనులకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం ఖైసేర్ ఏ హింద్ బిరుదును అందించింది.

ఆమె 1947 నుండి 1949 వరకు ఆగ్రా మరియు ఔద్ సమైక్య ప్రావిన్సుకు తొలి గవర్నరుగా నియమించబడి, దేశంలో తొలి మహిళాగవర్నర్ గా చరిత్రకెక్కారు.

తనే దేశం, దేశమే తనుగా భావించి దేశ సేవ చేసిన అభేద భావాల మూర్తి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో రకరకాలుగా సేవలు చేసి మానవ సేవ చేయదలుచుకున్న వారికి మార్గాలనేకం అని నిరూపించిన మహితాన్వితురాలు. జీవితమంతా మానవ సేవకు, దేశసేవకూ అంకితము చేసి తన డబ్బై వ యేట 1949 మార్చి 2 వ తేదీన లక్నోలో ప్రశాంతంగా కన్ను మూసింది.సరోజిని నాయుడు కొన్నిరచనలు:

?గోల్డెన్ త్రెషోల్డ్ అనే మొదటి కావ్య సంకలనాన్ని ఆమె 1905లో ప్రచురించారు.

?ది బర్డ్ ఆఫ్ టైం: సాంగ్స్ ఆఫ్ లైఫ్ డెత్ అండ్ ది స్ప్రింగ్,?ది ఇండియన్ వీవర్స్,?ది బాంగిల్ సెల్లెర్స్..అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.

## హైదరాబాద్ లో ఠాగూర్ సీన్ రిపీట్....

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12**, వ్యాధి వచ్చిందంటే ఆస్పత్రికి వెళ్లడానికి కూడా ఈ రోజుల్లో చాలా మంది భయపడుతున్నారు. టెస్టులు, ట్రీట్‌మెంట్ పేరుతో ఆస్పత్రులు వేలకు వేలు వసూలు చేస్తున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రుల బిల్లులు అయితే లక్షల్లోనే ఉంటున్నాయి. అందుకే చాలా మంది ప్రైవేటు ఆస్పత్రి అంటేనే హడలి పోతున్నారు. వ్యాధి భయం కన్నా ఫీజుల భయమే వారిని టెన్షన్ పెడుతోంది. చాలా ఆస్పత్రుల్లో ఠాగూర్ తరహా సీన్లు కూడా రిపీట్ అవుతున్నాయి. తాజాగా హైదరాబాద్)లోని ఓ ఆస్పత్రి ఠాగూర్ సినిమా సీన్‌ను రిపీట్ చేసింది. చనిపోయిన రోగిరి రెండు రోజులు ట్రీట్‌మెంట్ చేసి లక్షల రూపాయల బిల్లు వేసింది. చివరకు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించింది. అక్కకడకు వెళ్లాక అసలు విషయం తెలిసింది. రెండు రోజుల క్రితమే రోగి చనిరిపోయినట్లు వెల్లడించారు. దీంతో బాధిత కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోలన చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడ జిల్లాకు చెందిన సుహాసిని(26) కళ్లు తిరిగి పడిపోవడంతో నెల క్రితం మియాపూర్‌లోని ఓ హాస్పిటల్‌కు బంధువుల తీసుకువచ్చారు. చికిత్స పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. దీంతో చివరకు డబ్బులు కట్టలేని పరిస్థితి వచ్చింది. దీంతో చేసేది లేక వైద్యులు నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. నిమ్స్‌కు తరలించగా.. సుహాసిని చనిపోయి రెండు రోజులైందని వెల్లడించారు. దీంతో ఆమె బంధులు షాక్ అయ్యారు.దీంతో రెండు రోజులు ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు డబ్బుల కోసం శవానికి చికిత్స చేసినట్లు డ్రామా ఆడారన్న విషయం అర్థమైంది. దీంతో బాధిత కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేశారు. రెండు రోజుల క్రితం చనిపోయినా ఎందుకు సమాచారం ఇవ్వలేదని, ట్రీట్‌మెంట్ పేరుతో డ్రామాలాడారని ఆవేదన వ్యక్తం చేశారు.

# మావోలపై ముప్పేట దాడి....

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ఫిబ్రవరి 12**,వరుస ఎన్ కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. మావోయిస్టులకు పట్టున్న ఛత్తీస్ ఘడ్ కేంద్రంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుంది. ఏరివేత లో భాగంగా ఎన్ కౌంటర్ లు నిత్యకృతయమయ్యాయి. ఒక ఎన్ కౌంటర్ మరువక ముందే మరో ఎన్ కౌంటర్ జరుగుతుంది. ఎన్ కౌంటర్ జరిగిన ప్రతిసారి పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందుతున్నారు. నిన్న ఆదివారం ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో కాల్పుల మోత మోగింది. పోలీస్ బలగాలు, మావోయిస్టుల తూటాలకు 31 మంది మావోయిస్టులు మృతి చెందగా. మృతుల్లో 11 మంది మహిళలు, 20 మంది పురుషులు ఉన్నట్లు తెలిపారు. ఎదురు కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ప్రకటనలో తెలిపారు. పక్కా సంచారంతో పోలీస్ బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున మావోయిస్టులకు, పోలీస్ బలగాలకు మధ్య ఎదురు కాల్పులు మొదలయ్యాయి. మావోయిస్టుల ఏరివేత లో భాగంగా ఆఖీఉ, ూఊ తో పాటు కేంద్ర బలగాలు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడడంతో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్టు బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, ఎన్ కౌంటర్ స్థలం నుండి ఏఖ 47, ూఒఖీ, ఎఔూఆ రైఫిల్, 303 ఆయుధాలతో పాటు మావోయిస్టులు తయారు చేసిన రాకెట్ లాంచర్, బిజిఎల్ లాంచర్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ తెలిపారు.

ఫిబ్రవరి 1వ తేదీన ఛత్తీస్ ఘఢ్ బీజాపూర్ జిల్లాలోని గంగలూరు అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు జరిగిన జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనమిది మంది మావోయిస్టులు మృతి చెందారు.

మరో ఒకటి నిన్న ఫిబ్రవరి 9వ తేదీన ఛత్తీస్ ఘఢ్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ భారీ సంఖ్యలో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు.

జనవరి నెలలో ఆరు ఎన్ కౌంటర్లు..

- జనవరి 29 న జార్ఖండ్ రాష్ట్రంలోని చైబాసా, సోమావా పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటన స్థలం నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు తెలిపారు.
- జనవరి 19 వ తేదీన ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ బలగాలకు, మావోయిస్టుల మధ్య మొదలైన ఎదురుకాల్పులు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. ఈ ఎన్ ఎన్ కౌంటర్ లో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ కీలక నేతను కోల్పోయింది. కేంద్రకమిటీ సభ్యులు, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి చలపతి మృతి చెందారు.
- జనవరి 16 వ తేదీన ఛత్తీస్ ఘఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో పోలీస్ లకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీస్ లు వెల్లడించారు. 16 వ తేదీన నుండి 17 వ తేది రెండు రోజుల పాటు జరిగిన ఎన్ కౌంటర్ లో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ తప్పించుకున్నారు. ఈ ఎన్ ఎన్ కౌంటర్ రెండు రోజులకు మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. పూజారి కంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు లేఖ లో పేర్కొన్నారు.
- జనవరి 12 వ తేదీన ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లా నేపనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత దళాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు పోలీస్ తెలిపారు. ఘటన స్థలం నుండి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ లు వెల్లడించారు.
- జనవరి 5 వ తేదీన నారాయణపూర్, దంతెవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన లో ఒక జవాన్ మృతి చెందినట్లు పోలీస్ లు ప్రకటించారు.

2025 కొత్త సంవత్సరం ప్రారంభమైన మూడు రోజులకే 3 వ తేదీన ఒడిశా సరిహద్దుల్లో బలగాలకు, మావోల కు జరిగిన ఎన్ కౌంటర్ లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు గారియాబాద్ పోలీస్ లు వెల్లడించారు.

వరుస ఎన్ కౌంటర్లతో మావోయిస్టుల ఏరివేత..

మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్ర బలగాలు, ఆయా రాష్ట్ర పోలీసులు, మావోయిస్టుల ఏరివేతకు ఏర్పాటు చేసిన బలగాలు సెర్చ్ ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా ఛత్తీస్ ఘడ్ అటవీ ప్రాంతాన్ని పోలీస్ బలగాలు దండకారణ్యాన్ని జల్లడ పడుతున్నాయి. దీంతో మావోయిస్టు దళాలు ఎదురు పడడం లేదా పక్క సమాచారంతో బలగాలు మావోయిస్టులను మట్టుపెడుతున్నారు. ఈ సంవత్సరం 2025 జనవరి 3 తేదీన నుండి మొదలైన ఎన్ కౌంటర్లు

## ఆందోళన బాటలో హలీం నిర్వాహకులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,** హైదరాబాద్‌లో హలీం నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. తాము ఎంతో కష్టపడి ఏర్పాటు చేసుకున్న హలీం బట్టీలను కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బందిపై హలీం నిర్వాహకులు మండిపడుతున్నారు. అన్ని అనుమతులు తీసుకునే హలీం స్టాళ్లు నిర్వహిస్తున్నామని, ఇలా చేసి మా పొట్ట కొట్టవద్దంటూ ప్రాధేయపడుతున్నారు. నగరంలో రంజాన్ మాసం వస్తుందంటే ఎక్కడ చూసినా హలీం సందడే కనబడుతుంది. రంజాన్ వస్తుందంటే చాలు.. ఎప్పుడెప్పుడు ఆస్వాదిద్దామా అని హలీం ప్రియులు ఎదురుచూస్తుంటారు. రంజాన్ మాసం ముస్లింలకు ఎంత ప్రత్యేకమైందో.. హలీం మీద ఉన్న ఇష్టం కూడా అంతే స్థాయిలో ఉంటుంది. జనాలు అంతగా ఇష్టపడే హలీంకి సంబంధించిన వ్యాపారాన్ని తమకు కాకుండా చేసి ఇలా ఇబ్బందులు పెడుతున్నారని హలీం నిర్వాహకులు చెబుతున్న మాట.నగరంలోని బంజారాహిల్స్ సలీంనగర్‌లో కొందరు హలీం నిర్వాహకులు రోడ్డెక్కారు. తమకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హలీం బట్టీలను కూల్చివేశారని మండిపడుతున్నారు. గత 30 ఏళ్లుగా ఇక్కడే హలీం విక్రయాలు సాగిస్తున్నామని, ఇదే తమ జీవనాధారమని ఇప్పుడు కొత్తగా ఇలా తమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం సరికాదని అంటున్నారు. మా తాతముత్తాతల దగ్గరి నుంచి ఏటా హలీం వ్యాపారం నిర్వహిస్తున్నామని, గతంలో ఎప్పుడూ ఇలా ఇబ్బందులు ఎదురవలేదని చెబుతున్నారు. మాలాంటి పేదలపైన ఇలా అధికారులు జులుం ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమని, దీనిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని అంటున్నారు. రంజాన్ మాసం దృష్ట్యా ఒక నెల వ్యాపారం నిమిత్తం బట్టీ ఏర్పాటు చేసుకున్నామని, నెల గడిచిన తర్వాత తమంతట తామే వాటిని తొలగిస్తామని.. కానీ, ఇంతలో ఇలా చేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని నిర్వాహకులు ఆందోళనతో చెబుతున్నారు.అయితే నిర్వాహకుల దయనీయ పరిస్థితి ఇలా ఉంటే, రోడ్డు పక్కన ఏర్పాటు చేసే హలీం బట్టీల ద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని.. అందుకే తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు నిర్వహించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరిస్తున్నారు. నియమ నిబంధలను అతిక్రమించి రోడ్డుకు ఇరువైపులా హలీం బట్టీలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు.

# చిన్నారులతో కలిసి డిన్నర్ చేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** సంపాదించిన సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సుకోసం వినియోగించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చిన్నప్పుడే పిల్లల్లో సేవ భావం పెంపొందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. చిన్ననాటి ఉంటే పిల్లల్లో పెద్దలపట్ల సమాజం పట్ల ఎలా నడుచుకోవాలి నేర్పించాలని హితవు పలికారు. హైదరాబాదు జూబ్లీహిల్స్ లోని ఏఎస్ఎఫ్ బిబిక్యూ ఓ గ్రిల్ రెస్టారెంట్ లో ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆమె కాసేపు సరదాగా గడిపారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో చిన్నారులతో పాటు మంత్రి పాలుపంచుకొని వారిలో ఆనందాన్ని నింపారు. సామాజిక బాధ్యతగా చిన్నారులకు మంచి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు కాడ అఖిల్ ఓ ఆరిఫ్ అలీ అన్నారు. చిన్నారుల్లో ఆనందం నింపడమే వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్ కార్యక్రమం పేర్కొన్నారు. ఎన్జీవో చెందిన 70 మంది చిన్నారులకు ఆహార అందించడం ఆనందంగా ఉందన్నారు

# టాలీవుడ్ పై పైరసి భూతం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ఫిబ్రవరి 12,** టాలీవుడ్ ను పైరసీ భూతం వెంటాడుతోంది. ఏ సినిమా అయినా...థియేటర్లలో విడుదలైన గంటల వ్యవధిలో ఆన్ లైన్ లో దర్శనం ఇస్తుంది. పవన్ కల్యాణ్ అత్తారింటిది దారేది చిత్రం నుంచి తాజాగా విడుదలైన తండేల్ వరకు ఎన్నో చిత్రాలు పైరసీ బారిన పడినవే. వందల కోట్లు పెట్టుబడిగా పెట్టి వందల వంది టెక్నీషియన్లతో నెలల పాటు తీసిన చిత్ర బృందం కష్టాన్ని గంటల వ్యవధిలో బూడిదపాలు చేస్తున్నారు. పైరసీ వెబ్ సైట్స్, ఫ్యాన్స్ వార్...ఇలా కారణాలు ఏమైనా చివరికి నష్టపోయేది సినిమా నిర్మాతలే.పైరసీ భూతాన్ని అరికట్టేందుకు కఠిన చట్టాలు ఉన్నా...ఎంత వరకూ ఆచరణలో ఉన్నాయన్నదే పెద్ద ప్రశ్న. ఎంత మంది నిందితులను చట్టం ముందు నిలబెట్టారనే ప్రశ్నలు తలెత్తు?తున్నాయి. టెక్నాలజీ సాయంతో రెచ్చిపోతున్న పైరసీ కేటుగాళ్లకు అడ్డుకట్ట వేయలేమా? అనే సందేహాలు మరోసారి చర్చనీయాంశం అవుతున్నాయిహీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్' సినిమాను పైరసీ భూతం వెంటాడుతోంది. ఈ సినిమా విడుదలైన రెండు రోజుల్లోనే ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రదర్శించడం తీవ్ర చర్చనీయాంశమైంది. చిత్ర నిర్మాత బన్నివాసు స్పందిస్తూ... ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఛైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు విచారణకు ఆదేశించారు.ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తండేల్ సినిమ పైరసీ ప్రింట్ ప్రదర్శించడం దారుణమని నిర్మాత బన్నీవాసు ఆవేదన చెందారు. చిత్ర విజయానికి పైరసీ ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఇలాంటి తప్పులు చేస్తున్నారన్నారు. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్స్‌లో పైరసీ లింక్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని అన్నారు. పైరసీ చేస్తున్న వారిని, దాన్ని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతున్నామని, వాళ్లంతా జైలుకు వెళ్లే అవకాశముందని నిర్మాత బన్నీ వాసు హెచ్చరించారు.ఫిల్మ్ ఛాంబర్ చర్యలతో కొన్ని ఏళ్లుగా సినిమా పైరసీ జరగడం లేదని, ఇటీవల కాలంలో మళ్లీ ఈ రాక్షసి విరుచుకుపడుతోందని నిర్మాత బన్నీ వాసు ఆవేదన వ్యక్తం చేశారు. గేమ్‌ఛేంజర్ సినిమా కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేశారన్నారు. చాలా ప్రయత్నాలు చేసి ఆన్ లైన్ లింక్‌లు తొలగించినట్లుగా చెప్పారు. పైరసీపై పోరాటం చేసేందుకు ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన సెల్ ఏర్పాటు చేశామన్నారు. వాళ్లు పగలూ రాత్రి పైరసీపై నియంత్రణకు పని చేస్తుంటారన్నారు.

హీరో రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాను ఏపీలోని కొన్ని కేబుల్ టీవీ ఛానెల్స్‌లో పైరసీగా ప్రసారం చేశారు. సినిమా నిర్మాతలకు తీవ్ర నష్టం కలిగేలా లోకల్ టీవీ ఛానెల్స్‌లో హెచ్‌డీ ప్రింట్‌ను ప్రసారం చేశారు. ఈ సినిమా పైరసీ కాపీ ప్రసారం చేసిన కేబుల్ ఆపరేటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని నిర్మాతలు ఆవేదన చెందుతున్నారు.ఇటీవల కాలంలో సోషల్ మీడియా విచ్చలవిడితనంలో ఫ్యాన్స్ వార్ పేరిట ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఎవరో ఒక హీరో పేరు, ఫోటోతో సోషల్ మీడియా ఖాతా తెరిచి నిత్యం వివాదాస్పదత వ్యాఖ్యలు, వీడియోలు పోస్టు చేస్తున్నారు. దీంతో పాటు కొత్త సినిమాలు విడుదల సమయంలో సినిమాల్లోని కీలక అంశాల వీడియోలు సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఫ్యాన్స్ వార్ పేరిట పైరసీ కాపీలను ప్రోత్సహిస్తు?న్నారు. థియేటర్లలోనే నేరుగా సెల్ ఫోన్లలో వీడియోలు రికార్డు చేస్తూ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తున్నారు. ఫ్యాన్ వార్ లో హెచ్డీ ప్రింట్ లు సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి.పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లుతోందని 2023లో ఓ నివేదిక తెలిపింది. సినిమా నిర్మాణానికి పడిన కష్టం పైరసీ వల్ల వృథాగా పోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించారు. అలాగే ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం 1952లో సవరణలు చేసి, కొత్త బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ముంబయిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరిస్తారు.డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరసీ కంటెంట్‌పై నోడల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో ఆ కంటెంట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా సీబీఎఫ్సీ అధికారులు చర్యలు చేపడతారు. సినిమాలను అనధికారికంగా రికార్డ్ చేయడం, అనుమతి లేకుండా బహిరంగంగా ప్రదర్శించడం, ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం తీవ్రమైన నేరంగా సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం పరిగణిస్తారు.ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి మూడు నెలల నుంచి మూడేండ్ల పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు సినిమా నిర్మాణ వ్యయంలో 5 శాతాన్ని నిందితులు జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. సినిమాకు సంబంధించిన కొద్ది భాగాన్ని కూడా పైరసీ చేయడం శిక్షార్హమే.అయితే కేంద్ర ప్రభుత్వం పాటు రాష్ట్ర ప్రభుత్వాలు పైరసీపై కఠిన చర్యలు తీసుకోవాలని టాలీవుడ్ వర్గాలు కోరుతున్నాయి. పైరసీపై చట్టాలను మరింత కఠినం చేసి బాధ్యులకు త్వరగాశిక్షలుపడేలాచేస్తే...భవిష్యత్తులో ఇలాంట ఘటనలుతగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.

# ఏప్రిల్‌లో తెలంగాణ సీఎస్ శాంతికుమారి రిటైర్మెంట్..

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,**అతిపెద్ద పోస్ట్‌లో ఉన్న లేడీ ఆఫీసర్ తీరుతో అధికారులంతా విసిగిపోయారట. తమను పట్టించుకోకపోవడంతో ఇన్నాళ్లూ ఆవేదన పడ్డారట. సమస్యలపై స్పందించకపోయినా సర్దుకుపోయారట. ఉన్నతాధికారులు రిక్వెస్ట్ చేస్తే కూడా ఆ అధికారి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదట. ఇవన్నీ మనసులో పెట్టుకుని బాధ పడుతున్న అధికారులంతా..ఇప్పుడు ఒక్కసారిగా రిలాక్స్ అవుతున్నారట. కారణం త్వరలోనే ఆ పెద్ద ఆఫీసర్ రిటైర్ కాబోతున్నారట. ఇంతకీ ఎవరా ఆఫీసర్ అంటే సీఎస్ శాంతికుమారి అంటున్నారు.తెలంగాణ మొట్టమొదటి మహిళా సీఎస్‌గా 2023 జనవరిలో పదవీ బాధ్యతలు చేపట్టారు శాంతికుమారి. పాలనాపరంగా బయట పెద్దగా వివాదాలు, విమర్శలు లేకపోయినా..సహచర అధికారుల్లో మాత్రం శాంతికుమారి తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం తర్వాత ప్రభుత్వ పెద్దగా, మిగతా ఎయాల నుంచి మొదలు ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులందరికీ బాస్ స్థానంలో ఉన్న శాంతికుమారి అందుకు తగ్గట్టుగా వ్యవహరించడం లేదని చాలాకాలంగా విమర్శలు ఉన్నాయి. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఏ మాత్రం పట్టించుకునేవారు కాదని టాక్సెక్రటేరియట్‌లో వివిధ శాఖలకు అధిపతులుగా పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులతోనూ సీఎస్ శాంతికుమారి సఖ్యతగా ఉండేవారు కాదని తెలుస్తోంది. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కూడా సమయం ఇచ్చేవారు కాదని అధికారులు వాపోతున్నారట.కలెక్టర్లు తమ జిల్లాలకు సంబంధించిన అంశాలపై అపాయింట్‌మెంట్ అడిగినా శాంతి కుమారి స్పందించేవారు కాదని అంటున్నారు. ఇక ఐఏఎస్ అధికారులందరికి పెద్దగా ఉన్న శాంతికుమారి వారి సమస్యలు, ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకునేవారు కాదని, దీంతో అధికారులంతా అమె తీరుపై విసిగిపోయారన్న చర్చ జరుగుతోంది.ఇక అధికారులతోనే కాదు మంత్రులతోనూ సీఎం శాంతికుమారి ఇలానే వ్యవహరించేవారన్న టాక్ వినిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని మినహా మంత్రులను కూడా పెద్దగా పట్టించుకోరట. మంత్రులు, ఐఏఎస్ అధికారుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వివిధ సమస్యలపై సెక్రటేరియట్‌కు వచ్చే విజిటర్స్‌ను సీఎస్ శాంతి కుమారి అస్సలు కలిసేవారు కాదట. గతేడాది నవంబర్‌లో సడెన్‌గా పది రోజుల పాటు అమెరికా పర్యటనకు వెళ్లారు శాంతి కుమారి.అయినా ఎవ్వరికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో అప్పుడు ఆమె స్థాయిలో క్లియర్ చేయాల్సిన ఫైళ్లన్ని పెండింగ్‌లో పడిపోయి పాలనపై ప్రభావం పడిందట. ఇలా ప్రభుత్వ అధికారుల్లో ఆమె తీరుపై చాలా అసంతృప్తి వ్యక్తం అవుతుందట. కానీ కక్కలేక మింగలేక అన్నట్లు ఉన్నతాధికారి కాబట్టి లోలోన బాధపడుతూ వస్తున్నారట. అయితే త్వరలోనే ఆమె రిటైర్ కాబోతుండటంతో ఐఏఎస్ అధికారులంతా బిగ్ రిలీఫ్‌గా ఫీల్ అవుతున్నారట. కొత్తగా వచ్చే సీఎస్ అయినా తమకు తగిన ప్రాధాన్యత ఇచ్చి, సమస్యలను పట్టించుకోవాలని కోరుకుంటున్నారట సెక్రటేరియట్ ఉద్యోగులు

# గ్రేటర్ లో బీజేపీ, బీఆర్ఎస్ ములాఖత్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పాలకమండలి పదవికాలం నాలుగేళ్లు పూర్తయింది.

దీంతో మేయర్, డిప్యూటీ మేయర్ మీద అవిశ్వాస తీర్మానం తెరమీదకు వచ్చింది. దీంతో జీహెచ్ఎంసీ రాజకీయాలు వేడెక్కాయి. ఒకవైపు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు, మరోవైపు అవిశ్వాస తీర్మానం వ్యవహారంతో రాజకీయపార్టీల వ్యవహారం కొత్త చర్చకు దారితీసింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయ సాధించి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆ రెండు పార్టీలు తమ కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేస్తు?న్నాయి.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఇటీవల కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవిశ్వాసంపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించారు. మరోవైపు బుధవారం నగర కార్పొరేట్లతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సమావేశం కానున్నారు. స్టాడింగ్ కమిటీలో పోటీ, మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం పై బీఆర్ఎస్ కార్పొరేటర్లతో తలసాని చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతామని తలసాని గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక బీజేపీ కార్పొరేటర్లతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే అంశంతో పాటు అవిశ్వాసంపై చర్చించారు.

అయితే బీఆర్ఎస్ అవిశ్వాసం పెడితే తాము తీర్మానం పెట్టి తీరుతామని బీజేపీ కార్పొరేటర్లు అంటున్నారు. దీంతో ఈ రెండు పార్టీలు అవిశ్వాసం విషయంలో చేతులు కలిపే అవకాశం లేకపోలేదన్న చర్చ సాగుతోంది. మరోవైపు అవిశ్వాసాన్ని ఎదుర్కొడానికి కాంగ్రెస్ సిద్ధమవుతోంది. గురువారం రోజు నగర్ ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు సమావేశమై అవిశ్వాసాన్ని ఎదుర్కోనే అంశాన్ని చర్చించనున్నారు.ఇదిలా ఉంటే, స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నలుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేశారు.

బీఆర్ఎస్ నుంచి కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ నుంచి హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్, రామచంద్రాపురం కాంగ్రెస్ కార్పొరేటర్ పుష్ప నామినేషన్లు దాఖలు చేశారు.జీహెచ్ఎంసీ రిటర్నింగ్ అధికారికి కార్పొరేటర్లు తమ నామినేషన్ పత్రాలను అందించారు. ఈ నెల 17 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. నాలుగేళ్లుగా తమకు స్టాండింగ్ కమిటీలో చోటు లేదని.. ఈసారి తప్పకుండా గెలుస్తామని కాంగ్రెస్ కార్పొరేటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్లు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. అయితే, పార్టీలకు అతీతంగా బీజేపీ కార్పొరేటర్లు కూడా మాకు ఓటేస్తారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు దీమా వ్యక్తం చేస్తున్నారు.

# కోతులే అజెండాగా ఎలక్షన్స్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,** తెలంగాణలో మరికొద్ది నెలల్లో పంచాయతీ ఎన్నికల ఢంకా మోగనుంది. దీంతో ఆశావహులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేవారు కోతుల సమస్యే ప్రధానంగా ప్రచారంలో దిగనున్నారు. కోతుల బెడదను తీర్చేవారినే సర్పంచ్‌గా కానీ ఎంపీటీసీగా కానీ గెలిపిస్తామంటూ ఓటర్లు కూడా తెగేసి చెబుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు కూడా ఇప్పటి నుంచే కోతులను పట్టించే పనిలో బిజీ అయ్యారు. కొన్ని గ్రామాల్లో అయితే ముందుగానే తీర్మానాలూ చేసుకున్నారు.2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కోతుల బెడద తీర్చినందుకు హనుమకొండ జిల్లాలో ఒకరిని సర్పంచ్‌గా గెలిపించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ దూడల సంపత్ రోజుకో వేషం వేసుకుని కోతులను గ్రామం నుంచి తరిమేశాడు. అందరి సహకారంతో రూ.లక్ష వరకు విరాళాలు సేకరించి ఆంధ్రప్రదేశ్ నుంచి మంకీ క్యాచర్‌లను పిలిపించి కోతులను అటవీ ప్రాంతంలో వదిలేలా చేశాడు. దాంతో 2019 ఎన్నికల్లో ఆయన భార్య ప్రమీలను గ్రామస్తులు సర్పంచ్‌గా గెలిపించారు.గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా రాష్ట్రంలో ఏ మూలన చూసినా కోతుల బెడద ఎక్కువైంది. రాష్ట్రంలో ఏకంగా 35 లక్షలకు పైగా కోతులు ఉన్నాయంట. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడటంతో పాటు గుంపుగా దాడి చేయడంతో ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. రాష్ట్రంలో సంవత్సరానికి వెయ్యి మందికి పైగా గాయపడుతుండగా, పదుల సంఖ్యలో చనిపోతున్నారని అధికారులు చెబుతున్నారు. పంట పొలాల్లో ఇష్టారీతిన నాశనం చేసి రైతులకు నష్టాన్ని కూడా కలిగిస్తున్నాయి.రోజురోజుకూ పెరుగుతున్న కోతుల సంఖ్యని తగ్గించేందుకు అధికారులు కొత్త మార్గాలను వెతుకుతున్నారు. కోతుల ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ కోసం 2020 డిసెంబర్‌లో నిర్మల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ఫార్మాసిస్టు, నలుగురు సిబ్బందిని ఈ సెంటర్‌లో నియమించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు కోతులను పట్టుకొని నిర్మల్‌కి తీసుకొస్తే అక్కడ వాటికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేస్తారు.కోతులను పట్టుకోవడానికి మంకీ క్యాచర్లు ఒక్కో కోతికి వెయ్యి రూపాయల వరకూ డిమాండ్ చేస్తున్నారు. అంటే సుమారు వంద కోతులకు రూ.లక్ష చెల్లించాలనమాట. అసలే నిధుల కొరత ఉండటంతో చేసేదేమీలేక అధికారులు చేతులెత్తేశారు. దాంతో ఓటర్లు కూడా తమ సమస్య పరిష్కారానికి పంచాయతీ ఎన్నికలే సరైన సమయమని డిసైడ్ అయ్యారు. కోతుల సమస్య తీర్చిన వాళ్లకే తమ ఓట్లు వేస్తామంటూ కండీషన్ పెట్టడంతో అభ్యర్థులు కూడా ఆ పనిలో పడ్డారు.

# సమ్మర్ లోనే లోకల్ ఎలక్షన్స్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,** తెలంగాణలో స్థానిక సంస్థల కాలపరిమితి ముగిసి ఏడాది కావస్తోంది.అయినా ఎన్నికల నిర్వహణపై క్లారిటీ రాలేదు. అప్పుడు ఇప్పుడు అంటూ చెప్పడం తప్ప ఒక తేదిని మాత్రం ప్రకటించలేదు. అయితే ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదే సమయంలో అవసరమైన అధికారులకు శిక్షణ కూడా ఇస్తోంది. అయితే ప్రస్తుతం పదవతరగతి పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహించడం సరికాదని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అంటోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్‌కు ప్రధానమైన పదవ తరగతి, ఇంటర్ పరీక్షల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు విద్యాభ్యాసంపై ప్రభావం పడుతుందని, దీంతో వారు ఏకాగ్రత కోల్పోయి తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉన్నదని సంఘం నాయకులు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ముగిశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే గత ఐదేండ్లలో గ్రామపంచాయతీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి, వాటి తాలూకు బిల్లులు అందక సర్పంచ్‌లు ఆర్థికంగా కుదేలైపోయారని అన్నారు. వెంటనే సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి, ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరుతూ వినతి పత్రం అందించారుఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకుండా వారిపై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సర్పంచులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ ఎన్నికలయ్యాక మాట మార్చడం సరికాదన్నారు. ఖచ్చితంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, ఎస్సీ వర్గీకరణలో తగు న్యాయం చేసి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రయత్నాలు చేస్తున్న పార్టీలు

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైందా? రేవంత్ సర్కార్ నిర్ణయంతో విపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయా? సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటనతో ఎలా చెయ్యాలనే ఆలోచనలో మిగతా పార్టీలు పడ్డాయా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా అన్న ప్రశ్న బీఆర్ఎస్, బీజేపీలను వెంటాడుతోందా? తాము సిద్ధమేనని బీఆర్ఎస్ పైకి చెబుతోందా? దీనిపై ఇంకా నిర్ణయం వెల్లడించకుండా బీజేపీ ఎందుకు తాత్సారం చేస్తోంది?రేపో మాపో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకానుంది. దీనికి సంబంధించి ఒకొక్కటి క్లియర్ చేస్తూ వస్తోంది రేవంత్ సర్కార్. ఇందులో భాగంగా బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బీసీ డెడకేటెడ్ కమిషన్ రిపోర్టుపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయితీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించనున్నారు. దీని తర్వాత సర్పంచ్, ఎంపీటీపీ, జెడ్పీటీసీలు ఎన్ని విడతలుగా ఎన్నికలు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం ఓ అంచనాకు రానుంది.ఇక రాజకీయాల విషయానికొద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కులగణన సర్వే అసెంబ్లీ చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. చట్టపరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాకుంటే పార్టీ పరంగా ఎన్నికల్లో 42 శాతం అమలు చేస్తామని కుండబద్దలు కొట్టేశారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 22 నుంచి 23 శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా వస్తాయి. మిగతా 20శాతం సీట్లను పార్టీ పరంగా కేటాయించాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి ఉన్నట్లు అధికార పార్టీల్లో చర్చ జరుగుతోంది.అధికార పార్టీ ఈ విధంగా చేస్తే.. మిగతా పార్టీలు కాంగ్రెస్ దారిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ సిపార్సుల ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లకు 22 శాతం రిజర్వేషన్లు అధికారంగా అమలు చేస్తూనే మిగతా 20శాతం బీసీలకు టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్ ఎంపికలో దామాషా పాటించాలని నిర్ణయానికి వచ్చినట్టు పార్టీ వర్గాల మాట.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం కేటాయిస్తే.. మిగతా పార్టీలపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీనిపై ఇటు బీఆర్ఎస్, బీజేపీలో తేల్చుకోలేక పోతున్నాయి. ఇటీవల ఆయా పార్టీ సమావేశాల్లో దీనిపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. బీజేపీతోపాటు బీఆర్ఎస్ కూడా దీనిపై మల్లగుల్లాలు పడుతోంది. దీనిపై గతంలో కేటీఆర్ ఓ మాట ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా తాము కూడా 42 శాతం కేటాయిస్తామని చెప్పేశారు. కానీ.. పార్టీలో పరిస్థితులు ఆ స్థాయిలో లేవని అంటున్నారు. అధికారం పోయిన తర్వాత కేడర్ చెల్లాచెదురైంది. కేడర్ బలహీనం కావడంతో క్షేత్రస్థాయిలోకి వెళ్ల లేని పరిస్థితి కారు పార్టీ నేతలది.ఇక బీజేపీ విషయానికొద్దాం.బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సైలెంట్ అయిపోయింది. సిటీ, పట్టణాల్లో ఆ పార్టీ కొంత కేడర్ ఉంది. రూరల్లో మరింత వీక్‌గా కనిపిస్తోంది. ఇటీవల భర్తీ చేసిన పార్టీ మండల అధ్యక్ష పదవులు బీసీలకు 50 శాతం కేటాయించామని బయటకు చెబుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో ఆ పార్టీ పడినట్టు తెలుస్తోంది. తెలంగాణలో 42 శాతం అమలు చేస్తే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇదే నినాదం రావచ్చని అంటున్నారు. మరి బీసీలకు 42 శాతం అంశం బీజేపీ ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి.

# హైకమాండ్‌కు రేవంత్‌కు మధ్య దూరం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: ఫిబ్రవరి 12,** రాహుల్ గాంధీని కలిసేందుకు రేవంత్ చేసే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. తమ మధ్య గ్యాప్ లేదని రేవంత్ అంటున్నారు. కానీ మంత్రివర్గ విస్తరణకూ అనుమతి రాకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయిమంగళవారం కాంగ్రెస్ ముఖ్య నేత, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వరంగల్ టూర్ పెట్టుకున్నారు. అక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆయన రైల్లో చెన్నై వెళ్లాల్సి ఉంది. అయితే ఈ పర్యటనకు రాహుల్ బయలుదేరక ముందే క్యాన్సిల్ అయింది. అసలు ఖరారు అయినట్లుగా ఎవరికీ సమాచారం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తెలియదు. అందరికీ క్యాన్సిల్ అయిన సమాచారమే తెలిసింది. రాహుల్ వస్తూంటే.. తమ పార్టీ ప్రభుత్వం ఉన్న రాష్ట్ర సీఎంకు సమాచారం ఇవ్వరా ? అన్న చర్చ జరుగుతోంది. రాహుల్ కు.. రేవంత్ కు మధ్య గ్యాప్ ఉందని జరుగుతున్న ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. రాహుల్ గాంధీతో నాకు గ్యాప్ లేదు .. నేనే ఆయన అపాయింట్ మెంట్ అడగలేదు అని ఇటీవల ఢిల్లీలో రేవంత్ రెడ్డి మీడియాకు చెప్పుకున్నారు. ఇలా చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటేనే సమస్య ప్రారంభమయిందని రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ స్పష్టత వస్తుంది. చాలా కాలంగా రాహుల్ గాంధీ .. రేవంత్ రెడ్డిని కలవడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లో మాత్రమే అధికారంలో ఉంది. ఏ పార్టీకి అయినా ముఖ్యమంత్రులు కీలకం. అందుకే కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు..త కార్యక్రమాలకు రేవంత్ రెడ్డిని పిలుస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లుగా జాబితాలో చేరుస్తున్నారు. కానీ రాహుల్ గాంధీ ఆయనకు ప్రత్యేకంగా సమయం ఇవ్వడం లేదు. తెలంగాణ మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. తాను సమర్పించిన జాబితా విషయంలో అభ్యంతరాలు ఉన్నందునే పర్మిషన్ ఇవ్వడం లేదనుకున్న రేవంత్ రెడ్డి తన జాబితా ఏమీ లేదని అంతా హైకమాండ్ కష్టమేనని వారు ఎవరితో ప్రమాణం చేయించమంటే వారితో చేయిస్తానని ఢిల్లీల ప్రకటించారు. అదే సమయంలో రేవంత్ రెడ్డికి పార్టీపై పట్టు తగ్గించేందుకు హైకమాండ్ ప్లాన్ చేస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించబోతున్నట్లుగా హైకమాండ్ లీకులు ఇచ్చింది. ఎప్పుడూ లేని విధంగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలని నిర్ణయించారు. ఎస్సీ,ఎస్టీ, రెడ్డి, ముస్లిం సామాజికవర్గాల నేతలకు అవకాశం ఇవ్వనున్నారు. అలాగే పార్టీలోని ఇతర పదవుల భర్తీపైనా ప్రకటన చేయనున్నారు. కానీ మంత్రి వర్గ విస్తరణకు మాత్రం హైమాండ్ ఇంకా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. ఢిల్లీ వెళ్తున్నారు..కాంగ్రెస్ పెద్దల్ని కలుస్తురు కానీ రాహుల్ ను మాత్రం రేవంత్ కలవలేకపోతున్నారు. దీంతో ఆయనకు రాహుల్ కు మధ్య గ్యాప్ ఉందన్న ప్రచారం జరుగుతోంది. దాన్ని పూడ్చడానికి అయినా ఓ సారి రాహుల్ తో భేటీ కావాలని రేవంత్ అనుకుంటున్నారు. కానీ అవకాశం మాత్రం రావడం లేదు. మంత్రివర్గాన్ని విస్తరించకపోవడం వల్ల పాలనపై ప్రభావం పడుతోందన్న అసంతృప్తి వ్యక్తమవుతున్నా.. హైకమాండ్ ఇదే పద్దతిలో ఉంది. రేవంత్ రెడ్డికి ఇచ్చే ప్రాధాన్యతను తగ్గించే క్రమంలోనే ఇదంతా చేస్తున్నారని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఈ ప్రచారాన్ని తగ్గించుకోవడానికి రేవంత్ అర్జంట్ గా రాహుల్ తో సమావేశం కావాల్సి ఉంది. మరి సాధ్యమవుతుందా ?

## అనూషకు డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం




విశాఖపట్నం విశాఖ తహసీల్దార్ గా పని చేస్తూ గత ఏడాది హత్యకు గురైన రమణయ్య భార్య అనూషకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుంది. అనూషకు డిప్యూటీ తహసీల్దార్ గా నియమించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అనూష ప్రభుత్వానికి, మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపింది.

## కేరళ పర్యటనలో పవన్ కళ్యాణ్



విజయవాడరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు పుణ్య క్షేత్రాలు దర్శించుకునే యాత్రకి బుధవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేరళలోని కొచ్చి విమానాశ్రయానికి ఉదయం చేరుకున్నారు. మొదటిరోజు కొచ్చి సమీపంలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకున్నారు.

## అగస్త్య మహర్షిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్



కొచ్చిన్ కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్షేత్ర సందర్శనలోఅయన వెంట కుమారుడు అకీరా, టిటిడి సభ్యుడు ఆనందసాయి పాల్గొన్నారు

### తిరుపతిలో సాధువుల ఆమరణ దీక్ష

తిరుపతిలో సాధువులు అమరణ దీక్షకు దిగారు. టీటీడీ పరిపాలన భవనం ముందు దీక్ష చేపట్టారు. అలిపిరి శ్రీవారి పాదాల వద్ద ముంతాజ్ పేరుతో హోటల్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని శ్రీనివాసానంద స్వామి పోరాటం చేస్తున్నారు. తిరుమల ప్రక్షాళన అన్న చంద్రబాబు, సనాతన ధర్మం అన్న పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.

### ప్రభుత్వాన్ని హెచ్చరించిన చికోటి ప్రవీణ్

హైదరాబాద్ తప్పచబుత్ర జిర్ర హనుమాన్ ఆలయంలో శివ లింగం వెనుక మాంసం పడేసిన ఘటనపై బీజేపి నేత చికోటి ప్రవీణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో హిందూ దేవాలయాలకు ఆలయం అర్చకులకు హిందువులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు అమర్చి వాటిని కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేయాలి.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర నగర్ లో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భవన కార్మికుడు గోపి (45) గా పోలీసులు గుర్తించారు. గోపి నివాసం ఉంటున్న ఇంటి తలుపులు మూడు రోజులుగా తీయకపోగా, గది నుండి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య చందన గోపి తో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. గోపి మద్యానికి బానిసై వంటరి జీవితాన్ని భరించలేకే ఆత్మహత్య కు పాల్పడ్డాడు. తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు
## మంత్రి ఆనం ను ఆహ్వానించిన ఆర్చకులు, అధికారులు



అమరావతి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం యొక్క మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఆలయ కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యేలా అధికారిక ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను మంత్రి కి వివరించి, స్వామి వారి తీర్ధ ప్రసాదాలు చిత్రపటాని అందించి వేద పండితుల ద్వారా వేదాశీర్వాదాన్ని మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## సితార సెంటర్లోని కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్లో అగ్ని ప్రమాదం



విజయవాడసితార సెంటర్లోని కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్లో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు భారీ ఎత్తున ఎగిసిపడ్డాయి. లోపల గ్యాస్ సిలిండర్ బండ పేలినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న భవానీపురం పోలీసులు హుటాహుటిన ఎగ్జిబిషన్ ప్రాంతానికి చేరుకొని ఫైర్ సిబ్బందితో కలసి మంటలను అదుపుచేసేందు ప్రయత్నం చేసారు. మూడు ఫైర్ ఇంజిన్లుతో మంటలను అదుపు చేస్తున్నారు.

## మేడ్చల్ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థినీ ఆత్మహత్యాయత్నం



**ప్రజాబలం ప్రతినిధి:**మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో దారుణం చోటుచేసుకుంది. ఫీజు కట్టలేదని పదవ తరగతి విద్యార్థిని అఖిల(16) ను ప్రిన్సిపాల్ ఫీజు కట్టలేదని అందరి ముందు తిట్టడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్యయత్నం చేయడం జరిగింది. చికిత్స నిమిత్తం యశోద హాస్పిటల్ కు తరలించారు. విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. విద్యార్థిని కుటుంబ సభ్యులు బంధువులు మేడ్చల్ శ్రీ చైతన్య పాఠశాల ముందు ఆందోళన

## ఇనుముల శంకరయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన నాయకులు



మంథని మాజీ ఉపసర్పంచ్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ తండ్రి అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగి ఇనుముల శంకరయ్య బుధవారం అకాల మృతి చెందారు. శంకరయ్య మృతి పట్ల పలువురు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంథని పట్టణంలోని భగత్ నగర్ లో గల వారి నివాసానికి పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు వెళ్లి అయిన భౌతిక కాయానికి నివాళులర్పించారు. మంథని తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా, మంథని మాజీ సర్పంచ్ ఓడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, మంథని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు అజీమ్ ఖాన్, ఆకుల కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంద్రు సురేష్ రెడ్డి,వికే రవి, నక్క నాగేంద్ర, కొట్టే రమేష్, జిల్లా ఆర్టిఏ మెంబర్ మంతెన సురేష్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ, విద్యార్థి నాయకులు బెజ్జంకి డిగంబర్, సిఐటియు నాయకుడు బూడిద గణేష్ లు ఇనుముల సతీష్ ఇంటికి వెళ్లి వారి తండ్రి శంకరయ్య మృతదేహానికి నివాళులర్పించి ఇనుముల సతీష్ ను ఓదార్చారు. 35 సంవత్సరాల పాటు అటవీ శాఖ లో ఉద్యోగిగా పని చేసి పదవి విరమణ పొందిన తర్వాత అందరికీ తలలో నాలికలాగా మెదిగిన శంకరయ్య అకాల మృతి అందరికి తీరనిలోటు అన్నారు.

# తారకరామ కళ్యాణమండప పునఃనిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలి

## జీవీఎంసీ అధికారులను ఉద్దేశించి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆగ్రహం




గాజువాక : దివంగత ఎం.వి.వి.ఎస్.మూర్తి సుమారు మూడు దశాబ్దాల క్రితం అందుబాటులోకి తీసుకువచ్చిన తారకరామ కళ్యాణమండప పునఃనిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేస్తున్నారు. తెలుగు జాతి కీర్తి పతాకం నందమూరి తారక రామారావు మీద అభిమానంతో పేరుతో ఎం.వి.వి.ఎస్.మూర్తి అప్పట్లో , ఈ కళ్యాణ మండపం నిర్మించారన్నారు. ఇదే విషయమై ఆయన బుధవారం ఉదయం మీడియాతో మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతం తుంగ్లాంలో 1995వ సంవత్సరంలో అప్పటి విశాఖ ఎం.పీ ఎం.వి.వి.ఎస్.మూర్తి మూర్తి ఎంపీ నిధులతో తారకరామా కళ్యాణ మండపాన్ని స్థానిక ప్రజల అవసరాల కోసం నిర్మించారని తెలియజేశారు. అయితే కాలక్రమంలో మండపం మరమ్మతులకు గురి కావడంతో జీవీఎంసీ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి 12వ తేదీన టెండర్లను కూడా పిలిచి.. జీవీఎంసీ గుర్తింపు పొందిన ఎస్.ఎన్.ఎంటర్ప్రైజెస్ కు నిర్మాణ పనులను అప్పగించిందన్నారు. ఈ క్రమంలోనే నేల సామర్థ్యాన్ని తెలియజేసే సాయిల్ టెస్ట్ పరీక్షలు కూడా విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ప్రారంభించి పునాదులు తవ్విన దశలో కళ్యాణ మండపం నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడిందన్నారు. కళ్యాణ మండపం నిర్మించే ప్రాంతంలో చెరువు ఉందని కారణం చెబుతూ జీవీఎంసీ అధికారులే నిర్మాణాన్ని నిలిపివేయించారన్నారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ (సి.ఈ) గా బాధ్యతలు స్వీకరించిన పి.శివ ప్రసాద్ రాజు వచ్చిన తర్వాతే నిర్మాణ పనులను నిలిచిపోయాయని రామ్ ఆరోపించారు. ఈ క్రమంలోనే స్థానికులు ఆందోళన చెందుతున్నారని రామ్ పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు కూడా గతంలో కళ్యాణమండపం నిర్మాణ పనులలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్నారని, ఈ సందర్భంగా రామ్ తెలిపారు. భవన నిర్మాణానికి అన్ని రకాల అనుమతులను ఇచ్చిన జీవీఎంసీ ఇప్పుడు పనులకు అడ్డు చెప్పడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు అన్నింటిలోకి గాజువాక నియోజకవర్గం లోనే ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. గాజువాక ఎమ్మెల్యే మాత్రమే కాకుండా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం గాజువాక లోనే ఉన్న తుంగ్లం గ్రామంలో అభివృద్ధి పనులకు.. అధికారులు అడ్డు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. పరిస్థితి ఇక్కడే ఇలా ఉంటే రాష్ట్రంలో మిగిలిన ప్రాంతంలో అభివృద్ధి పనులు ఏ విధంగా కొనసాగుతాయని రామ్ సందేహం వ్యక్తం చేశారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు కళ్యాణ మండపం పనులు ప్రారంభమయ్యే విధంగా అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళతామన్నారు.

మరోవైపు విశాఖ ప్రస్తుత ఎంపీగా వ్యవహరిస్తున్న భరత్.. తన తాత ఎంవీవీఎస్ మూర్తి ఎన్టీఆర్ మీద అభిమానంతో నిర్మించిన కళ్యాణ మండపం తిరిగి ప్రజలకు అందుబాటులోకి రావడంలో కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాకి శ్రీదేవి, ఎక్స్ కౌన్సిలర్, కొల్లి అప్పల రెడ్డి, అధ్యక్షులు గ్రామ అభివృద్ధి సంఘం , కోన తాతారావు, సలాది అచ్చిబాబు, నావన సింహాచలం, పెట్లి అర్జున్, బలంకి అప్పారావు, డాక్టర్ శ్రీనివాస్, మజ్జి రాజు, ఎం.ఎల్.పి.రాజు, అధిక సంఖ్యలో మహిళలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీటలు వారుతున్న పులివెందుల మున్సిపల్ కౌన్సిల్

**మొదలైన టిడిపి ఆపరేషన్ పులివెందుల మున్సిపాలిటీ**

**టిడిపి నాయకుల టచ్ లో 17 మంది కౌన్సిలర్లు**

**నిన్న షాహిదా నేడు రంగనాయకులు మరి రేపు ?**




బద్వేలువైయస్ కుటుంబానికి పులివెందుల కంచుకోట అని చెప్పడంలో అతిశయోక్తి లేదు ఎందుకంటే దశాబ్దాల కాలం నుంచి వైఎస్ కుటుంబానికి పులివెందుల ప్రజలు అంతగా ఆదరిస్తున్నారు. ఓటమి ఎరుగని కుటుంబంగా పులివెందుల ఎమ్మెల్యే సీటుతో పాటు ,మున్సిపాలిటీని వైఎస్ కుటుంబం కైవసం చేసుకుంటూ వస్తుంది . అయితే ఆ కోటకు నేడు బీటలు వారుతున్నాయి అనడంలో కూడా అతిశక్తి లేదని పలువురు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీని కైవసం చేసుకోవడమే ధ్యేయంగా పులివెందుల టిడిపి నాయకులు పావులు కదుపుతున్నారు .చాప కింద నీరుల ఒక్కొక్కరిని టిడిపిలో చేర్చుకుంటూ కౌన్సిలర్లను తమ దారిలోకి తెచ్చుకుంటున్నారు. ఇదే కోవలో మరో 15 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరుతున్నారన్న వార్తలు పట్టణంలో దావనంలా వ్యాపించాయి. ఇప్పటికే పులివెందుల టిడిపి నాయకులకు కౌన్సిలర్లు టచ్ లో ఉన్నారని ఒకరిని మించి మరొకరు టిడిపిలో చేరేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నట్టు కూడా సమాచారం అయితే కౌన్సిలర్లను కాపాడుకోవడం కోసం వైఎస్ఆర్సిపి నాయకులు కూడా తీవ్ర ప్రయత్నాలను చేస్తున్నట్లు సమాచారం. కౌన్సిలర్లు తమ చేతి నుంచి జారిపోకుండా మున్సిపాలిటీ కూడా జారిపోతే వైయస్ కుటుంబ ప్రాబల్యం తగ్గుతుందన్న అనుమానంతో మున్సిపాలిటీని టిడిపి చేతికి వెళ్లకుండా చేయడమే ధ్యేయంగా వైసిపి నాయకులు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం . అయితే పులివెందుల మున్సిపాలిటీని తప్పకుండా టిడిపి కైవసం చేసుకుంటుందని అందుకు తగ్గట్లుగా పులివెందులలోని టిడిపి నాయకులు పావులు కదుపుతూ ఉన్నట్లు సమాచారం వైసిపి చేతిలో నుంచి జారిపోవడం ఖాయమని కొంతమంది పేర్కొంటున్నారు . వైసీపీలోని కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్లడానికి ప్రధాన కారణాలు కూడా ఆయా అవార్డుల్లో వారికి ప్రాబల్యం లేకపోవడమేనని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు కౌన్సిలర్లకు ఆయా అవార్డులలో కొంతమంది వైసీపీ నాయకులు ఎటువంటి ప్రాముఖ్యతను ఇవ్వకపోగా వారిని చాలా చులకనగా చూస్తున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి . కొంతమంది కౌన్సిలర్లకు ఎటువంటి వర్కులు కూడా ఇవ్వకుండా కేవలం ఆయా వార్డులలోని వైసీపీ ముఖ్య నాయకులు మాత్రమే తీసుకొని డబ్బులు సంపాదించుకుంటున్నారని కౌన్సిలర్లకు ఎటువంటి ఆదాయం మార్గాలు లేవని మరికొంతమంది కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పులివెందుల మున్సిపాలిటీని టిడిపి కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో కౌన్సిలర్లను ఒక్కొక్కరిని తమ వైపు తిప్పుకుంటుందని ప్రజలు పేర్కొంటున్నారు .

బుజ్జగింపు చర్యల్లో వైసిపి నాయకులు

తమ చేతి నుంచి పులివెందుల మున్సిపాలిటీ జారిపోకుండా ఉండేందుకు కూడా పులివెందుల వైకాపా నాయకులు వారి వద్ద ఉన్నటువంటి కౌన్సిలర్లను బుజ్జగింపు ప్రయత్నాలను చేస్తున్నట్లు సమాచారం. టిడిపి నాయకులు ఇచ్చేటువంటి హామిలు తాము ఇస్తామని తమ వద్ద నుంచి వెళ్ళిపోకుండా ఉండాలని కౌన్సిలర్లకు సూచనలు సలహాలు ఇస్తున్నట్లు సమాచారం. ఇంకొంతమంది మునిసిపాలిటీ వైసీపీ నాయకులకు కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్లకుండా ఉంటే వచ్చే మున్సిపల్ ఎలక్షన్లలో కూడా తమకే సీటును కేటాయిస్తామని హామీ కూడా కౌన్సిలర్లకు ఇస్తున్నట్లు సమాచారం.

# జెపి దర్గాను సందర్శించిన “హీరో విశ్వక్ సేన్”

**దర్గాను చిన్నప్పటినుండి దర్శించుకుంటున్నా..**

**“లైలా” సినిమా ప్రమోషన్ లో భాగంగా బాబాకు ప్రత్యేక ప్రార్థనలు**

**కుటుంబ సభ్యులతో కలిసి బాబాను దర్శించిన హీరో విశ్వక్ సేన్**

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**జిల్లా కొత్తూరు మండలం లో ఉన్న జేపీ దర్గాను సందర్శించారు ప్రముఖ సినీ హీరో విశ్వక్ సేన్. త్వరలో విడుదల కానున్న తన సినిమా లైలా విజయవంతం కావాలని కుటుంబ సభ్యులతో కలిసి దర్గాని దర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ తను చిన్నతనం నుండి ఈ దర్గాకు వస్తుండేవాడినని ఈ మధ్య కాలంలో కొద్దిగా బిజీగా ఉంది రాలేకపోయానని, తన చిత్రం లైలా విడుదల సందర్భంగా రావడం జరిగింది అని అన్నారు. తెలుగు సినిమా పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సాహు గారపాటి నిర్మించిన చిత్రం లైలా అని ఆయన వివరించారు. ఫన్, యాక్షన్, రొమాన్స్, ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్, ఆకాంక్ష శర్మ, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ప్రమోషన్స్‌కు మంచి స్పందన లభిస్తున్నదనీ లైలా చిత్రం ఫిబ్రవరి 14 తేదీన గ్రాండ్‌గా రిలీజ్ కాబోతున్నదని తెలిపారు. అదేవిధంగా స్థానిక మీడియా అడిగిన ప్రశ్నకు సినిమా ప్రీ రిలీజ్ సందర్భంగా నటుడు పృధ్విరాజ్ చేసిన కామెంట్స్ పై సోషల్ మీడియాలో సినిమా బాయికాట్ చెయ్యాలని సోషల్ మీడియాలో ట్రెండ్ మొదలైందన్న వాటికి సమాధానం చెప్పడానికి నిరాకరించారు హీరో విశ్వక్ సేన్.ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక చాదర్ పూలను సమర్పించగా స్థానిక భక్తులు హీరో విశ్వక్ సేన్ ను ఘనంగా స్వాగతం పలికారు.

# త్వరలో మాజీమంత్రి హరీష్ రావు పాదయాత్ర



**సిద్దిపేట ప్రజాబలం ప్రతినిధి:**బీఆర్ఎస్ కీలక నేత మాజీమంత్రి హరీష్ రావు త్వరలో పాదయాత్ర చేయనున్నారు. సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సంగమేశ్వర ఆలయం వద్ద హరీష్ పాదయాత్ర ప్రారంభించనున్నారు.ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజులపాటు 130 కి. మీ పాదయాత్రకు సిద్ధమయ్యారు. ఆయా గ్రామాల్లో రోజుకో సభ నిర్వహిస్తారు కాగా చివరి రోజు సభకు కేసీఆర్ హాజరుకానున్నారు.

# జబల్ పూర్ రోడ్డు ప్రమాదం మృతదేహాలను బంధువులకు అప్పగింత

**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ధ్యప్రదేశ్ జబల్పుర్లోని సిహోరా లో జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఏడు మంది మృతదేహాలను గాంధీ ఆస్పత్రిలో పోలీసులు,డి ఎం హెచ్ ఓ ,రెవెన్యూ అధికారులువారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉప్పల్ తహసిల్దార్ వాణి,సైఫాబాద్ జయ శ్రీ,మలక్ పేట్ డిప్యూటీ డి.ఎం.హెచ్. ఓ బిర్జిస్ మున్నిసా ల సమక్షంలో మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధిత కుటుంబ సభ్యులు బంధువులు కోరారు. ఒక్కో కుటుంబానికి 50 లక్షలు చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని

# కూకట్ పల్లి లో 1.150కేజీల గంజాయి పట్టివేత



**కూకట్ పల్లి ప్రజాబలం ప్రతినిధి:**కుకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కైతలాపూర్ లో గంజాయి అమ్ముతున్నారు అని విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్, బబితఃఊతి,నాగరాజు బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా గంజాయి విక్రయిస్తున్న ామీర్ (23) కొల్లేటి సాయి కుమార్ (19) లను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.150 కేజీల గంజయిని,2 మొబైల్ ఫోన్లను, ఒక బైకును స్వాధీనం చేసుకుని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

# సొంత భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ – ఏవో కల్లూరి చంద్ర మోహన్ రెడ్డి




బద్వేలు మండలం లోని కొంగలవీడు రైతు సేవా కేంద్రంలో , సొంత పొలం కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కొరకు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని తెలియచేయడం జరిగినది .రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే అన్ని పథకాలను పొందాలి అంటే రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ కేవైసి చేసుకొని లబ్ది పొందాలి అన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం లబ్ది పొందాలి అంటే రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి అన్నారు.సొంత భూమి కలిగిన ప్రతి రైతు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. రైతుకు ఎన్ని గ్రామాల్లో పొలం ఉన్న ఎక్కడో, ఒక చోట మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చీడ పీడలను పైన రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు -ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**మహబూబాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఇసుకాసురులపై కఠినంగా వ్యవహరించాలని, కేసులు నమోదు చేసి కట్టుదిట్టం చేయాలనీ అధికారులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశించారు. జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా పై పోలీసు శాఖ దాడులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిరోధించేందుకు 100 కు డయల్ చేసి పోలీసు వారికీ సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎవరైనా, ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలించినా, అధిక ధరలకు విక్రయించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్లు, స్టాక్ పాయింట్ల భద్రత చర్యలు చేపట్టనున్నట్లు సూచించారు. పోలీసు వారి సూచనలకు విరుద్ధంగా ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక తరలించేందుకు, విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు. ఇతరులు ఎవరైనా తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్స్ అని, ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# కీసర ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**మేడ్చల్ ప్రజాబలం ప్రతినిధి:** కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. చైర్మన్ నారాయణ శర్మ, తదితరులచే మహేందర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

# ఘనంగా ప్రారంభమైన లింగంపల్లి ఎల్లమ్మ జాతర

నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం లింగంపల్లి గ్రామంలో వెలిసిన ఎల్లమ్మ దేవాలయంలో నేడు ఆలయ వంశపారంపర్యం పూజారి అయిన సాయమ్మ నోటికి తాళం వేసే ఘట్టం తో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ జాతర ఐదు మంగళవారాల పాటు కొనసాగుతాయి. మంగళవారం మధ్యాహ్నం సాయమ్మ నోటికి తాళం వేసిన తర్వాత ఆమె పెద్ద బోనం ఎత్తుకొని ఆలయ ప్రదక్షిణ చేసిన తర్వాత భక్తులు తమ మొక్కులను చెల్లిస్తారు.కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ఎల్లమ్మ తల్లికి పేరు కోర్కెలు తీరినవారు మొక్కులు కోళ్ళు మేకల రూపంలో చెల్లిస్తారు ఈ జాతర మహోత్సవాలకు మన రాష్ట్రం నుండే

# కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి:**జిల్లా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, మెస్ సదుపాయం సరిగ్గా లేదని,శుభ్రత కూడా పాటించడం లేదంటూ యూనివర్సిటీ మెస్ ముందు బైటాయించి వందల మంది విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో విద్యార్థులు అందోళనను విరమించారు.

# కౌలు రైతులకు సంక్షేమ, సమగ్ర చట్టం తీసుకురావాలి

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, బ్యాంకు రుణాలు ఇవ్వాలి

## సీపీఐ,కౌలు రైతుసంఘం నాయకుల డిమాండ్.....

దేవనకొండ ఫిబ్రవరి 12 కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తూ, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని సిపిఐ మండల కార్యదర్శి ఎమ్. నరసారావు, కౌలు రైతు సంఘం నాయకులు కోదండ, మహమ్మద్ లు డిమాండ్ చేశారు.

ఈసందర్భంగా సిపిఐ,ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ ఏ.ఎమ్.ప్రసాద్ రాజు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం నూతన సమగ్రమైన చట్టాన్ని వెంటనే తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పుల నేపథ్యంలో కౌలు రైతులకు గణనీయమైన సంఖ్యలో పంటలు పండిస్తున్నారని గుర్తు చేశారు. కోస్తా ప్రాంతాల్లో 80 నుండి 90%, రాయలసీమలో 60 శాతం, ఉత్తరాంధ్రలో 70% వ్యవసాయం కౌలు వ్యవసాయమే అనేది స్పష్టమవుతుందన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల నుంచి ఎలాంటి రుణాలు కానీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు కూడా ఇవ్వడం లేదన్నారు. తక్షణమే కౌలు రైతులని ప్రభుత్వం గుర్తించి కౌలు రైతుల సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో రుణాలు ఇచ్చి ప్రభుత్వము ద్వారా వచ్చే పథకాలు కూడా వర్తింప చేయాలని వారన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందలేని కౌలు రైతులకు కౌలు మిత్ర గ్రూపు ఏర్పాటు చేసి వడ్డీలేని పంట రుణాలు అందించాలన్నారు. భూమిలేని కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే 20 వేలు పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులు,కౌలు రైతులకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం నాయకులు బాబు,బాషా, రమేషు, లక్ష్మయ్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



# అమలాపురంనుంచి కుంభమేళకు ఆర్టీసీ బస్సులు

అమలాపురం నుండి కుంభమేళ కు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు బయలుదేరాయి. ఆర్టీసీ డిపో మేనేజర్ తో పాటు రవాణాశాఖ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఆరు బస్సుల్లో భక్తులు కుంభమేళాకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్ ,విజయవాడ తో పాటు పలు ప్రాంతాల నుండి అమలాపురం వచ్చి కుంభమేళాకు భక్తులు వెళ్లారు. ఎనిమిది రోజులపాటు కుంభమేళ యాత్ర జరగనున్నది. బస్సులో ప్రయాణించే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించామని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. బస్సులో ప్రయాణించే వారికి బ్రేక్ ఫాస్ట్ తో పాటు భోజన సదుపాయాలు కూడా కల్పించారు. భువనేశ్వర్, కోణార్క్, పూరి, త్రివేణి సంగమం, ప్రయాగ, కాశి తో పాటు పలు ఆలయాలు సందర్శన కల్పించారు. రాష్ట్ర మొత్తం మీద 60 బస్సులు బుక్ అయితే ఒక కోనసీమలోనే 20 బస్సులు అత్యధికంగా బుక్ అయ్యాయని వెల్లడించారు. ఆర్టీసీ ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్రైవర్ తో పాటు టెక్నీషియన్ కూడా అందుబాటులో ఉంచారు

# రైతులందరూ తప్పనిసరి విశిష్ట సంఖ్య యూనిక్ కోడ్( యూసి )ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పత్తికొండ మండలంలోని రైతు సేవ కేంద్రం పత్తికొండ 2, మరియు రైతు సేవ కేంద్రం పత్తికొండ 3 జిల్లా వ్యవసాయ అధికారిని ఖ ఒవరలక్ష్మి సందర్శించడం జరిగినది రైతులకి గుర్తింపు సంఖ్య అయినటువంటి ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరుగుతున్న ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి కర్నూల్ వారు మాట్లాడుతూ ప్రతి రైతుకి విశిష్ట సంఖ్య అయినా ఫార్మర్ యూనిక్ ఐడి తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా రైతు సేవ సిబ్బందికి ఆదేశించడం అయినది ఇందులో రైతులతో మాట్లాడుతూ పట్టా పొలం ఉన్నటువంటి ప్రతి ఒక్క రైతు ఫార్మర్ యూనిక్ నెంబర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకోవాల్సిందిగా తెలియజేశారు అలాగే మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైనది ఈనెల 25వ అనగా25/02/2025 తేదీన ఆఖరి తేదీ కావున ప్రతి ఒక్క రైతుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసి చేయని వారికి కూడా తెలియజేసి వారికి కూడా రిజిస్ట్రేషన్ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అయినది ఈ కార్యక్రమంలో పత్తికొండ డివిజన్ సహాయ సంచాలకులు ఏ మోహన విజయ్ కుమార్ సార్ ఏ వెంకటరాముడు మండల వ్యవసాయ అధికారి పత్తికొండ అలాగే వ్యవసాయ విస్తరణ అధికారులు రియాజ్ మరియు శ్రీ నాథులు అలాగే రైతు సేవ కేంద్రం సిబ్బంది సావిత్రి రాధాబాయి రైతులు పాల్గొనడం జరిగినది పత్తికొండ మండలం లోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న రైతు సేవ కేంద్రాలలో ప్రతి రైతు పట్టా పొలం ఉన్నవాళ్లు గుర్తింపు సంఖ్యను రిజిస్ట్రేషన్ చేసుకోవలెను ఆధార్ తో ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నెంబర్లతో యూనికోడ్ యు సి ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది

ప్రభుత్వం భూ యజమానులకు మాత్రమే ముందుగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఎందుకనగా తొలత పిఎం కిసాన్ లబ్ధిదారులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్లు జారీ చేస్తారు ఆ తర్వాత మిగిలిన భూ యజమానులకు జారీ చేయనున్నారు దీనివలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరి ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ లో నమోదు కావాలని తెలియజేస్తున్నాము ప్రతి రైతుకు జారీ చేసే యూనిట్ ఐడీకి ఆయా రైతుల సీజన్లో పొందే సబ్సిడీలు రుణాలు పంట బీమా వంటి పథకాలు అనుసంధానం చేస్తారు ఇలా తయారైన ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ ఐడి ల్యాండ్ ఏపీ ఐ ఆధార్ బెస్ట్ అతంటికేషన్ మరియు పిఎం కిసాన్ వంటి డిజిటల్ అగ్రికల్చర్ ప్లాట్ ఫామ్ కు అనుసంధానం చేస్తారు

# అనాధలను అక్కున చేర్చుకోవాలి

సూర్యాపేట ప్రతిఒక్కరూ సమాజ సేవ పట్ల భాగస్వాములు కావాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, ముకుందపురం గ్రామంలో.. ఇందిరా వృద్ధ అనాధ ఆశ్రమంలో.. 11 లక్షల రూపాయలతో దాతలు శ్రీనివాస్, ఇందిరా సహకారంతో నిర్మించిన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అందరున్నా అనాధలుగా ఆశ్రమంలో జీవిస్తున్నారనీ.. అలాంటి వారిని చేరదీసి అక్కున చేర్చుకోవడం గొప్పతనం అని అన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యునిగా.. ఇందిరా వృద్ధ అనాథ ఆశ్రమానికి అన్నివిధాలుగా సహకరిస్తానని తెలిపారు. తిరుపతి దేవాలయం దేశంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమని నర్సిరెడ్డి కొనియాడారు. భవన నిర్మాణానికి సహకరించిన శ్రీనివాస్- ఇందిరా దంపతులను నర్సిరెడ్డి సన్మానించారు

## శేరిలింగంపల్లి లో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులు

రంగారెడ్డి చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రో స్టేషన్ నుండి బి హెచ్ ఈ ఎల్ చౌరస్తా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను జి హెచ్ ఎం సి అధికారులు తొలగించారు. మాదిన గూడ నుండి సంగారెడ్డి వరకు సిక్స్ లైన్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు కి ఇరువైపులా ఆక్రమణల తొలగింపులు జరిగాయి. చందానగర్ టౌన్ ప్లానింగ్,లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీసు అధికారుల పర్యవేక్షణ లో తొలగించారు.

# కాంగ్రెస్ కులగణన తప్పుల తడక...

**42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి.**

**కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసానికి కేరాఫ్ అడ్రస్**

**కులగణన పై ఈ నెల 14న రౌండప్ సమావేశం.**

**42 శాతం రిజర్వేషన్ల వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది.**

**గ్రెస్ బిసిలకు న్యాయం చేసేదాక వదిలిపెట్టం**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్.**

గోదావరిఖని తెలంగాణ రాష్ట్రంలోని బిసిలను అనుగదొక్కెందుకే రెవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నాడు... అత్యధిక జనాభా కలిగిన బిసిలను అనుగదోక్కేందుకే కులగణన పేరుతో సర్వే చేపట్టిందని... కులగణన సర్వే అంతా తప్పుల తడకని... కాంగ్రెస్ పార్టీ అంటేనే మె?సానికి కెరాఫ్ అడ్రస్ అని రీ సర్వే నిర్వహించకుంటే బీసీల పక్షాన ఉద్యమం చేస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించే బిసి రౌండ్ టేబుల్ సమావేశం కు అందరూ హాజరుకావాలని ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాజీ కోరుకంటి చందర్ మాట్లాడుతూ... సర్వేలో పేరుతో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి ఓసీల జనాభాను పెంచారన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సకలజనుల కుటుంబాల సర్వేకు ప్రస్తుతం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగనన సర్వేను ఆ పార్టీకి సంబంధించిన నేతలే తప్పుపడుతున్నారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు రావడంలేదని విమర్శించారు. బీసీ కులాలు ఐక్యం కావలసిన అవసరం ఉందని ఈనెల 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి బీసీ ఉప కులాలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయం పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో సర్వే పేరుతో బీసీ ఉపకులాల వర్గాలకు చేసిన అన్యాయంతో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని స్పష్టం చేశారు. కుల గణన సర్వేలో 5న్నర శాతం బిసి జనాభా తగ్గించి దాదాపు 22 లక్షల మంది లేనట్టుగా చేసింది రెవంత్ సర్కార్ అన్నారు. బీసీ వర్గాలను లక్షలాది సంఖ్యల్లో తగ్గించి చూపిన సిఎం రెవంత్ బిసిలకు క్షమాపణ చెప్పాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ మాత్రమే బిసిలకు పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం సీట్లు కెటాయించిందని గుర్తు చేశారు. అసెంబ్లీ 34 పార్లమెంటు లో 6 సీట్లు కెటాయించిదన్నారు. కులగణన జరిగిన తరువాత బిసి లు ఆందోళన కు గురైతున్నని కాంగ్రెస్ చేపట్టిన కులగణన పూర్తిగా బీసీలకు అన్యాయం జరిగేలా ఉదన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో 24 గంటల్లో సమగ్ర కుటుంబ సర్వే చేయించారన్నారు.

కులగణన పై ఈ నెల 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో చేపట్టే రౌండ్ టేబుల్ సమావేశం లో బీసీ కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్ నూతి తిరుపతి, అచ్చ వేణు, కల్వచర్ల కృష్ణవేణి,సట్టు శ్రీనివాస్ అల్లం అయులయ్య సంధ్యారెడ్డి, కోడి రామకృష్ణ,వెంకన్న కిరణ్ జీ , సారయ్య నాయక్ వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటి జేఈఈ మెయిన్ 2025(ఫస్ట్ సెషన్)

# ఫలితాలలో ఆల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం




**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:**2025 (ఫస్ట్ సెషన్)ఐఐటి జేఈఈ మెయిన్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా నగరంలోని వావిలాల పల్లి లోనిటైనీ టాట్స్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్.వి నరేందర్ రెడ్డి, తమ విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ పరీక్షలో అనిరుద్ సాయి 99.90 పర్సంటైల్ వమిక 99.88 పర్సంటైల్ ఈ. అంకిత్ సాయి 99.81 పర్సంటైల్ సాయి సుముఖ 99.69 పర్సంటైల్ విశాల్ 99.61 పర్సంటైల్ రిషికేష్ 99.53 పర్సంటైల్ రామ సుమిత్ 99.51 పర్సంటైల్, అబ్దుల్ హక్ 99.48పర్సంటైల్ అబ్దుల్ జిషన్, 99.41పర్సంటైల్ శశి ప్రీతం 99.38పర్సంటైల్ ఈ కార్తీక్ రెడ్డి 99.09 పర్సంటైల్, 99 ఆపై పర్సంటైల్ సాధించిన విద్యార్థుల సంఖ్య 11, 98 ఆపై పర్సంటైల్ సాధించిన విద్యార్థుల సంఖ్య 53 తో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లుగా పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ డాక్టర్.వి నరేందర్ రెడ్డి, కష్టపడి సాధించిన ఫలితాలు అందరికి ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించబడే ప్రత్యేక శిక్షణ, సీనియర్ అధ్యాపకుల మార్గదర్శకత్వం, అభ్యాసం ద్వారా మాత్రమే ఈ అద్భుత ఫలితాలు సాధించగలిగినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ విజయానికి కారణమైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మిర్తిపాడు లో డేంజర్ జోన్ గుర్తులు

కాకినాడ తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తిపాడులో అధికారులు, వైద్య బృందం అప్రమత్తమయ్యారు. రెడ్ జోన్ గా ప్రకటించడంతో కోళ్ల ఫారం వద్ద ఫ్లెక్సీల పెట్టి నిషేధిత ప్రాంతంగా డేంజర్ గుర్తులను పెట్టారు. మిర్తిపాడు గ్రామంలో ప్రజలను అలెర్ట్ చేస్తూ పోలీసులు, వైద్యులు మైకుల ద్వారా ప్రకటనలు చేసారు. సీతానగరం మండలంలో ఉన్న 15 కోళ్ల ఫారాలలో మెడికల్ బృందాలతో పర్యవేక్షణ జరుగుతోంది. గ్రామంలోని ఇంటింటికి మెడికల్ బృందం సర్వే నిర్వహిస్తూ, శానిటేషన్ పనులు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇప్పటికే పలు కోళ్ల ఫారాలలో ఉన్న కోళ్లను సైతం తరలించేసినట్లు కొంతమంది కోళ్ల ఫారం యజమానులు చెబుతున్నారు..మిర్తిపాడు గ్రామంలో ఇప్పటికే 144 సెక్షన్ కూడా అమలులో ఉండడంతో గ్రామంలో పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు.

## డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చదారాలు, దుర్గంధపు నీరు..

## ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు...



దుంబ్రిగుడమండల కేంద్రం దుంబ్రిగూడ ఫై వీధిలో డ్రైనేజీల్లో చెత్త చెదారం తో పాటు మురుగునీరు చేరుకోవడంతో పలు దుర్వాసనలు వెదజల్లుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చలికాలం పోయి వేసవికాలం ప్రారంభం కావడంతో డ్రైనేజీల్లో చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల మురుగునీరు అక్కడ నిల్వ ఉండిపోవడం వల్ల దోమలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని, దీంతో మలేరియా డయోరియా టైఫాయిడ్ వంటి రోగుల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించి ప్రతినిత్యం డ్రైనేజీల్లో పూడుకుపోయిన చెత్తాచెదారాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఎటువంటి మలేరియా డైయూరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# దక్షిణ భారతదేశాన్ని దోచి ఉత్తర భారత దేశాన్ని పోషిస్తున్నారు

## ఖమ్మం ఎంపి కాంటెస్ట్ అభ్యర్థి ఖమ్మం జిల్లా మైనార్టీ నాయకులు షేక్ మహ్మద్ రసూల్



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 12 (ప్రజాబలం)** ఖమ్మం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పాలకుల సవితి తల్లి ప్రేమతో దక్షిణ భారతదేశాన్ని దోచి ఉత్తర భారత దేశాన్ని పోషిస్తున్నారని ఖమ్మం ఎంపి కాంటెస్ట్ అభ్యర్థి ఖమ్మం జిల్లా మైనార్టీ నాయకులు షేక్ మహ్మద్ రసూల్ ఆరోపించారు. భారతదేశంలో ఒక రాష్ట్రల నుండి పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్రం నుండి 100 రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి ఇస్తే అదే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి49.8 రూపాయలు తిరిగి ఇస్తుంది అలాగే ఆంధ్రప్రదేశ్ 100 రూపాయలు ఇస్తే వెనక్కి 46 రూపాయలు ఇస్తుంది అలాగే ఉత్తర ప్రదేశ్ వంద రూపాయలు ఇస్తే వెనక్కి తిరిగిచ్చే రూపాయలు 333.2 రూపాయలు మధ్యప్రదేశ్ వంద రూపాయలు ఇస్తే 279.1 వెనక్కి తిరిగిస్తుంది. అలాగే బీహార్ రాష్ట్రం వంద రూపాయలు ఇస్తే 922.5 వెనక్కి తిరిగి ఇస్తుంది. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కు తమ వాటాలుగా తెలంగాణ కు 3.637 కోట్లు ఆంధ్రప్రదేశ్ కు 7.002 కోట్లు తమిళనాడు కు 7.057 కోట్లు కర్ణాటక కు 6.310 కోట్లు కేరళ కు 3.330 కోట్లు 5 రాష్ట్రాలకు కలిపి మొత్తంగా 27.336 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినది. ఒక్క ఉత్తరప్రదేశ్ కు 31.039 కోట్లు బీహార్ కు 17.403 కోట్లు మధ్యప్రదేశ్ కు 13.582 కోట్లు ఈ మూడు రాష్ట్రాలకు కలిపి 62. 024 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలకు వాళ్ళ ఓటు బ్యాంకును మలుచుకోవడం కోసం కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు

# తెలంగాణ ఓబిసి కోఆర్డినేటర్ నియామక పత్రాన్ని తీసుకున్న ముత్తినేని రవి కుమార్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 12 :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ వారి చేతుల మీదుగా తెలంగాణ ఓబిసి కోఆర్డినేటర్ నియమక పత్రాన్ని తీసుకున్న ముత్తినేని రవి కుమార్.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ...నా మీద నమ్మకంతో తెలంగాణ కోఆర్డినేటర్గా నియ మించిన అజయ్ సింగ్ కి, సీపీపీ చైర్ పర్సన్ సోనియా గాంధీజీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ కార్గో రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,పీసీసీ ప్రెసి డెంట్ మహేష్ కుమార్ గౌడ్ కి మంచిర్యాల నియోజకవర్గం శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకి మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు సురేఖమ్మకి, ఓబిసి చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్కి హృదయపూర్వక కృతజ్ఞత తెలుపుతున్నాను.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

## ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 12:** ప్రతి నిరుపేదలకు ఇళ్లు ఉండాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు లో భాగంగా అర్హులకు ఇళ్ళను అందించడమే కాకుండా మౌళిక వసతులను కల్పిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి అన్నారు.

బుధవారం కీసర మండలంలోని కీసర, చీర్యాల గ్రామాలలో అర్హులైన 71 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేసే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని అన్నారు. పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల కాలనీలలో మంచినీటి సదుపాయాలు, మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి, ప్రస్తుతం ఎకరాకు రూ. 6000 చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ, ఎవరు కార్డు రాలేదని బెంగ పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.



అంతకు ముందుగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ శర్మ పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించినారు.

ఈనెల 26 నుండి ప్రారంభమయ్యే శివరాత్రి బ్రహ్మోత్సవాల కు సుమారు 6 లక్షల మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. భక్తుల కోసం 350 ఆర్టీసీ బస్సులు, బస్ స్టాప్ నుండి గుట్ట పైకి 8 ఉచిత బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు.40 మంది అధికారుల పర్యవేక్షణలో 1800 మంది పోలీసులతో గట్టి బందోబస్తు, పార్కింగ్, మంచినీటి సదుపాయాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు చేయాలన్నారు.

# సి.డి.ఎం.ఏ అధికారిణిని కలసిన మణికొండ బి.ఆర్.ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 12** ఫిబ్రవరి 2025 మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆద్వర్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ మరియు కమిషనర్ శ్రీదేవిని మర్యాద పూర్వకంగా కలిసి మణికొండలో నెలకొన్న పలు సమస్యలపై ముఖ్యంశాలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ముఖ్యముగా మణికొండ పురపాలక సంఘ పరిధిలో దాదాపు 350 మంది సఫాయి కార్మికులు పనిచేస్తున్నారు, వీరికి 1.5.2023 తర్వాత జీతభత్యాలు పెరగని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని వీరి జీతాలు 24 వేల వరకు పెంచవలసిందిగా కోరుతున్నాము. అట్లనే సంవత్సరానికి 15 సాధారణ సెలవులు ఉన్నప్పటికిని వారికి ఆ సదుపాయం ఇవ్వడం లేదు. అవుట్సోర్సింగ్ లో ఉన్న వారందరినీ పర్మనెంట్ చేయవలసింది గాను మరియు పిట్టల ఆనంద్ అనే సఫాయి కార్మికుడు చనిపోతే అతనికి కనీస అవసరాలు తీర్చక, అతని భార్యకు ఉద్యోగం ఇచ్చినప్పటికీ జీతభత్యాలు ఇవ్వకపోవడం చాలా శోచనీయం.

అలాగే మణికొండలో ఉన్న ఇండ్లకు ఆస్తి పన్నును పెంచే ముందు ఏ రకమైన నోటీసు ఇవ్వకుండా, ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా పూర్తి సంవత్సరమునకు కట్టిన ఆస్తి పన్నును సగంకు ఆమోదించి మిగితా సగం ప్రక్కన పెట్టీ, ఆస్తి పన్ను పెంచి ఆపై వడ్డీతో సహా కట్టమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబో సదరు అధికారులు జవాబు చెప్పవలెనని మరియు పాత ఇండ్లకు ఆస్తి పన్ను కట్టుతున్నప్పటికి వారినీ ప్రస్తుత ఆస్తి మార్కెట్ ధర అనుసారం పెంచడం చట్ట ప్రకారము సరైన పద్ధతి కాదు.

ఈ మధ్య పురపాలక సంఘానికి ?230 కోట్లు స్టాంపు డ్యూటీ ద్వారా వచ్చిన బడ్జెట్ దృష్టిలో ఉంచుకొని రోడ్ల మరమ్మత్తులు రోడ్లు వెడల్పు మరియు కొత్త రోడ్లను వేస్తూ, హై టెన్షన్ లైన్ల కింద అల్కాపూర్ టౌన్షిప్ - నార్సింగ్ సెక్షన్ వెంకటేశ్వర కాలనీలలో చేపట్టాలని కోరడమైనది. రోడ్లు వెడల్పు చేసే సమయంలో వీధి వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని వారికి పురపాలక సంఘమే షాపులు నిర్మించి భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ వారు నిర్వహిస్తున్న తీరుగా ఇక్కడ కూడా వారికి షాపులు ఇవ్వాల్సిందిగా కోరడమైనది.

ఇట్టి కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, పట్లోళ్ల రూపా రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంఘం శ్రీకాంత్, బొడ్డు శ్రీధర్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, భాను చందర్, సయ్యద్ రఫీక్, అశ్వక్ అలీ, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షులు గా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త.

సమాజంలోని అందరికీ సేవ చేస్తూ ఆర్యవైశ్య మహాసభ ఖ్యాతిని పెంపొందిస్తా.
శక్తివంచన లేకుండా కృషి చేసి ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి కృషి.
మెదక్ జిల్లా అధ్యక్షులు గా ఎన్నుకున్న జిల్లా ఆర్యవైశ్య పెద్దలందరికి పేరుపేరునా కృతజ్ఞతలు.
మెదక్ జిల్లా అధ్యక్షులుగా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త.



**గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్, ఫిబ్రవరి, 12.** ప్రజాబలం ప్రతినిధి :-ఆర్యవైశ్య మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షులు గా తూప్రాన్ మున్సిపల్ 6వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త ను నియమిస్తూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 9వ తేదీన పల్లెర్ల రవీందర్ గుప్త తన నామినేషన్ దాఖలు చేయగా పోటీలో ఉండడానికి ఎవరు కూడా ముందుకు రాక పోవడంతో సింగిల్ నామినేషన్ పత్రాలను పరిశీలించి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణికుంట్ల గణేష్ గుప్త, కోశాధికారి కొండ్లె మల్లిఖార్జున్ లు మాట్లాడుతూ తూప్రాన్ ఆర్యవైశ్య ముద్దు బిడ్డ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త సమాజ అభివృద్ధికి, ఆర్యవైశ్యల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా ఎనలేని కృషి చేసి ఆర్యవైశ్య మహాసభ ఖ్యాతిని పెంచాలని సూచిస్తూ వాసవిమాత దీవెనలతో లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త ఆయురురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలు కాలుగాలని కోరారు. అనంతరం ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త మాట్లాడుతూ ఈ మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికల రిటర్నింగ్ అధికారి గా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ గుప్త, గౌరిష్ గుప్త గారికి, అలాగే తన ఎన్నికకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన మెదక్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ చంద్రపాల్ గుప్త, మార్గదర్శకులు శివనంది నారాయణ సార్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త, మెదక్ జిల్లా రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు వట్మూరి వీరేశం గుప్త, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు చెగుంట రాజు గుప్త, కాళ్ళాకల్ మాధంశెట్టి వెంకటేష్ గుప్త, బుక్క అశోక్ గుప్త, పల్లెర్ల బాలేశ్ గుప్త, కోవూరి శ్రీనివాస్ గుప్త లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన పై నమ్మకం ఉంచి మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గా నియమించి నందుకు పదవికి న్యాయం చేసి సద్వినియోగం చేసుకోని అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనదైన శైలిలో సామాన్యులకు సైతం తన సేవా కార్యక్రమాలు అందేలా కృషి చేసి ఆర్యవైశ్య మహాసభ ఖ్యాతిని ఆర్జించిపెట్టి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చి ఉన్నత స్థానం లో నిలుపెందుకు అందరి సహకారం తో తనకున్న అనుభవాన్ని క్రోడీకరించి కృషి చేస్తానని చెప్పారు. తన సహచర ఆర్యవైశ్యుల అభ్యున్నతికి పాటుపడుతూ ఎక్కడైతే తన అవసరం సహకారం ఉందో గుర్తించి అక్కడ ఖచ్చితంగా ముందుండి వాసవిమాత చల్లని దీవెనలతో సేవ చేస్తానని తెలిపారు.

# యువతకు ఉద్యోగ అవకాశాల కోసం...

## మల్క కొమురయ్య గారిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం..

## బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిత్తరంజన్ రెడ్డి..

## గజ్వేల్ అసెంబ్లీ ఇంచార్జ్..



**గజ్వేల్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** :-విద్యారంగంలో మార్పు కోసం జరగబోయే టీచర్స్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య గారిని గెలిపించాలని తూప్రాన్ లో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు.. యువత కు ఉద్యోగ అవకాశాలు కలగాలంటే జరగబోయే కరీంనగర్ నిజాంబాద్ మెదక్ అదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును బిజెపికి వేసి గెలిపించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి సభ్యులు బండారు దుర్గారావు యాదవ్ గజ్వేల్ అసెంబ్లీ ఇంచార్జ్ సాయిబాబా తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు భూమన్న గారి జానకిరామ్ గౌడ్ వెంకట్ గౌడ్ నరేష్ గౌడ్ నరేందర్ చారి తదితరులు పాల్గొన్నారు..

# కరుణగిరి ఉత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన డాక్టర్ సగిలి ప్రకాష్





**ఖమ్మం ప్రతినిది ఫిబ్రవరి12 (ప్రజాబలం)**ఈ నెల 27 28 మార్చి-1 తేదీలలో జరగబోయే కరుణగిరి పుణ్యక్షేత్రం ఉత్సవాల పోస్టర్ ను స్థానిక కరుణగిరి చర్చిలో ఖమ్మం మేతాసనం మహ ఘన డాక్టర్ శ్రీ శైలి సగిలి ప్రకాష్ బుధవారం ఆవిష్కరించారు కరూణగిరి డైరెక్టర్ ఫాదర్ వరప్రసాద్ రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో దశాబ్దాల కాలంగా కరుణగిరి ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నదని ఈ వేడకల్లో తెలుగు రాష్ట్రాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు హజరావుతున్నారని ఈ సారి కూడా కరుణగిరి ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాతకంగా ఆధ్యాత్మికంగా నిర్వహిస్తామని తెలిపారు కరుణామయుడై యేసు ప్రభువు, మేరిమాత కొలువై ఉన్న కరుణగిరి పుణ్యక్షేత్రం భక్తుల అధ్యాత్మక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు శాంతి సమాధానం ప్రబోధించిన మొసుప్రభువు భోధనలు అందరిని రక్షణనిస్తూ మార్గదర్శకంగా ఉంటన్నాయన్నారు. కరుణగిరి డైరెక్టర్ పాధర్ వీరప్రసాద్ రాజు మాట్లాడుతూ కరుణగిరి ఉత్సవాలలో ఈనెల 27న మహా ఘన బిషప్ సగిలి ప్రకాష్ చేత ప్రారంభమవుతాయని తెలిపారు ఈ కార్యక్రమాలలో వివిధ ప్రాతాలకు చెందిన మత గురువులు మత కన్యలు నిర్వాహక కమిటీ సభ్యులు సంఘ పెద్దలు విశ్వాసపులు పాల్గోన్నారు

## పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి -జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్




**ములుగు ప్రతినిధి 12 ఫిబ్రవరి 2025:**శ్రీయుత జిల్లా కలెక్టర్ ములుగు గారి ఆదేశాల మేరకు ఈ రోజు జిల్లా పంచాయతీ అధికారి గారి ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే గ్రామపంచాయతీ ఎన్నికల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలకు లోబడి, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా ఎన్నికల కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజ్ తెలిపారు. మంగళవారం ములుగు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల సంబంధించి మొదటి దశ లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం , పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను తయారు చేయడం మరియు రెండవ దశలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అనంతరం ఉపసర్పంచ్ రాష్ట్ర ఎన్నికల కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలకు లోబడి నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాస్థాయి ట్రైనర్స్ తెలియజేసిన అంశాలను సంపూర్ణ అవగాహన చేసుకుని నామినేషన్ల స్వీకరణ సందర్భంలో మరియు నామినేషన్ల పరిశీలన సందర్భంలో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన సందర్భంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహించడం, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం, ఎన్నికల ఫలితాల అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక తదితర విషయాలను ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా నిర్వహించారని



గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ మరియు సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎంపీడీఓ రామకృష్ణ, మల్లంపల్లి ఎంపీడీఓ రహీముద్దీన్,, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు శిరుప సతీష్ కుమార్, ఎండి హమీద్, డి సూర్యనారాయణ ,ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎం శ్రీకాంత్, ఎల్ రమేష్, ఎం మధు, టి రాజేష్, ఏ రవీందర్, పాల్గొన్నారు

## బస్తీ దవాఖాన తనిఖీ



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గ ఫిబ్రవరి 12:**

డా. సి. ఉమా గౌరి,

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా,

యూపీహెచ్‌సీ మల్లాపూర్ పరిధిలోని మారిగూడ బస్తీ దవాఖానను సందర్శించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, బీడీకే సేవలను సమీక్షించారు. ఎప్పుడైనా ఉన్నతికారులు సందర్శన చేసే అవకాశం ఉన్నందున, సిబ్బంది పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

## భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం నేరం కిందికి రాదు

రాయ్‌పూర్ఫి బ్రవరి 12 భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం చేయడం నేరం కిందికి రాదు అని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు వివరించింది. భార్యతో అసహజ శృంగారం చేయడం, ఆ తరువాత ఆమె చనిపోవడంతో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భార్య ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా జగదల్‌పూర్‌లోని అదనపు సెషన్స్ న్యాయమూర్తి భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. భర్త ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ నరేంద్రకుమార్ వ్యాస్ ధర్మాసనం విచారించి తీర్పును వెల్లడించింది. 2013లో ఐపిసి సెక్షన్ 375 సవరణ ప్రకారం నిందితుడి చేసిన పనిని నేరంగా పరిగణించలేమని తీర్పులో పేర్కొంది. భార్య వయసు 15 దాటిని తరువాత భర్త చేసే ఎలాంటి లైంగిక చర్య అత్యాచారం కిందికి రాదని కోర్టు తెలిపింది. సమ్మతి అనే పదానికి ప్రాదాన్యం లేదని, వెంటనే భర్తను జైలు నుంచి విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

# మహిళలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు రండి, వేధింపుల నుండి బయటపడండి.

## ఫిర్యాదు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి - ఆధానపు ఎస్పి శ్రీ. ఎస్. మహెందర్ .



**మెదక్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :-** తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా నిర్వహించిన ఆన్లైన్ కౌన్సిలింగ్ కు జిల్లా ఆధానపు ఎస్పి శ్రీ. ఎస్. మహెందర్ గారు ముఖ్య అతిదులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా అధనపు ఎస్పి శ్రీ. ఎస్.మహేందర్ మాట్లాడుతూ.. ఈ రోజు మెదక్ జిల్లా షి టీం విభాగంలో గత మూడు నెలలో మహిళలకు, బాలికలకు, వేదింపులకు గురి చేసిన కు 72 మంది ఈవ్ టీజర్స్కు ఆన్లైన్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగినది అని అన్నారు . ఇందులో 13 మంది మైనర్ బాలురు మరియు 59 మంది యుక్త వయసు గల వారు ఉన్నారు. షీ టీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తాయని తెలిపారు. షీటీమ్ కంప్లైంట్ %ఌ=% కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుండి అయిన పిర్యాదు చేసేందుకు ఉపయోగపడే ఈ షీటీమ్ కంప్లైంట్ %ఌ=% కోడ్ స్కానింగ్ పోస్టర్స్ ను జిల్లాలో బస్ లలో, బస్ స్టాండ్ లలో, సినిమా హల్ లు, స్కూల్స్, కళాశాలలు, ఇతర ముఖ్యమైన, రద్దీ ప్రాంతాలలో అతికించబడి ఉంటాయని జిల్లాలో ఎవరైనా బాధిత మహిళలు షీటీమ్ కు పిర్యాదు చేయదలుచుకున్నప్పుడు ముందుగానే తమ మొబైల్ నందు %ఌ=% కోడ్ స్కానర్ ను కలిగి ఉండాలని తమ ఫోన్ తో పోస్టర్ పై ఉన్న %ఌ=% కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా %https://qr.tspolice.gov.in% అనే లింక్ వస్తుంది దీనిని క్లిక్ చేయగానే పిర్యాదు ఫోరం ఓపెన్ అవుతుంది. అందులోని పేరు, లొకేషన్ తదితర వివరాలను పూరించి %ంబఎఌ% చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలో షీటీమ్ సాఫ్టువేర్ విభాగానికి చేరుతుంది. అక్కడ నిరంతరం పర్యవేక్షించే సిబ్బంది ఎప్పటి కప్పుడు ఆన్లైన్ లో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆలొకేషన్ కు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు ఫార్వర్డ్ చేయడం ద్వారా సంబంధిత అధికారులు లొకేషన్ కు చేరుకొని




తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి వేధింపులకైన గురయ్యే మహిళలు షీటీంకు పిర్యాదు చేయదలచుకునే మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712657963, ఫోన్ చేసినచో మరియు ( షీ టీమ్ మెదక్ జిల్లా ఫేస్ బుక్, మెయిల్ %sheteammedakdistrict@gmail.com%), ({iÇ³¼sY,@%Msheteam%) పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుంటామని మరియు ఫోన్ చేసిన వారి నెంబరు పేర్లు గోప్యంగా ఉంచుతామని మహిళలు మరియు బాలికల రక్షణ గురించి షీటీమ్స్ పని చేయడం జరుగుతుందని, మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వాట్సప్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని మీకు తెలియకుండా పోలీసులు సివిల్ డ్రస్ లలో ముఖ్య కూడళ్ళల్లో తిరుగుతున్నారని అలాగే చదువుకునే విద్యార్థినిలకు 18 సంవత్సరాలు నిండకుండానే వివాహము చేస్తున్నట్లుగానే తెలిస్తే వెంటనే 1098 కు తెలియజేయాలని మరియు యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్ను మెదక్ జిల్లాలో ప్రారంభించడం జరిగిందని మనుషుల అక్రమ రవాణా జరిగితే వెంటనే సమాచారం అందించాలని ఆర్గనైజ్డ్ నేరాలు చేసే వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి గంగాధర్ మరియు బాల నర్సింలు(%ాజూూా%) షీటీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు ప్రమీల , విజయ్, గంగామణి , స్వరూప, విజయరాణి లు పాల్గొన్నారు.



## ఇటిక్యాల సమ్మక్క సారక్క పూజలు ప్రారంభం

**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 12 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని ఇటిక్యాల గోదావరి నది ఒడ్డున వెలసిన సమ్మక్క సారలమ్మలకు బుధవారం ఉదయం పూజ కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.అనంతరం భక్తులు అమ్మవార్లకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.ఈ పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు,కమిటీ సభ్యులు యువకులు భక్తులు కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం లక్షెట్టిపేట మున్సిపాలిటీ మాజీ వార్డ్ మెంబర్ పటణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న మార్పులతో పేదరికం నిర్మూలించవచ్చు

హైదరాబాద్ రిఫ్లెక్షన్ ఆన్ సొసైటల్ ఛాలెంజెస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జూబ్లీహిల్స్లోని జర్నలిస్టు కాలనీలో జరిగింది. ఇక్రిసాట్లోని కార్టోగ్రఫి డివిజన్ హెడ్గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చెందిన రచయిత కనగరి ఎస్ఎన్. ప్రసాద్ రచించిన ఈ పుస్తకాన్ని మాజీ టీఎస్పీఎస్సీ సభ్యుడు టి. వివేక్, ఇక్రిసాట్ మాజీ డైరెక్టర్ రీసెర్చ్ ప్రోగ్రాం ఏషియల్ సుహాస్ వాని, వరల్డ్ బ్యాంక్ మాజీ మేనేజర్ ఎక్సటర్నల్ అఫైర్స్ కమ్యూనికేషన్ ఎరిక్ చిన్జీలు ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత కనగిరి ఎస్ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో పేదరికం నిర్మూలించడంతో పాటు ఎన్నో సామాజిక అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు. మహిళా సాధికారత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆకలి చావులు, పేదరికం, ఆర్థిక విషయాలను తన పుస్తకంలో రాసినట్లు తెలిపారు. చిన్న చిన్న మార్పులను పద్ధతిగా చేస్తే దేశం ఎంతో ముందుకు వెళ్తుందని పేదరికం లేని దేశంగా తయారవుతుందని ఆయన అన్నారు.

## చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలి పార్టీ శ్రేణులకు జగన్ మోహన్ రెడ్డి పిలుపు

అమరావతి ఫిబ్రవరి 12 ఎపి ప్రభుత్వం మీద వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతోందని వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాడేపల్లి సీనియర్ నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగించారు. సిఎం చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామిల్లో ఏవీ నెరవేర్చుడం లేదని దుయ్యబట్టారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజు రోజుకీ తీవ్రమవుతోందని జగన్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శలు గుప్పించారు. అందుకే ఏవేవో సాకులు చెబుతూ?అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. చంద్రబాబు వంచన, దారుణ మోసాలను.. మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందుకోసం రోజూ ప్రజల్లో ఉండాలని, ప్రజలతో మరింత మమేకం కావాలని జగన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎలు, ఎంపిలు, జడ్పిటిసిలు, మున్సిపల్ ఛైర్ పర్సన్లు, వైసిపి నేతలు, తదితరలు పాల్గొన్నారు.

## శిక్షణలో నేర్చుకున్న అంశాలను తూ.చా. తప్పకుండా ఆచరించాలి

### జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 : స్థానిక సంస్థలు ఎన్నికలు రానున్న సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, విధుల నిర్వహణపై అధికారులు,సిబ్బందికి అందిస్తున్న శిక్షణలో నేర్చుకున్న అంశాలను భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఆచరించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్ లతో కలిసి స్టేజ్-1, 2 ఆర్.ఓ.లు,స్టేజ్-1 ఎ.ఆర్.ఓ., మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,పంచాయతీరాజ్ శాఖ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, హ్యాండ్ బుక్ నిర్వహణ, ఎన్నికల ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి మాట్లాడుతూ... రాబోవు సర్పంచ్, వార్డు సభ్యులు,ఎం.పి.టి.సి., జెడ్.పి.టి.సి. స్థానిక సంస్థల ఎన్నికలలో విధులు కేటాయించబడిన అధికారులు,సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని,ఈ క్రమంలో అందిస్తున్న శిక్షణను ఏకాగ్రత్తతో నేర్చుకోవాలని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి గడువు ముగిసేంత వరకు అధికారులు,సిబ్బందికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సర్పంచ్, ఎం.పి.టి.సి. స్థానాలకు గులాబి రంగు బ్యాలెట్ పేపర్,జెడ్.పి.టి.సి., వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ వినియోగించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో భాగంగా రిటర్నింగ్,సహాయ రిటర్నింగ్, జోనల్, ప్రిసైడింగ్,పోలింగ్ అధికారులు,కౌంటింగ్ సూపర్వైజర్,సహాయకులు ఇతర సిబ్బందిని నియమించడం జరుగుతుందని,ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఫారాలు,కవర్లు, పోలింగ్ సామాగ్రి అవసరమైన మేరకు సమకూర్చడంతో పాటు అదనంగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు.జిల్లాలో ఎన్నికల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

### లక్షెట్టిపేట ఎస్సై సతీష్ 7 మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్




ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఫిబ్రవరి 12 : మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో పేకాట స్థావరంపై లక్షెట్టిపేట ఎస్సై, సతీష్ సిబ్బంధితో కలిసి దాడి చేసి 7 గురు పేకాట రాయుళ్ళను పట్టుకొన్నట్లు బుధవారం తెలిపారు.అయన మాట్లాడుతూ...పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన పేకాటరాయుల్ల నుండి 5బైకులు, 6సెల్ ఫోనులు,13వేల రూపాయల నగదును స్వాదీనం చేసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.పట్టుబడిన వారిలో బత్తుల రమేశ్,కోన తిరుపతి,బేర రాజయ్య,సంగ ఒధయ్య,గోర్క మల్లేష్,వనపర్తుల సుధాకర్,మండే సత్తన్నలను పట్టుకున్నట్లు తెలిపారు.

## పిల్లలు,మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

### మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ







ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 12 : పిల్లలు,మహిళల సంక్షేమం కొరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిప్సికతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ... పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలిక రక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పి.సిపి.ఎన్.డి.టి. యాక్ట్ (గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం),లింగ వివక్షత-లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం,ఆన్లైన్ సేఫ్టీ,సైబర్ క్రైమ్,సఖి సర్వీసెస్ హెల్ప్ నం.181,చైల్డ్ హెల్ప్ లైన్ నం.1098, మహిళా హెల్ప్ లైన్ నం.1930, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్ లైన్ నం.14567, పోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నం.112, సుకన్య సమృద్ధి యోజన,మిషన్ వాత్సల్య కార్యక్రమాలు, చట్టాల గురించి తెలుసుకోవాలని,ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి,మహిళా సాధికారత అంశాలపై వివరించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,మహిళలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ డ్రామాలో మోసపోయిన చంద్రబాబు


విశాఖపట్నం పాలిటిక్స్ పై మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్గా మారాయి.ఇక మీదట పాలిటిక్స్కు చోటు లేదని సంచలన ప్రకటన చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై కే.ఏ పాల్ రియాక్ట్ అయ్యారు.ప్రజా రాజ్యమే జనసేనగా ఆవిర్భవించిందన్న చిరంజీవి.. పూటకో స్టేట్మెంట్ ఇస్తున్నారని మండిపడ్డారు. పవన్, చిరంజీవి బీజేపీలో చేరుతారని తాను ఎప్పుడో చెప్పానన్నారు. పవన్ కళ్యాణ్ డ్రామాలో చంద్రబాబు మోసపోయారని పేర్కొన్నారు. పవన్ని నమ్మి చంద్రబాబు తన కొడుకుకే అన్యాయం చేస్తున్నారు అని తెలిపారు.వాళ్లకి ఓటు బ్యాంక్ లేదన్న వాస్తవం మీకు తెలియదా అని ప్రశ్నించారు. కోర్టులు, జడ్జీలను వీళ్ళు ఎలా మేనేజ్ చేస్తున్నారో తన దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని.. వాటిని సరైన టైంలో బయటపెడతానని తెలిపారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్ డ్రామాని సీరియస్గా తీసుకోకండని పేర్కొన్నారు. అమెరికాలో తెలుగు విద్యార్థుల కోసం 72 గంటల పాటు ఆమరణ దీక్ష చెయ్యాలని నిర్ణయించుకున్నానని అన్నారు.

## పోస్ట్ కార్డులతో నిరసన తెలియజేసిన మహిళలు..



జమ్మికుంట బి ఆర్ ఎస్వి టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలు నిండినటువంటి మహిళలకు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలుపుకోవాలని పోస్ట్ కార్డులతో నిరసన తెలియజేశారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి. జమ్మికుంట బిఆర్ఎస్వి టౌన్ ప్రెసిడెంట్ కొమ్ము నరేష్ బి ఆర్ ఎస్ వి రాష్ట్ర కార్యదర్శి హరీష్ వర్మ అప్పని గవర్నమెంట్ ఇంటర్నెట్ డిగ్రీ పీజీ మహిళా విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం రావడం కోసం అనేక హామీలు ఇచ్చి స్వయంగా రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి నిండు సభలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు స్కూటీలు ఇస్తానని అదేవిధంగా పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు పదివేల రూపాయలు ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు 15 వేల రూపాయలు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు 25 వేల రూపాయలు పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు 50 వేల రూపాయలు విద్యా జ్యోతి పథకం కింద ఇస్తామని చెప్పిన తుగ్లక్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తట్లేదని కావున వారు చెప్పిన హామీలు అమలు చేయాలని రాహుల్ గాంధీ కి పోస్ట్ కార్డు ద్వారా నిరసన తెలియజేశారు. మరియు ఇచ్చిన హామీల గురించి పోస్ట్ కార్డు ద్వారా రాహుల్ గాంధీకి చేరేలా వారి అడ్రస్ కు పోస్ట్ చేశారు. ఇప్పటికైనా విద్యావంతులు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యను వ్యాపారం చేసి నేడు రాజకీయం చేయబోతున్న ఊట్కూరి నరేందర్ రెడ్డి,, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని చిత్తుచిత్తుగా ఓడగొట్టాలని విద్యాసంస్థల పేరు ఆల్ఫోర్స్ బ్రాండ్ గా చేసుకుని ఊట్కూరి నరేందర్ రెడ్డి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి అని ప్రచారం చేస్తున్న ఎందుకు అధికారులు పట్టించుకోవడంలేదని వెంటనే నరేందర్ రెడ్డి, పై చర్యలు తీసుకోవాలని విద్యాసంస్థల పేర్లు ఎక్కడ వాడకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు రాపర్తి అరవింద్ గౌడ్, చాతల రంజిత్,ఒట్టే నాగదేవ్, శిరీష, లావణ్య, తేజస్విని, విద్య లు పాల్గొన్నారు..

## 19న సిఇసి, ఇసి నియామకాలపై పిటిషన్ల విచారణ



న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 2023 చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసిల) నియామకాలను సవాల్ చేస్తున్న పిటిషన్లను ఈ నెల 19న విచారిస్తామని సుప్రీం కోర్టు బుధవారం ప్రకటించింది. ఈ లోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఆ పిటిషన్లను బుధవారం విచారిస్తామని ఇంతకుముందు ప్రకటించారని, కానీ వాటిని 19న విచారణ జాబితాలో చేర్చారని ఎన్జిఒ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) తరఫున హాజరవుతున్న న్యాయవాదిప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్తో కూడిన ధర్మాసనంతో చెప్పారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ 18న రిటైర్ కానున్నారని, తాము సవాల్ చేసిన 2023 చట్టం కింద కొత్త సిఇసిని ప్రభుత్వం నియమించవచ్చునని, కనుక ఈ కేసును అత్యవసరంగా విచారించవలసి ఉందని ప్రశాంత్ భూషణ్ వాదించారు.'మేము ఈ కేసు విచారణను 19కి నిర్ధారిస్తున్నాం. ఈలోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు తప్పవు' అని బెంచ్ స్పష్టం చేసింది. జస్టిస్ కాంత్ అస్వస్థతతో ఉన్నందున కేసుల విచారణను 19న నిర్ధారిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రీ తమకు తెలియజేసిందని ఎన్జిఒ తరఫున హాజరవుతున్న ప్రశాంత్ భూషణ్ చెప్పారు.ఇక అన్ని వ్యవహారాలను 19న విచారణకు చేపడతామని జస్టిస్ కాంత్ తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 3న ఈ కేసు విచారణను బుధవారానికి (12కు) నిర్ణయిస్తూ యోగ్యత ప్రాతిపదికను అంతిమంగా కేసును తేలుస్తామని స్పష్టం చేసింది.ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)తో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా నియామకానికి ఇసిలను ఎంపిక చేయవలసి ఉంటుందని 2023 నాటి తీర్పు స్పష్టం చేసిందని భూషణ్ అంతకుముందు చెప్పారు. 'వారు ఒక చట్టం తెచ్చారు. దాని కింద ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, మరొక మంత్రిని తీసుకువచ్చారు, ఆ విధంగా కమిషనర్ల నియామకం ప్రభుత్వం సంతుష్టి మేరకే జరుగుతుందన్న మాట. ఎన్నికల కమిషనర్ల నియామకానికి స్వతంత్ర కమిటీ ఉండడం అవసరం' అని భూషణ్ బెంచ్తో చెప్పారు. 2023 మార్చి 2 నాటి రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకారమే సిఇసి నియామకం జరపాలని కేంద్రాన్ని ఆదేశించవ

## విద్యార్థుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:విద్యార్థులు దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ఉపాధ్యాయుల గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.

నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళ మేళ, సైన్స్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ బుధవారం సందర్శించారు.

కస్తూరిబా బాలికల పాఠశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు తయారుచేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు అందమైన వస్తువులను స్వతహాగా తయారు చేస్తున్నారని, ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ మేళాను సందర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో ఎంతో కళా నైపుణ్యం బాగుందని, దాన్ని వెలికి తీయాలని అన్నారు. ప్రజలు ఈ మేళాను సందర్శించి అందమైన ఆకట్టుకునే కళాకృతులను కొనుగోలు చేయవచ్చని సూచించారు. ఈ మేళాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

## కేరళ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి పవన్

కొచ్చి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం నాడు కొచ్చిలో పలు ఆలయాలను సందర్శించారు. ముందుగా చొట్టనిక్కరలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయానికి చేరుకున్నారు. పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన తనయుడు అకిరా నందన్, టీటీడీ బోర్డు సభ్యుడుశ్రీ ఆనంద్ సాయి ఉన్నారు. అగస్త్య ఆలయం ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు డాక్టర్ యోగిదాస్, ఇతర సభ్యులు పవన్ కళ్యాణ్ కి స్వాగతం పలికారు. కేరళ సంప్రదాయంతో ఆలయ పండితులు పవన్ కళ్యాణ్ కి పూర్ణకుంభ స్వాగతం పలికారు. తర్వాత ఆయనతో ఆలయ సంప్రదాయాలను అనుసరించి ప్రదక్షిణ చేశారు. అనంతరం అగస్త్య మహర్షి కి పవన్ కళ్యాణ్ సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ఇతర మహా ఋషుల ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ ఆకృతిని, కట్టడాలను ఆసక్తిగా పరికించారు. ఆశ్రమ వివరాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అగస్త్య ఆశ్రమంలో ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించే మూలికలు, మొక్కల గురించి ఆశ్రమ వైద్యులు విష్ణు యోగి, మణి యోగి వివరించారు. అగస్త్య మహర్షి పురాణాల్లో, వేదాల్లో చెప్పినట్లుగా కీలకమైన మర్మ చికిత్సకు మూలికలు ఎలా ఉపయోగపడతాయి అన్నది కూడా అడిగి తెలుసుకున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com